శ్రీ ప్రణవపీఠం
ఏలూరు

# ప్రణవ పద్మాకరం

మాస పత్రిక

సెప్టెంబర్, 2022



ప్రణవపీఠాధిపతి, త్రిభాషామహాసహస్రావధాని

**- బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్**

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక

సెప్టెంబర్, 2022 — **విషయ సూచిక** — సంచిక-9 సంపుటి-1


| | | |
|---|---|---|
| సంపాదకీయం 3<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | శ్రీ గణేశ పురాణం 4<br>శ్రీమతి పాలగుమ్మి (వద్దిపర్తి) శ్రీవిద్య | శ్రీ వేంకటేశ్వర రహస్యం 5<br>శ్రీమతి నిడుముక్కల (వద్దిపర్తి) శ్రీకళ |
| ఋషిచరిత్ర 7<br>శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం | ఐశ్వర్యయోగం 8<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | పురాణంలో మహిళలు 9<br>శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| స్తోత్రమాలిక 11<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | పండుగ విశేషాలు 12<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | సత్సంగ సమాచారము 14<br>శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| మణిద్వీప వర్ణన 16<br>శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం | దసరా పూజా విధానం 26<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | దసరా కథలు 31<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |


పూజ్య గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువు గారికి జయము జయము

మహాగణాధిపతయే నమః — శ్రీ గురుభ్యో నమః — శ్రీ మాత్రే నమః

పూజ్య గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు ,శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు

https://srivaddipartipadmakar.org

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



సత్యం వద - ధర్మం చర

శ్రీ ప్రణవపీఠం

ఏలూరు

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

ఓం ఐం హ్రీం శ్రీం శ్రీమాత్రేనమః

శ్రీ ప్రణవ పీఠం
(రామా నగర్,బావిశెట్టివారిపేట,ఏలూరు-1)

## ఆహ్వానము



పూజ్య గురుదంపతులు
బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు,
శ్రీమతి రంగవేణి అమ్మగారి
నిర్వహణలో శరన్నవరాత్రుల
మహోత్సవములు 26-09-2022,
సోమవారము నుండి
05-10-2022, బుధవారము
వరకు జరుపబడును

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




శ్రీ మహాగణాధిపతయే నమః　　శ్రీ గురుభ్యోనమః　　శ్రీ మాత్రేనమః

## అమ్మ

అమ్మ అమృతవర్షిణి భక్తితో రెండు చేతులు జోడించి నమస్కరిస్తే చాలు అమ్మ కదా!కరుణతో కనికరిస్తుంది కరుణామూర్తి.ఆకతాయి పిల్లల్ని కోప్పడినట్టు కర్మఫలం వల్ల ఆగ్రహిస్తుంది కానీ శిక్షించదు. అనుగ్రహానికి,భక్తికి మధ్య దోబూచులాటల సంకట పరిస్థితుల్లో అమ్మను దూషించినా సరే అమ్మ కదా! చిరునవ్వుతో అక్కున చేర్చుకుంటుంది అది అమ్మతత్త్వం.అదే అమ్మ అనుగ్రహం.ఓంకార స్వరూపిణి మనకు అర్థం కాని మనల్ని ఉత్తేజపరచే శక్తి. నామస్మరణ మాత్రము చేత మన మధ్యకు వచ్చి నాట్యం చేసి మనల్ని అనుగ్రహిస్తుంది అఖిలాండకోటి బ్రహ్మాండ జనని.



## ప్రణవ పద్మాకరం పాఠకులకు దసరా శుభాకంక్షలు

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




## సంపాదకీయం

### క్రోధం – శాంతి

అరిషడ్వర్గాలలో ద్వితీయస్థానంలో ఉన్నప్పటికి జీవితాన్ని నాశనం చేయడంలో, సమాజాన్ని భ్రష్టుపరచడంలో అద్వితీయమైనది — క్రోధము. క్రోధాన్ని జయించడం మహాకష్టం. మహాత్ములైన ఋషులు క్రోధానికి లొంగి తపఃశక్తిని నాశనం చేసుకొన్నారు. ఇతరులకు అపకారం చేసారు. అందుకే తన కోపమే తన శత్రువు అని సుమతీశతకకారుడు అన్నాడు. కోపము ఉన్న చోట వైరం, శాంతము ఉన్న చోట ప్రేమ ఉంటాయి. కోపం వల్ల, కలిగే నష్టాలను భగవద్గీత కూడా ఇలా వివరించింది.

శ్లో॥ క్రోధాద్భవతి సమ్మోహః, సమ్మోహాత్ స్మృతి విభ్రమః
స్మృతిభ్రంశాద్బుద్ధి నాశః బుద్ధి నాశాత్ ప్రణశ్యతి ॥

కోపం అగ్నివలె ప్రజ్వరిల్లి క్రమంగా వృద్ధిచెంది యుక్తాయుక్త విచక్షణా జ్ఞానాన్ని పాడుచేసి, బుద్ధిని ధ్వంసంచేసి, మానవుడిని దానవునిగా మారుస్తుంది. ఈ శ్లోకం లోని ప్రత్యక్షరం పరమసత్యం. కోపం వల్ల మనుషులు ఎంతో విలువైన తమ జీవితాలను నాశనం చేసుకొంటున్నారు. వారికి సంబంధించిన కుటుంబాలు ఎన్నో సుఖశాంతులకు దూరమవుతున్నాయి. కోపం సకల అనర్థాలకు మూలం. కోపమును విడచి శాంతం పొందాలంటే ఒకటి ధార్మిక చింతనను పెంపొందించుకోవాలి. రెండు మనస్సును అదుపులో పెట్టుకోవాలి. ఏ విషయంలోనైనా ఒక స్థిరమైన నిర్ణయము, పట్టుదల కావాలి. కోపం విషయంలో ఎంత ఆవేశం, పట్టుదల తెచ్చుకొంటామో అంతే ఆవేశము, పట్టుదల కోపాన్ని నిగ్రహించటంలో సాధించినపుడు మానవుడు ఉత్తముడౌతాడు. దుర్గుణాలపై కోపం, వాటిని వదిలించుకోవాలనే పట్టుదల అందుకు తగిన శ్రమ చేయడంలో విఫలమవ్వడం చేత మానవ జీవితాలలో హింసాప్రవృత్తులు విశేషంగా కన్పిస్తున్నాయి. కనుకనే పెద్దలు బాల్యం నుండే వాత్సల్యం, కరుణ, శాంతం వంటి సద్గుణాలు పిల్లలకు అలవడేలా శ్రద్ధ వహించాలి.



కోపం వచ్చినప్పుడు కాసేపు మౌనంగా ఉంటే చాలు . కోపం తనంతటే తానే తగ్గిపోతుంది. రామాయణ, భాగవతాది గ్రంథాలను చదవడం. భగవన్నామాన్ని ఉచ్ఛరించడం, సద్గురువుల ప్రవచనాలు వినడం. దేవాలయానికి వెళ్ళడం వలన, కోపం తొలగిపోతుంది. కోపాన్ని అదుపులో పెట్టకపోవడం వల్ల అది ప్రతీకారంగా మారి తనకి, ఎదుటి వారికి నష్టాన్ని కలగజేస్తుంది. కనుక మానవులు క్రోధాన్ని త్యజించాలి. మానవులు దైవభక్తిపరాయణులు, ధార్మికమనస్కులు, ఆధ్యాత్మికచింతనాపరులు అయినపుడు కామక్రోధాది గుణాలు క్రమంగా బలహీనమై దూరమవుతాయి. ఈ విషయాన్ని భగవద్భక్తులెల్లరు గమనించి భగవత్ కృపకు పాత్రులు కావాలని అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను.


శ్లో॥ యా దేవీ సర్వభూతేషు శాంతిరూపేణ సంస్థితా।
నమస్తస్యై, నమస్తస్యై, నమస్తస్యై నమో నమః ॥

వద్దిపర్తి పద్మాకర్

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



# శ్రీ గణేశ పురాణం



**వి**ఘ్నేశ్వరునికి అనంత నామాలున్నాయి. అనేక అవతారాలున్నాయి. ఆయన లీలాగాథలు కూడా అనంతాలే. విఘ్నేశ్వరుడు నిర్గుణుడూ, సగుణుడు కూడా. అటువంటి గణేశ్వరునికి బాగా ఇష్టమైన పదహారునామాలు ఉన్నాయని, ఆ పదహారునామాలని భక్తితో తలచుకొంటే సకలశుభాలు కలుగుతాయని వ్యాసమహర్షి సెలవిచ్చాడు.

విఘ్నేశ్వరుని పదహారునామాలు:

| | |
|---|---|
| 1. సుముఖుడు | 9. ధూమకేతుడు |
| 2. ఏకదంతుడు | 10. గణాధ్యక్షుడు |
| 3. కపిలుడు | 11. ఫాలచంద్రుడు |
| 4. గజకర్ణకుడు | 12. గజాననుడు |
| 5. లంబోదరుడు | 13. వక్రతుండుడు |
| 6. వికటుడు | 14. శూర్పకర్ణుడు |
| 7. విఘ్నరాజు | 15. హేరంబుడు |
| 8. గణాధిపుడు | 16. స్కందపూర్వజుడు |

ఇందులో ఒక్కొక్క నామానికి గల విశేషార్థాలను, వ్యుత్పత్తులను గురించి కూడా తెలుసుకొందాం. గత నెల సంచికలో మనము గణాధిపుడు అను నామమునకు అర్థాలను, విశేషాలను తెలుసుకున్నాం. ఈ సంచికలో ఇప్పుడు 8వ,9వ నామముల గురించి తెలుసుకుందాం. ఆ నామముల ధూమకేతుడు, గణాధ్యక్షుడు.

గణేశుని తొమ్మిదవ పేరు ధూమకేతువు — ధూమకేతువు అనగా అగ్ని అని ఒక అర్థం. [పొగ చిహ్నముగా లేక జెండాగా కలిగినది]. అగ్నివలె పరమశుచి అయినవాడు విఘ్నేశుడు. విఘ్నాలను కష్టాలను అగ్ని దూదిని కాల్చినట్లుగా కాల్చి వేసేవాడు కనుక ధూమకేతువు అని ఆయనకు పేరు వచ్చింది. సంకల్ప వికల్పములు అనబడే పొగను తొలగించి జీవులకు జ్ఞానాగ్నిని అందించేవాడు అని కూడా ఈ నామానికి అర్థం. లోక ద్రోహులకు ప్రమాదం కలిగించే తోకచుక్క వంటివాడు కనుక [ధూమకేతువు అనగా తోకచుక్కఅని కూడా అర్థం. తోకచుక్క అరిష్టాలను కలిగిస్తుంది] వినాయకుడిని ధూమకేతువు అన్నారు.



గణేశుని పదవ పేరు గణాధ్యక్షుడు — దీనికి రెండు ముఖ్యార్థాలున్నాయి. లెక్కించడానికి వీలున్న వస్తువులన్నింటికీ యజమాని అని ఒక అర్థం. ప్రమథగణాలకు నాయకుడు అని మరొక అర్థం. శివుడు స్వయంగా గణపతితో ఒకప్పుడు ఇలా అన్నాడు —

శ్లో॥ త్వన్నామ విఘ్న హంతృత్వే శ్రేష్ఠం చైవ భవిష్యతి
మమ సర్వ గణాధ్యక్షః సంపూజ్య స్త్వం భవాధునా ॥

(శి.పు.రు.సం.కుమారఖండం.అ.18.శ్లో.31)

విఘ్నాలను నశింపజేయడంలో నీ పేరు ప్రసిద్ధిని పొందుతుంది. నా సర్వగణాలకు అధ్యక్షుడివయ్యి, ఈనాటి నుండి నీవు సంపూజితుడవవుతావు. శివుడిచ్చిన ఈ వరం వల్ల గణపతి గణాధ్యక్షుడు అయ్యాడు. ధర్మార్థకామమోక్షములని పిలువబడే నాలుగు గణములకు, దేవాసుర నరనాగ గణాలకు రక్షకుడు, స్థాపకుడు కనుక గణపతి గణాధ్యక్షుడని పిలువబడతాడని గణపతి సంహిత చెపుతున్నది.

మహత్తత్త్వాది గణానాం పతిః - గణపతిః, నిర్గుణ సగుణ బ్రహ్మ గణానాం పతిః — గణపతిః అని కూడా నిర్వచనాలున్నాయి. మహత్తత్త్వం వంటి గణాలకు, నిర్గుణసగుణబ్రహ్మ గణములకు అధ్యక్షుడు కనుక ఆయనను గణాధ్యక్షుడు అంటారు.

... ఇంకా ఉంది

*****



## శ్రీ వేంకటేశ్వర రహస్యము

పూర్వజన్మ సుకృతం వల్ల శ్రీవేంకటేశ్వర విలాసాన్ని లోకానికి సులభశైలిలో అందించిన పరమాత్మ స్వరూపుడు,సమర్థగురుడు, త్రిభాషామహాసహస్రావధాని, ప్రణవపీఠాధిపతి అయిన బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు నాకు జనకులయ్యారు. తల్లి శ్రీమతి రంగవేణి కూడా వేంకటేశ్వర భక్తురాలే. అందుకే శ్రీవేంకటేశ్వరుని లీలా రహస్యాలు వ్రాసే భాగ్యం నాకు కలిగింది. సప్తగిరులు అనేక దివ్యరహస్యాలకు నిలయాలు. యుగయుగాలుగా బ్రహ్మర్షులు, దివ్యర్షులు, మహర్షులు, రాజర్షులు, ఋషులు, మునులు, సాధకులు, యోగులు ఈ కొండపై సాధనలు చేస్తూనే ఉన్నారు. ఆ సాధనలన్నీ రహస్యాలే. కొండలలోని గుహలు రహస్యాలే. జలపాతాలు రహస్యాలే. వృక్షాలు, జంతువులు, కీటకాలు, ఇంతెందుకు ఈ కొండలోని అణువులన్నీ రహస్యాలే. ఆ రహస్యాలలో భగవంతుడు అందించిన మేరకు కొన్ని భక్తులకు అందించే ప్రయత్నం చేస్తాను. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవానికి సంబంధించిన రహస్యాలను తెలుసుకొంటున్నాం, అందులో భాగంగా తొండమానుని పూర్వజన్మ వృత్తాంతము కొంత తెలుసుకున్నాము ఈ సంచికలో మరిన్ని విషయాలు తెలుసుకొందాం.

### తొండమానుని పూర్వజన్మ వృత్తాంతము

ఒకప్పుడు నీవు నా కోసం ఆ కొండ మీద ఒక బావిని త్రవ్వించావు. ఆ బావిని మరలా సరిచేసి బాగుచేసి, పుణ్యాన్ని పొందు. పూడుకుపోయి, పాడయిపోయిన బావిని బాగుచేసినవారికి అనంత పుణ్యం లభిస్తుంది," అని వేంకటేశ్వరుడనగానే తొండమానుడు ఆశ్చర్యాన్ని, అద్భుతాన్ని పొందాడు. స్వామివారికి పదే పదే సాష్టాంగ నమస్కారం చేసాడు. ఆయనతో గద్గద కంఠంతో ఇలా పలికాడు- "స్వామీ! నేను



ఈ కొండపై ఇదివరలో ఎటువంటి నిర్మాణాలూ చేయలేదు. నీవేమో నేను ఒకప్పుడు ఈ బంగారు కొండపై బావిని త్రవ్వించాను అంటున్నావు. నేనెఱిగి బావిని తవ్వలేదు. నీమాట అసత్యం కాదుకదా! ఇదెలా సాధ్యమయ్యింది? నాకు తెలియకుండానే నేను ఈ కొండపై బావిని ఎలా తవ్వించి ఉంటాను? దయతో నాయీ సందేహాన్ని తొలగించు. సత్యం వెల్లడించు". తొండమానుని మాటలు విన్న శ్రీమహావిష్ణువు చిఱునవ్వుతో ఇలా పలికాడు — నాయనా! నీ పూర్వ జన్మలో నీవు చేసిన పనులు ఈ జన్మలో మఱచిపోయావు. నీ పూర్వజన్మరహస్యాన్ని తెలియజేస్తున్నాను విను — పూర్వం గోపీనాథుడు అనే భక్తుడు వైఖానసవంశంలో పుట్టాడు. స్వచ్ఛమైన మనస్సు కలిగి, శాంతస్వభావంతో నిత్యం శ్రీహరిని అర్చించేవాడు. సకలసద్గుణాలు కలిగి, తన జపతపస్సులతో పాపాలను తొలగించుకొన్నాడు. అతనికి శ్రీకృష్ణలీలలు అంటే చాలా ఇష్టం. నిత్యం శ్రీకృష్ణలీలలను పెద్దల ద్వారా వినేవాడు. చదివేవాడు. గానం చేసేవాడు. రాధామాధవలీలాగానంతో తనను తాను మరచిపోయేవాడు. శ్రీకృష్ణుడిని శాశ్వతంగా దర్శించాలని అతనికి కోరిక కలిగింది. సాధారణంగా భక్తులు తపస్సు చేసినపుడు శ్రీకృష్ణుడు దర్శనమిచ్చి, కించిత్కాలమే కన్నుల ఎదుట నిలచి, వరాలిచ్చి, మరలా అదృశ్యమైపోతూ ఉంటాడు. శ్రీకృష్ణుడు శాశ్వతంగా ఎవరి దగ్గఱా ఉండడు. తాను మాత్రం స్వామివారిని తన దగ్గఱనే ఏదో ఒక రూపంతో ఉంచుకోవాలి అని భావించి, గోపీనాథుడు, చోళదేశం చేరి, ఒక ఏకాంతప్రదేశం చూసుకొన్నాడు. అక్కడ దర్భలు పఱచుకొని వాటి మీద కూర్చుని శ్రీకృష్ణుని రూపాన్ని మనస్సులో నిలుపుకొని మహాతపస్సు చేసాడు. ఓం క్లీం కృష్ణాయ, గోవిందాయ, గోపీజనవల్లభాయ నమః" అనే మంత్రాన్ని జపించాడు. అతని నిష్ఠకు, దీక్షకు మెచ్చి భగవంతుడు శ్రీ కృష్ణరూపంతో దర్శనమిచ్చాడు. భక్తా! నిరుపమానమైన నీ తపస్సును మెచ్చాను. ప్రత్యక్షమయ్యాను. ఏం కావాలో కోరుకో. కోరిన వరాలిస్తాను అన్నాడు. అప్పుడు గోపీనాథుడు స్వామిని భక్తితో స్తుతించి ఇలా అన్నాడు — "కృష్ణా! నిశాచర విపాటనా! వృష్ణి కులాంభోజసూర్య! విప్రామరగోవైష్ణవ సాగరహిమకరా! నాస్తికులు అనబడే గృహాన్ని దహించే దావాగ్నీ! కరుణామూర్తీ! నమస్కారం. నాకు నీ కృష్ణస్వరూపం తప్ప అన్య రూపాలు రుచించవు. తక్కిన రూపాలను చూడలేను. నీవు నా దగ్గఱే కృష్ణ విగ్రహంతో శాశ్వతంగా ఉండిపోవాలి. నీ స్వయంభూ కృష్ణ విగ్రహాన్ని నేను నిత్యం పూజించాలి. ఈ వరం నాకు ప్రసాదించు".గోపీనాథునికి సమాధానంగా శ్రీకృష్ణుడిలా అన్నాడు — నాయనా! నేను కృష్ణునిగా నీ దగ్గఱ శిలా విగ్రహరూపంలో ఉండడానికి ఇప్పుడు వీలుకాదు. దానికి నీ తపస్సు చాలదు. త్వరలో నేను వేంకటాచలం పై శ్రీనివాసుడనే పేరుతో స్వయంభూమూర్తిగా వెలయబోతున్నాను. నీవు అక్కడకు వచ్చి, నిత్యం నన్ను అర్చించు. నీ కోరిక తీరుతుంది. అక్కడి వారికి నీవు నా అర్చకుడవవుతావని తెలియజేస్తాను. వారు నిన్ను నా అర్చకుడిని చేస్తారు. ఇక అక్కడ నుండి నీ వైఖానస వంశస్థులే నా అర్చకులుగా కొనసాగుతారు. నిత్యం నీకు నేను నా కృష్ణలీలలు ప్రదర్శిస్తుంటాను. వాటిని చూచి పులకించిపోతూ, నన్ను అర్చిస్తూ, తాకుతూ నీవు తరిస్తావు. నీవు ఇక్కడ నుండి వేంకటాద్రికి ప్రయాణమయివెళ్ళు. దారిలో నీకు ఒక శూద్రుడు దర్శనమిస్తాడు. అతని పేరు రంగదాసుడు. అతడు నాకు అత్యంత ప్రియభక్తుడు. నీవు అతనిని నీతో తీసుకొని వెడితేనే నా దర్శనం అవుతుంది సుమా!



...ఇంకా ఉంది

*****

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



## ఋషి చరిత్ర



ఆగస్టు సంచిక లో ముని కుమారుడిని జింక అనుకొని మునికుమారుడిని చంపిన హయ హయ వంశపు రాకుమారుడు తన తల్లితండ్రుల తో కలిసి మునికుమారుడి ఆశ్రమానికి వెళ్లారు. ఆ సమయానికి మునులు యజ్ఞం చేస్తున్నారు. మునులారా మమ్మల్ని రక్షించండి అని వేడుకోగా మునులు హఠాత్తుగా మీకు వచ్చిన కష్టం ఏమిటి అనగా అయ్యా మావంశంలో పుట్టిన ఈ కుర్రాడికి వేట అంటే వ్యసనం ఆ వ్యామోహంలో వేటకు వచ్చి మీవంశంలో పుట్టిన ఒక కుర్రాడిని జింక అనుకుని కొట్టి చంపాడు. ఆ బ్రహ్మహత్య పాపానికి భయపడుతున్నాడు వాడి పాపం తొలగించి వీడిని రక్షించండి అలాగే మాయడ దయ తలచి వీడిని శపించకండి అని వేడుకున్నారు.ఆ మునులు నవ్వి మీ కుర్రాడు చంపింది వీడినేనా? ఒరే ఇలా రా అని ఆ పిల్లాడిని పిలిచారు, పరిగెత్తుకుంటూ వస్తున్న ఆ కుర్రాడ్ని చూసి వారు ఆశ్చర్యపోయి,ఏమి విచిత్రం జింక అనుకుని బాణంతో కొడితే అమ్మా అని అరిచి గిల గిలా కొట్టుకుని మరణించింది ఈ కుర్రాడే.మరణించినవాడు మళ్ళీ ఎలా బ్రతికాడు? పిశాచ రూపం కాదుకదా అనగా,నువ్వు చంపిన కుర్రాడు వీడే పిశాచం కాదు నువ్వు కాసేపు అక్కడే ఆగి ఉంటే ఈ కుర్రాడు మళ్ళీ లేచేవాడు ఈలోపే నువ్వు పారిపోయావు బాణం దెబ్బకు మరణించిన వీడు ఐదు నిమిషాల తర్వాత మళ్ళీ లేచాడు. బాణం దెబ్బ తిన్న ఇతను మళ్లీ ఎలా బ్రతికాడు అని అక్కడ ఉన్న వారందరూ ఆశ్చర్యంగా అడిగారు. అప్పుడు వారు మాకు చావు,ముసలి తనం లేదు మేము జరా మరణాలకు అతీతులం అనగా అప్పుడు హయ హయ వంశం వారు జరా మరణాలకు అతీతులుగా ఎవరైనా ఉంటారా? మీకు ముసలి తనం జరా మరణాలు ఎందుకు లేవు అని ప్రశ్నించారు? అప్పుడు వారు మాకు కొన్ని నియమాలు ఉండటం వల్ల మేము ముసలితనం, మరణం జయించాము. మేము ఎప్పుడూ సోమరితనంతో ఉండము. బ్రాహ్మీ ముహూర్తంలో లేచి స్నానం చేసి సంధ్యావందనం చేస్తాము. నిత్యము సకాలంలో సంధ్యావందనం చేసేవాడికి ముసలితనం, అకాల మృత్యువు రాదు. శుచిగా ఆహారం వండుకుని దాన్ని భగవంతుడికి నివేదన చేసి తరువాత స్వీకరిస్తాం, మౌనంగా భోజనం చేస్తాం.వేళకు స్నానం చేస్తాం,స్నానం చేయకుండా అపవిత్రంగా అగ్నిహోత్రాన్ని ముట్టం,అందరినీ ప్రేమగా చూస్తాం, పరస్త్రీ వ్యామోహం పొందం ఇలా ఎన్నో నియమాలు ఉన్న సాధకులం కనుక జరా మరణాలు మా దగ్గరకు రావడానికే జడుస్తాయి.నిజంగా యోగాభ్యాసం చేసేవారికి ఆరోగ్యం బాగుంటుంది.వారి దగ్గర కలితత్వం ఉండదు. అందరినీ ప్రేమిస్తారు. వస్తువ్యామోహం ఉండదు. వారి శరీరం ఎంతో కాంతితో వెలిగి పోతుంది, వారి శరీరం సువాసనలతో గుమాళ్లించి పోతుంది మధురకంఠం, మల మూత్ర విసర్జన తక్కువగా చేయడం ఇవన్నీ యోగుల యొక్క ప్రారంభ దశలో వచ్చే లక్షణాలు

..ఇంకా ఉంది

*****

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



## ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః శ్రీ మాత్రేనమః శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము.

### 311 .రస్యా [ఓం ఐం హ్రీం శ్రీం రస్యాయై నమః]



రసము అనగా ప్రేమ, అనురాగము అనే అర్థాలున్నాయి. పరమాత్ముడు రసస్వరూపుడు. అందుకే వేదం "రసోవై సః" అంటున్నది. అనురాగస్వరూపుడు, ప్రేమైకమూర్తి పరమాత్మయే. ప్రేమస్వరూపిణి కనుక అమ్మను రస్యా అన్నారు. ఆస్వాదించుట అనే అర్థంలో రస్యా అనే శబ్దాన్ని వాడతారు. ఆస్వాదించడానికి తగినది కేవలం అమ్మవారే కనుక ఆమెను రస్యా అన్నారు. అమ్మవారి నామాలు మహామధురాలు. రుచిచూడదగిన నామాలు కలది కనుక అమ్మవారిని రస్యా అన్నారు. లౌకికములైన లడ్డూలవంటివి తాత్కాలిక రుచులు. అమ్మవారి నామాలు శాశ్వత రుచులు అని అంతరార్థం.

మంత్రప్రయోగవిధానం – ఫలితం :కొందరు ఎప్పుడూ ఆనందంగా ఉండలేరు. నిత్యం బెంగతో, ఏదో పోగొట్టుకొన్న వారిలా, దిగులుగా ఉంటారు. ఈ మంత్రాన్ని 45 దినాలు, ప్రతిదినం తన శ్రద్ధాభక్తులననుసరించి యథాశక్తిగా జపించి, నందివర్ధనాలు, లేక తెల్ల చామంతులతో అమ్మను పూజించాలి. దధ్యన్నం (పెరుగు కలిపిన, పోపుపెట్టబడిన అన్నం) నివేదించాలి. పూజానంతరం ఒక పూవు శిరస్సున ధరించి, ప్రసాదాన్ని తినాలి. ఇలా చేసిన వారికి దిగులు తొలగి, నిత్యోత్సాహం లభిస్తుంది. ప్రతి పూర్ణిమ నాడు ఇదే విధంగా పూజించిన వారు శాశ్వతానందం, ఆరోగ్యం పొందగలరు.

*... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో*

"శనివారం అమావాస్య వస్తే అది పద్మకయోగం. పద్మకయోగము ఉన్నరోజు చేసే ఏ పుణ్యకార్యమైనా అక్షయ ఫలితం ఇస్తుంది. కనుక ఈ రోజు నవగ్రహ ఆలయ సందర్శన, నవగ్రహ ప్రదక్షిణలు, శని భగవంతునికి తైలాభిషేకం, అర్చన, నవగ్రహస్తోత్ర పారాయణలు చేయడం వలన విశేష ఫలితం ఉంటుంది అని శివపురాణం చెబుతుంది"

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




## అహల్య

రామాయణంలో బాలకాండములో విశ్వామిత్ర యాగసంరక్షణార్థం వెళ్ళిన శ్రీరామచంద్రుని వల్ల శాపవిముక్తి పొందినది 'అహల్య' .రామలక్ష్మణులు విశ్వామిత్రయాగసంరక్షణ గావించి మిథిలానగరమునకు బయలుదేరి వెళుతూ మిథిలానగరమునకు సమీపమున గల వనము నందు ఒక మిక్కిలి రమ్యమైన, ప్రాచీనమైన ఆశ్రమమును వారు చూసారు. విశ్వామిత్రమహర్షిని ఈ ఆశ్రమపూర్వాపరాలను విచారించగా మహర్షి ఇది ఒక మహాత్ముని కోపకారణముచే శాపమునకు గురియైనదని వివరించెను. ఓ నరశ్రేష్ఠా! ఇది మహాత్ముడైన గౌతమమహర్షి ఆశ్రమము. ఇది ఒకానొకప్పుడు దివ్యశోభలతో విరాజిల్లినది. గౌతమమహర్షి యొక్క బ్రహ్మచర్యమునకు సంతుష్టుడైన బ్రహ్మదేవుడు అతనిని సేవించుటకు అహల్య అను కన్యను అతనికిచ్చి వివాహము చేసెను. తాపసశ్రేష్ఠుడైన గౌతమునకు అహల్యతో కూడి ఈ ఆశ్రమమునందు నివాసముండసాగెను.

సాధారణంగా ఇంద్రుడు తన పదవిని నిలుపుకొనుటకై తపమాచరించు వారికి కామవికారములను కలిగించుట ద్వారా వారి తపస్సులను భంగపర్చుటకై ఎన్నో ప్రయత్నాలు చేయును. కానీ తపఃశ్శక్తి సంపన్నుడైన గౌతముడు జితేంద్రియుడగుట వలన అతని తపఃశ్శక్తి క్షీణింపచేయుటకు ఒక పన్నాగమును పన్నెను. అందులో భాగంగా ఒక నాడు అహల్య వద్దకు గౌతముడు ఆశ్రమంలో లేని సమయంలో గౌతముని వేషంలో వచ్చాడు. అహల్యతో ఈ విధంగా పలికాడు —

శ్లో ll ఋతుకాలం ప్రతిక్షంతే నార్థివస్సు సమాహతే!
సంగమం త్వీహ మిచ్ఛామి త్వయం సహ సుమధ్యమే!

(వా.రా, బా.కా, స.4, శ్లో.18)

ఓ సుందరీమణీ! నీతో సంగమింపగోరుచున్నాను అని పల్కెను. వచ్చినవాడు తన భర్తకాడని దేవలోకాధిపతయైన ఇంద్రుడని తన తపశ్శక్తిచే గుర్తించిన అహల్య దేవరాజంతటి వాడు తనను కలవలెనని వచ్చి అడిగినందుకు మురిసిపోయింది. ఇలా పలికింది —

ఓ సురశ్రేష్ఠా! నా దాంపత్యజీవనమున నేను సంతుష్టురాలను. నీవు ఇచ్చటి నుండి వెంటనే వెళ్ళుము. ఓ సురపతీ! అన్ని విధముల నా గౌరవములను నిలుపుము అంటూ పలికినది.

శ్లో ll అధాబ్రవీత్ సురశ్రేష్ఠం కృతార్థే నాంతరాత్మనా
కృతార్థాస్మి సురశ్రేష్ఠ గచ్ఛ శీఘ్రు మితః ప్రభోః
ఆతాన్మం మాం చదేవేశ సర్వధా రక్ష మానద

(వా.రా, బా.కా,స.49.శ్లో.20 - 22)

అప్పుడు ఇంద్రుడు నేను వచ్చిన విధముగనే వెళ్ళెదను అని బయలుదేరి త్వరత్వరగా బయటకు వచ్చెను. ఇంతలో గౌతమ మహర్షి పర్ణశాలకు రానే వచ్చెను. ఉత్తమశీలసంపన్నుడైన గౌతమ మహర్షి తన రూపమును ధరించి వచ్చిన దుర్వర్తునుడగు ఇంద్రుని చూచి ఇలా పలికెను -ఓ దుర్మతీ! నా రూపమును ధరించి వచ్చి అనుచితముగా ప్రవర్తించితివి. అందువలన నీవు విగత వృషణుడవయ్యెదవు అని శపించెను. శపించిన వెంటనే ఇంద్రుని వృషణములు నేలపై రాలిపడెను.

ఇంద్రునికి శాపము ఇచ్చిన పిదప గౌతముడు అహల్యను కూడా శపించెను — "వేల కొలది సంవత్సరములు నీవు అన్నపానాదులు లేక వాయుభక్షణముతో తపించుచు ఈ ఆశ్రమమునందే పడియుండుము. భస్మశాయినివై ఎవ్వరికిని కనబడకుండా ఉంటావు. దశరథుని కుమారుడై శ్రీరాముడు ఈ ఘోరవనమునకు వచ్చినప్పుడు ఆ



శ్రీరాముని పాదధూళిస్పర్శతో శాపవిముక్తి పొంది పవిత్రురాలివై నిజస్వరూపమును పొందెదవు. తరువాత లోభమోహములు నశించి సంతోషముతో నన్ను జేరెదవు. తదుపరి గౌతముడు పవిత్రమైన హిమవత్పర్వత శిఖరములపై తపమాచరించుకొనసాగెను. ఈ విధంగా గౌతముని తపోబలము క్షీణించి ఇంద్రుని లక్ష్యము నెఱవేరెను.ఈ విషయమంతా వివరించిన విశ్వామిత్రుడు రామునితో చెప్పి అహల్యశాపవిమోచన సమయము ఆసన్నమైనందున ఈ ఆశ్రమములో అడుగుపెట్టడము ద్వారా అహల్యాశాపవిమోచనము కావించమని ఆజ్ఞాపించెను.

విశ్వామిత్రుని ఆజ్ఞను అనుసరించి శ్రీరాముడు సోదరునితో కలసి గౌతమాశ్రమమున ప్రవేశించెను. అచ్చట వాయుభక్షణాది కఠోరదీక్షతో గూడి తపఃప్రభావమున కాంతిమయముగానున్న మహాత్మురాలైన అహల్యని చూచెను. గౌతముని శాపప్రభావము వలన ఎవరికీ కనబడని అహల్య శ్రీరాముని దర్శనమైనంతనే అందరకు కనబడినది. ఆమెకు శాపవిముక్తి కల్గెను. అనంతరం అహల్య ఆ రామలక్ష్మణులకు అర్ఘ్యపాద్యాది అతిథి సత్కారములను చేసినది.

తన ఆశ్రమమునకు శ్రీరాముడు విచ్చేసిన విషయాన్ని గ్రహించిన గౌతమమహర్షి కూడా ఆశ్రమమునకు చేరుకున్నాడు. అహల్యాగౌతములు ఇరువురు కలిసి శ్రీరాముని పూజించి పిమ్మట ఆశ్రమము నందే తపోనిమగ్నులయ్యారు.

ఈ విధంగా అహల్య శాపవిమోచనమును పొంది కృతార్థురాలైనది. అహల్య ద్వారా శ్రీరాముని స్తుతించిన ఒక అద్భుతమైన స్తోత్రము అధ్యాత్మ రామాయణంలో చెప్పబడినది. స్వధర్మపరాయణులైన వారు ఈ స్తోత్ర పారాయణం చేసినచో రాముని అపారకృప కలుగునని ఫలశ్రుతిలో చెప్పబడినది.

*****



## నవరాత్రులలో వైష్ణవ సంప్రదాయం ప్రకారం వారు లక్ష్మీ దేవిని ఎలా ఆరాధించాలి ?

అమ్మవారు మహాలక్ష్మిని 9రోజులు అర్చన చేయాలి.శ్రీసూక్తం, లక్ష్మీ అష్టోత్తర, లక్ష్మీ సహస్రనామాలతో పూజించాలి. తామర పువ్వులు, కలువ పువ్వులు, గన్నేరు పూలు, మందార పువ్వులు, పారిజాతాలతో, చామంతులతో అమ్మను పూజించాలి. బాలపూజ చేయాలి .



# స్తోత్రమాలిక

## మంగళచండికా స్తోత్రం

శంకర ఉవాచ

రక్ష రక్ష జగన్మాతః దేవి మంగళచండికే |

హారికే విపదాం రాశేర్హర్షమంగళకారికే ||

హర్షమంగళదక్షే చ హర్షమంగళదాయికే |

శుభే మంగళదక్షే చ శుభే మంగళచండికే ||

మంగళే మంగళార్హే చ సర్వమంగళమంగళే |

సతాం మంగళప్రదే దేవి సర్వేషాం మంగళాలయే ||

*****

శ్రీ ప్రణవ పీఠం

# ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



## పండుగ విశేషాలు

### ఋషి పంచమి

భాద్రపద శుద్ధ పంచమిని ఋషిపంచమిగా వ్యవహరిస్తారు..మానవులై పుట్టాక ఋషుల ఋణం,దేవతల ఋణం, పితృదేవతల ఋణం ఈ ఋణాలన్నీ తీర్చుకోవాలి. అందులో ఋషుల యొక్క ఋణం తప్పక తీర్చుకోవాలి.ఈ రోజున మనం వీలున్నంతవరకు ఋషులు యొక్క పేర్లు తలుచుకోవాలి. పంచమినాడు ప్రొద్దుటే లేచి తలారా స్నానం చేసి కాసేపు విఘ్నేశ్వర ధ్యానం చేసాక సప్తఋషులను కౌండిన్యుడు, అత్రి, మరీచి మొదలైనటువంటి ఋషులను ముఖ్యంగా వ్యాసుడిని తప్పక తలుచుకోవాలి.

ఋషుల పేర్లు చెప్పి ఈ ఋషులు రాసినటువంటి పుస్తకాలు లోకంలో ప్రచారం చేస్తున్న మహానుభావులైనటువంటి గురువులందరిని తలుచుకోవాలి.గురుపూజచేయటం మంచిది. ఋషులవలె జీవితం సాగిస్తున్నటువంటి పౌరాణికులను ఈ రోజు పూజిస్తే సకల దేవతలు అనుగ్రహిస్తారు. ఋషి ఋణం తీరుతుంది. ఋషి పంచమి నాడు సాయంత్రం వేళ శివాలయములో ప్రదక్షిణ చేసి శివుడ్ని దర్శనం చేసుకోవడం చాలా మంచిది.అందునా ప్రదోష కాలంలో శివదర్శనం చాలా మంచిది.

### "మహాలయ పక్షాలు"

1) భాద్రపద మాసంలో పూర్ణిమ తరువాత వచ్చే పాడ్యమి మొదలుకుని అమావాస్య వరకు ఉండే 15 రోజులను మహాలయ పక్షములు అంటారు.

2)ఈ మహాలయ పక్ష కాలంలో పితృదేవతలకు శ్రాద్ధము, పిండప్రదానము ఒక పురోహితుడిని పెట్టుకుని జరిపిస్తే అందునా మహాలయ పక్షంలో చిట్టచివరన అమావాస్య నాడు శ్రాద్ధం జరిపిస్తే ఈ పితృదేవతల యొక్క దోషాలు తొలగిపోతాయి.ప్రేతాత్మలకి విముక్తి కలుగుతుంది.వాళ్ళు ఊర్ధ్వ లోకాలకి వెళతారు.దీనివల్ల మన సంసారములో ఉన్న కష్టాలు, నష్టాలు అన్నీ తొలగిపోతాయి.తెలిసి కానీ తెలియక కానీ మనకి ఇలాంటి కష్టాలు వస్తున్నాయంటే అవన్నీ ప్రేతాత్మల వల్ల వస్తున్నాయి.ఈ మహాలయం వల్ల అవి తొలగిపోతాయి.

3) మహాలయ పక్ష కాలంలో ఈ విధంగా శ్రాద్ధాదులు పెట్టాలి. ఈ కాలంలో నవగ్రహాలను పూజించాలి. ఉపనయనము అయిన వాళ్ళంతా రోజూ మధ్యాహ్నం పూట గాయత్రి జపం చేస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. గాయత్రి మంత్రం జపం వల్ల ఆహారం వేళకి లభిస్తుంది. విద్యాభివృద్ధి పెరుగుతుంది. భవిష్యత్తులో మంచి భార్య లభిస్తుంది. తద్వారా సత్సంతానము లభిస్తుంది. సుఖం, శాంతి లభిస్తాయి.

4) అదే తల్లో,తండ్రో మరణించినటువంటి వాళ్ళకి మూడు పిండాలు పెట్టండి లేదా మొత్తం 16 పిండములు కాని లేదా 32 పిండములు కాని లేదా 42 పిండములు కాని పెట్టచ్చు. చిన్న చిన్న పిండములు అన్నంతో పెట్టచ్చు లేదా మట్టితో కూడా పిండములు పెట్టచ్చు. రేగు పళ్ళ గుజ్జుతో పెట్టచ్చని చెప్పారు. ఎక్కడా ఏమీ దొరకనప్పుడు రేగు పళ్ళ గుజ్జుతో పెట్టచ్చు.ఈ విధంగా పిండములు మన శక్తిని బట్టి పెడితే తరువాత మధ్యాహ్న సమయం దాటాక కార్యక్రమం అయిపోయాక కాకులకు పెడితే లేదా ఏదైనా నదిలో

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




కలపడం కాని అగ్నికి ఆహుతి కాని చేస్తే మొత్తం ఏడేడు తరాల వాళ్ళు 14తరాల వాళ్ళు తరిస్తారట. ఇలా ఏడు తరాల వాళ్ళు వెళ్ళిపోయిన వాళ్ళు ముక్తి పొందుతారు. ఒకవేళ మన తరాలవాళ్ళు తరించి ఉంటే ఈ పెద్దలు తరించినప్పటికి మనం పిండ ప్రదానము చేస్తే మన రాబోయే వాళ్ళు మంచి పిల్లలు పుడతారు. సంతాన ప్రాప్తి అవుతుంది. సంతానము అకాలమరణం పొందరు. రాబోయే వాళ్ళు కూడా ముక్తి పొందుతారు. పిల్లలు కూడా ఎక్కువ కాలం జీవిస్తారు. ఈ మహాలయ పక్షములలో పిండ ప్రదానము చేయటం వల్ల ఇక వంశంలో ఏ విధమైన దుఃఖములు ఉండవు.

5)ఈ కాలములో బంగారం దానం చేస్తే ఏ విధమైన దుఃఖములు ఉండవు.సువర్ణదానం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఆనందంగా ఉంటారు.సమస్యలు, ఆటంకాలు తొలగిపోతాయి.పితృదేవతలకు వెండి చాలా ఇష్టం.రజత దర్శనం,రోజంతా కీర్తనమును,రజత దానముల ఆవశ్యకతని మార్కండేయ పురాణము లో చెప్పారు.ఈ మహాలయపక్ష కాలములో వెండిని చూచుట దానము చేయుట వెండి పాత్రలోనే అర్ఘ్య ప్రదానం తిలోదకాలు మొదలైన పనులు చేయుట మంచి ఫలితాలు ఇస్తాయి. ఈ కాలంలో వెండి పళ్ళెం లో తర్పణాలు విడిచి పెట్టండి.వెండి దానం చేయండి, దానివల్లమొండి సమస్యలు కూడా తొలగిపోతాయి.ఈ మొత్తం 15రోజులు వీలుంటే బ్రహ్మచర్య దీక్ష పాటించడం మంచిది.దానివల్ల పితృదేవతల కటాక్షం సంపూర్ణముగా లభిస్తుంది.

6)ఈ ప్రక్రియ చేస్తున్న కాలములో ఈ మహాలయ పక్షంలో తర్పణములు ఇచ్చేటటువంటి వాళ్ళు ఎట్టి పరిస్థితుల్లోనూ అలసందలు, ఉల్లిపాయ, ఇంగువ,పెండలము,ఆనపకాయ పనికి రాదు.సోదరి కొడుకుని పక్కన పెట్టుకుంటే కార్యక్రమము చాలా బాగుంటుంది.వీలుంటే ఒక దౌహిత్రుడు కూడా ఉంటే శ్రాద్ధం లో ఉన్న లోపాలు తొలగిపోతాయి.ఈ మహాలయ పక్షంలో రోజూ ఒక బ్రహ్మచారికి లేదా శక్తి ఉంటే ముగ్గురికి స్వయంపాకం దానం చేసుకోండి.బియ్యము, కూరగాయలు, దోసకాయ దానం చేయవచ్చు.ఎట్టి పరిస్థితులలోనూ తాటి సంబంధమైనవి ఈ కాలంలో నిషిద్ధము.హరిహరుల స్మరణ చాలా మంచిది.'రుచి' అనే ప్రజాపతి ఉన్నాడు.ఆయన పితృదేవతలని స్తుతించాడు. రుచి ప్రజాపతి చేసిన పితృస్తవము .ఈ15రోజులు భక్తితో పారాయణ చేయాలి.అమావాస్య నాడు ఈ స్తోత్రం చేసినటువంటి వాళ్ళకి పితృదేవతల యొక్క కటాక్షం లభిస్తుంది.

## "రాధాష్టమి"



శ్రీకృష్ణుడుని రాధాదేవి తన మనస్సులో లయం చేసి విజయం సాధించిన రోజు. భాద్రపద శుద్ధ అష్టమి అందుకే 'రాధాష్టమి' గా వ్యవహరిస్తారు.

## "భాద్రపద పూర్ణిమ"

పరీక్షిత్ మహారాజుకు శుకుడు భాగవతం భాద్రపద శుక్ల ఏకాదశి నుండి పూర్ణిమ వరకు శ్రీ మద్భాగవతం అందించాడు.

*****



# సత్సంగ సమాచారం

## విద్యానిధి -కృష్ణాష్టమి సంబరాలు

పూజ్య గురుదేవుల అనుగ్రహం తో శ్రీ ప్రణవ పీఠం వారి విద్యానిధి బృందం అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు.శ్రీ కృష్ణ తత్త్వానికి అద్దం పట్టేలా పిల్లలు పాటలు పాడారు, కథలు చెప్పారు, స్తోత్రములు గానం చేసారు, వేణునాదం చేసారు, ఇలా అనేక రకాలుగా కృష్ణపరమాత్మను భక్తి తో పూజించుకున్నారు



*****



## శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాతీయ అంతర్జాల కృష్ణాష్టమి పోటీలు

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భముగా పూజ్య గురుదేవుల అనుగ్రహంతో అనేక పోటీలను శ్రీ ప్రణవపీఠం నిర్వహించింది. గురుభక్తులు అందరూ అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన అభ్యర్థులకు శుభాకాంక్షలు. విజేతల వివరాలు:

### శ్రీ రాధ కృష్ణ స్వరూప పోటీలు

మొదటి విజేత:T. Shanmuki
రెండవ విజేత:V.Manogna&
P. Lasya Kamakshi
మూడవ విజేత:S. Bhuvan chaitanya

### ప్రసంగపు పోటీలు (శ్రీ కృష్ణ లీలలు)

పిల్లలవిభాగం(03-15 years)

మొదటి విజేత: Chi.Josyula Sree Harshini
ద్వితీయ విజేత: Chi.K. Roshini Reddy
తృతీయవిజేత:Chi.JosyulaLalithaShasank

### ప్రసంగపు పోటీలు(శ్రీకృష్ణ లీలలు)

16years and above

మొదటి విజేత:Km.V Likhitha
రెండవ విజేత:Smt.G Sreelakshmi
మూడవవిజేత:Smt.VijayalakshmiVakeel

### చిత్రలేఖనపు పోటీలు

Catagory -1;
(Age 03- 15 years)

మొదటి విజేత:B.Pranavi
రెండవ విజేత:B. Deekshita &
Chilamkurthy Gnanasankara Pavan Sai
మూడవ విజేత:Pragnya Noothalapati

Catagory -2;
(Age 16 - 25 years)

మొదటి విజేత :Kavuri venkata naga sai swapna
రెండవ విజేత:Samyuktha PSNSV
మూడవ విజేత:Manthri.Vasanthi

Catagory -3 ;
(Age 26 years & above)

మొదటివిజేత:Sardar Ramudu Asannagari
రెండవ విజేత:Ganta himansu sekhar
మూడవ విజేత:Chanduri Lakshmi sravanth

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



# మణిద్వీప వర్ణన

అన్ని లోకములలోకల్లా శ్రేష్ఠమైన లోకం సర్వలోకం, అదే మణిద్వీపం. జగజ్జనని కొలువైన లోకం మణిద్వీపము.సృష్టిస్థితిలయకారిణి, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకి, ఓంకారస్వరూపిణి, భువనేశ్వరి కొలువుదీరిన లోకం మణిద్వీపం.సుధాసముద్రము మధ్యలో మణిద్వీపము ఉంటుంది. ఈ మణిద్వీపము చుట్టూ ఉన్న ఇసుక బంగారు రజతో నిండి ఉంది, రత్నముల తో ఉంటుంది. సుధాసముద్రం పై ఉన్న మణిద్వీపం పద్దెనిమిది ప్రాకారముల తో ఉంటుంది.18 ప్రాకారములు దాటిన వారికి అమ్మ దర్శనం అవుతుంది.

## 1.ఇనుప ప్రాకారము

ఈ ప్రాకారము సప్తయోజన విస్తీర్ణం కలిగినది.ఈ ప్రాకారమునకు నాలుగు తలుపులు ఉన్నాయి. ఎటువంటి వారినైనా మట్టికరిపించగల శక్తి కలిగిన కాపలాదారులు, రక్షకులు ఉంటారు. మణిద్వీపం లో అమ్మ దర్శనార్థం వచ్చిన వారు ఈ ప్రాకారమునకు ముందే తమ విమానాలను ఆపి, ఈ ప్రాకారము వద్ద ఉన్న కాపలాదారులకు తమ తమ వివరాలను నమోదు చేస్తారు. ఇక్కడకు వచ్చిన అమ్మ భక్తులు ఆనందంతో శ్రీ మాత్రేనమః అంటూ అమ్మకు జయ జయ ధ్వానాలు పలుకుతారు.ఇక్కడ వచ్చి పోయే అమ్మవారి భక్తులతో కోలాహలముగా ఉంటుంది ఈ ప్రదేశం .

## ౨. కాంస్య ప్రాకారము

ఆకాశం అంటుతున్న కోటగోడలు కలిగిన ప్రాకారము కాంస్య ప్రాకారం. ఇక్కడ కోటగోడలు గోపురముల వలె ఉంటాయి. ఇనుప ప్రాకారమునకన్నా వెయ్యి రెట్లు అధిక కాంతి కలిగిన ప్రాకారం.ఇక్కడ అనేక వృక్షములు ఉంటాయి. గడ్డిపోచ కూడా సువాసనలు వెదజల్లును. వందలాది మందారవనములు, ఉపవనములు ఉంటాయి. అనేకజాతి పక్షులు ఉంటాయి. కోయిలలు కూస్తూ ఉంటాయి, తుమ్మెదలు ఝుంకార నాదాలు చేస్తుంటాయి. పావురములు, చిలుకలు మొదలైన పక్షులు ఉండును. ఈ ప్రాకారం వివిధ ఫలరసములతో కూడిన నదులతో ఆహ్లాదముగా ఉండును. అగరుబత్తి వృక్షములు ఉండును. పింఛములు విప్పిన నెమళ్ళతో, ఈ నెమళ్ళ క్రేంకారములతో ఈ ప్రాకారము శోభాయమానముగా విరాజిల్లుతూ ఉంటుంది.

## 3. రాగి ప్రాకారము

ఈ ప్రాకారము చతురస్రాకారముతో, సప్తయోజన విస్తీర్ణముతో ఉంటుంది.ఇక్కడ వృక్షములు అన్నీ బంగారు వృక్షములు, ఈ వృక్షములకు పూచే పూవులు కూడా బంగారపు పువ్వులు. అద్భుతమైన సువాసనలతో కూడి ఉంటుంది ఈ ప్రాకారము. ఇక్కడి వనములకు వనమాలిగా పుష్పనిర్మిత సింహాసనము మీద విరాజమానుడై ఉంటాడు వసంతఋతువు.వసంత ఋతువు భార్యలు మధుశ్రీ, మాధవశ్రీ.గంధర్వులు గానం చేస్తూఉంటారు. పది యోజనముల వరకు పూల యొక్క సువాసనలతో అద్భుతంగా అలరారుతుంది ఈ ప్రాకారం.ఇక్కడి పూలు, ఫలాలు అమ్మకు నివేదించి స్వీకరిస్తారు . వసంత లక్ష్మి నిత్యం కొలువై ఉంటుంది

## 4. సీస ప్రాకారం

ఈ ప్రాకారము కూడా సప్తయోజన విస్తీర్ణం లో ఉంటుంది.ఇక్కడి పాలకుడు గ్రీష్మ ఋతువు. ఈయనకు ఇద్దరు భార్యలు శుచిశ్రీ, శుకశ్రీ. ఇరువురు భార్యలతో కలిసి వనములని రక్షిస్తుంటాడు.అమ్మ లీలలను ఇక్కడ నిరంతరం నృత్యం చేస్తారు. ఇక్కడ సంతాన వృక్షములు కలవు.సంతాపములు తొలగించే వృక్షములు కలవు. అమృత సమానమైన తీయటి రుచి గల ఫలాలు ఇక్కడ లభించును.



### 5. ఇత్తడి ప్రాకారము

ఈ ప్రాకారము ఇత్తడితో చేయబడినది. మహా అద్భుతమైన ప్రాకారము. సప్తయోజన విస్తీర్ణం కలిగిన ప్రాకారము.ఇక్కడకు వచ్చిన వారికి మానసిక ఆనందము కలుగుతుంది.ఇక్కడ మలయగిరి వనము ఉంటుంది. ఈ ప్రాకార వనములకు అధిపతి వర్షఋతువు, ఈయనకు వాహనం మేఘం.ఇంద్రధనుస్సును కలిగి ఉంటాడు.ఎప్పుడూ ఎర్రని కళ్లతో ఉంటాడు.ఆయనకు ఇద్దరు భార్యలు నభఃశ్రీ, నభస్యశ్రీ వీరితో కలిసి తోటలు కాపలా కాస్తూ ఉంటాడు. భూలోకము లో వర్షములు ఇచ్చే మేఘములన్నీ అక్కడే ఉంటాయి.చెట్లు ఎల్లప్పుడూ చిగురాకులతో, పూవులతో ఉంటాయి ఈ ప్రాకారం లో దేవి కోసం వాపీకూపతటాకములను నిర్మించిన వారు ఇక్కడ ఉంటారు. నదులు వేగంగా ప్రవహిస్తూంటాయి .భూలోకమునకు తరచుగా వర్షములు ఇచ్చే శక్తులు ఇక్కడ ఉంటారు. ఆ శక్తులు రస్యమాలినీ, స్వారస్య, అంబాదుల, నిరత్ని, అభ్రమంతి, మేఘయంతిక, వర్షయంతి, చివునిక, వారిధార, సమ్మత

### 6. పంచలోహ ప్రాకారము

ఇనుప, కాంస్య, రాగి,సీస, ఇత్తడి ఈ ఐదు లోహములు కలిపిన ప్రాకారము పంచలోహ ప్రాకారము.ఈ ప్రాకారము సప్తయోజన విస్తీర్ణం కలిగిన ప్రాకారం.ఈ ప్రాకారము లోపల మందార వృక్షములు కలవు.కల్పవృక్షములలో మందారము, పారిజాతము, హరిచందనము, చందనము ఇలా పేర్లు కలవి ఉన్నాయి. అందులో మందారము అని పేరుకల కల్పవృక్షములు కలవు, ఇవి మనం ఏమి కోరితే అవి ఇవ్వగల శక్తి కలిగిఉంటాయి.అసంఖ్యాకముగ ఉంటాయి ఈ మందార చెట్లు. పువ్వులు అద్భుతమైన సువాసనతో ఉంటాయి. ఈ చెట్టు ఫలాలు తిన్నవారికి జనన మరణ భయములు ఉండవు.ఈ ఆరవ ప్రాకార అధిష్ఠాన దేవత శరదృతువు . ఈయనకు ఇషులక్ష్మి, ఊర్జలక్ష్మి అని పేర్లు గల ఇరువురు భార్యలు కలరు. ఈ ప్రాంతం లో బ్రహ్మానందం ఉంటుంది ఎవ్వరికి కోరికలు ఉండవు ,ఉన్నా తక్షణము తీరిపోతాయి.

### 7. రజత ప్రాకారము

విశాలమైన శిఖరము కలిగి,సప్తయోజన విస్తీర్ణం తో వెలుగుతుంటుంది ఈ రజత ప్రాకారము.ఎటు చుసిన తళ తళ మెరిసే వెండి కనబడుతుంది.వెండి కోట కలిగిన ప్రాకారము. ఇక్కడ తోటలో పారిజాత వృక్షములు ఉంటాయి. ఈ వృక్షములు భూలోక పారిజాతవృక్షములు కాదు . అవి కల్పవృక్షములు. ఈ వృక్షాలకు ఎక్కడ చుసినా పూలు గుత్తులుగా ఉంటాయి. ఒక్క పూవు 10 యోజనముల వరకు సువాసన వెదజల్లుతుంది. హేమంత ఋతువు ఈ ప్రాకారామునకు యజమాని. ఈయనకు ఇద్దరు భార్యలు. సహశ్రీ, సహస్యశ్రీ. నిరంతరం దేవీ వ్రతములు, దేవీ ఉపాసన చేసే సిద్ధపురుషులు ఇక్కడ ఉంటారు.

### 8. బంగారు ప్రాకారము

ఈ ప్రాకారపు కోటలు కల్తీలేని బంగారంతో నిర్మించబడినది. ఈ ప్రాకారము సప్తయోజన విస్తీర్ణం కలిగినది. కదంబ వనము ఉంటుంది ఇక్కడ.ఈ కదంబ పూవుల నుండి తేనె ధార నదీ ప్రవాహం లాగ ఇక్కడ వస్తుంది, ఈ తేనే రుచి చూసిన వారి అనుభూతి మాటల్లో వివరించలేరు.శిశిర ఋతువు కార్యక్రమములు నిర్వహిస్తారు. ఈయనకు తపఃశ్రీ, తపస్యశ్రీ అను భార్యలు కలరు.అమ్మ ప్రీతి కొఱకు దానధర్మాలు నిర్వహించిన సిద్ధపురుషులు ఇచ్చట ఉంటారు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



## ౯.పుష్పరాగమణి నిర్మిత ప్రాకారము

సప్తయోజన విస్తీర్ణము గల ఈ ప్రాకారము కుంకుమ వంటి అరుణ వర్ణముతో కూడిన పుష్యరాగమణుల తో నిర్మితమైనది. ఇక్కడ కొందరు దేవతలు పక్షి రూపం లో విహరిస్తూ దేవీ మంత్రములను స్పష్టంగా ఉచ్చరిస్తూఉంటారు.ఈ ప్రాకారములు అన్ని ఒకటికి మించిఒకటి శక్తిమంతమైనవి. లక్ష రెట్లు అధిక తేజస్సు తో వెలుగొందుతూ ఉంటాయి. అనేక బ్రహ్మాండములలో ఉన్న దిక్పాలకులు మణిద్వీపం లో నివాసము ఏర్పాటుచేసుకున్నారు.

| | దిక్కు | దిక్పాలకుడు |
|---|---|---|
| 1 | తూర్పు | మహేంద్రుడు |
| 2 | ఆగ్నేయము | అగ్ని |
| 3 | దక్షిణము | యముడు |
| 4 | నైరుతి | నిరృతి |
| 5 | పశ్చిమము | వరుణుడు |
| 6 | వాయవ్యము | వాయుదేవుడు |
| 7 | ఉత్తరము | కుబేరుడు |
| 8 | ఈశాన్యము | ఈశానుడు |

- **తూర్పుదిశ** లో మహేంద్రుడు అమరావతి నగరము లో శచీదేవి సమేతంగా విహరిస్తాడు.ఈయనకు వేల



ఇంద్రుల తేజస్సు కలిగిన శక్తి ఉంటుంది. ఐరావతము పై వజ్రము ధరించి విహారిస్తాడు.

- **ఆగ్నేయదిశ** లో వహ్నిపురం లో అగ్నిదేవుడు స్వాహా,స్వధాల తో కలిసి ఉంటాడు.
- **దక్షిణదిశ** యందు యమరాజపురం ఉన్నది.ఇక్కడయముడుచిత్రగుప్తాదిమంత్రులతోకొలు వుదీరిఉంటాడు.చేతియందు దండము ధరించి భార్యాసమేతముగా విహరిస్తారు
- **నైరుతిదిశ** వైపు రాక్షసపురం లో ఖడ్గము ధరించిన నిరృతి ఇక్కడ విలసిల్లును
- **పశ్చిమదిశ** వైపు భార్య ఐన వరుణానితో కలసి వరణుడు ఈ లోకం లో నివాసము ఉంటాడు.మహామత్స్యము వాహనముగా ఉండును
- **వాయవ్యదిశ** వైపు వాయులోకము వాయుదేవుడు ఉన్నాడు.ప్రాణాయామము చేయు సిద్ధులు ఇక్కడ ఉంటారు.విశాల నేత్రములతో ధ్వజమును చేతబట్టి ఉండును
- **ఉత్తరదిశయందు** కుబేరుడు యక్షులతో ఉండును.నవనిధులు కలిగి ఉండును.మణిభద్రుడు ,పూర్ణభద్రుడు,మణిమానుడు,మణికంధరుడు,మణి భూషనుడు,మణిమాలి,మణిధనుర్ధరుడు అను నామములతో యక్షసేనల తో కుబేరుడు ఉండును.
- **ఈశాన్యదిశవైపు** మహారుద్ర లోకము కలదు. ఇక్కడ రుద్రుడు నివసించును. ధనుస్సు ధరించి ఉంటాడు. తనవంటి వారు అనేకులు ఇచ్చట ఉంటారు. కొందరికి పదిచేతులు, కొందరికి వెయ్యి చేతులు, కొందరికి పదితలలు ఉంటాయి. కోట్లాది రుద్రాణులు, భద్రకాళీ మొదలగు మాతృకా గణములు ఉండును.వీరభద్రుడు ఉండును.తన సర్వాంగముల యందు విభూతి ధరించి ఉంటాడు. ఈశాన్య దిశకు ప్రభువైన కారణముగా ఈశానుడు అంటారు. గళము నందు కపాలము, చేతియందు సర్వవిలయం,శరీరం యందు పులిచార్మాన్ని, గజచర్మాన్ని ఉత్తరీయంగా ధరించిఉంటాడు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



### 10.పద్మరాగమణి ప్రాకారము

ఈ పద్మరాగమణి ప్రాకారము కూడా కుంకుమ వర్ణంలో ఎర్రగా ఉంటుంది. ఈ ప్రాకారము పది యోజనముల పొడవు ఉంటుంది.ఇక్కడ వందలాది మణిస్తంభాలు ఉన్నాయి.ప్రతి స్తంభానికి మణులు తాపడం చేయబడి ఉంటుంది.ఈ ప్రాకారమును స్త్రీలు, కళారూపాలు గా కాపలా కాస్తుంటారు. ఒక్కో కళకు ఒక్కో లోకము కలదు. తమ తమ వాహనములతో, వీరవేషధారులై ఉంటారు. ఈ అమ్మవార్లు అందరు మండుతున్న నాలుకలు కలవారు.కోపంతో సదా కనులు ఎర్రబారిఉండును.ఒకొక్క కళ వద్దవంద అక్షౌహిణి సైన్యం ఉండును. ఇక్కడ లెక్కలేనన్ని గుర్రములు, గజములు, రథములు, శస్త్రములు కలిగిఉండును ఈ కళల నామములు చదివిన మాత్రం చేత పుణ్యం లభించును. వారి నామములు

| | | |
|---|---|---|
| పింగళాక్షి | విశాలాక్షి | వృద్ధి |
| శ్రద్ధా | స్వాహా | స్వధా |
| అభిఖ్య | మాయ | సంజ్ఞ |
| వసుంధర | త్రిలోకధాత్రి | సావిత్రి |
| గాయత్రి | త్రిదశేశ్వరి | సురూప |
| బహురూప | స్కందమాత | అచ్యుతప్రియ |
| విమల | అమల | అరుణి |
| హారుణి | ప్రకృతి | వికృతి |
| సృష్టి | స్థితి | సంహృతి |
| మాత | సంధ్య | పరమసాధ్వి, హంసీ |
| మర్దిక | వజ్రిక | దేవమాత |
| భగవతి | దేవకి | కమలాసన |
| త్రిముఖ | సప్తముఖ | సూరాసుర విమర్ధిని |
| లంభోష్టి | ఊర్ధవకేశి | బహుశీర్ష |

| | | |
|---|---|---|
| వృకోదరి | రథరేఖ | శశిరేఖ |
| గగనవేగ | పవనవేగ | భువనపాల |
| మదానాతురా | అనంగ | అనంగమధన |
| అనంగమేఖల | అనంగకుసుమ | విశ్వరూప |
| సూరాదిక | క్షయంకరి | శక్తి |
| అక్షోభ్య | సత్యవాదిని | సమృద్ధి |
| శుచివ్రత | ఉదార | వాగీశి |



### 11. గోమేధ ప్రాకారము

గోమేధ రత్నములతో పదియోజన విస్తీర్ణంతో నిర్మించబడినది ఈ ప్రాకారం. ఇక్కడ అనేక సరోవరములు, వృక్షములు, బావులు, పక్షులు కలవు. ఈ ప్రాకారము మధ్యభాగమున ముప్పది రెండు అమ్మవార్లు నివసించెదరు.ఈ దేవతలు అనేక ఆయుధాలను ధరించిఉంటారు.గోమేధమణులతో, అలంకరింపబడి ఉంటాయి.వారివద్దలక్ష బ్రహ్మాండములను వధించగల శక్తి కలదు.ఈ దేవీశక్తులు. దుర్మార్గులను హతము చేయుటకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు.లెక్కించుటకు సాధ్యము కానీ రథములు,సైన్యం కలదు. భగవతి యొక్క యుద్ధసామాగ్రి ఇక్కడ ఉండును. పరాజయము వీరికి ఎప్పుడూ కలుగదు.



32 దేవీశక్తుల దివ్యనామాలు:

| | | |
|---|---|---|
| విద్య | హ్రీ | పుష్టి |
| ప్రజ్ఞ | సినీవాలి | కుహు |
| రుద్ర | వీర్య | ప్రభ |
| ఆనంద | పోషిణి | రుద్రిద |
| కాలరాత్రి | మహారాత్రి | భద్రకాళి |
| కపర్ధిని | వికృతి | దండిని |
| ముండిని | సేందుఖండ | శిఖండిని |
| నిశుంభ | శుంభమధిని | మహిషాసురమర్ధిని |
| ఇంద్రాణి | రుద్రాణి | శంకరార్ధరశరీరిణి |
| నారి | నారాయణి | త్రిశూలిని |
| పాలిని | అంబిక | హ్లాదిని |

## 12. వజ్ర ప్రాకారము

అనేక గోపురములు, ద్వారములతో పది యోజనముల వైశాల్యముతో ఈ ప్రాకారం నిర్మించబడినది.ఇక్కడి మధ్యభాగము పూర్తిగా వజ్రనిర్మితము. భవనాలు, వీధులు,మార్గములు,వృక్షముల తో అద్భుతము గా ఉంటుంది.ఇంద్రియములకు లొంగకుండా ఆ పని, ఈ పని అని తేడాలేకుండా అన్ని కార్యాలను చేయగల మహాశక్తివంతులు ఉంటారు ఇక్కడ. సకల సామాగ్రితో దేవి భువనేశ్వరికి సేవచేయు పరిచారికలు ఇచట ఉందురు. పాదసేవ, అలంకరణ, పుష్పాభరణములు తయారు చేయుట వంటి అనేక సేవలు అమ్మకు చేయుట లో చతురులు .వీరు దేవీకృపను పొంది ముల్లోకాలను గడ్డి పోచె వలె భావిస్తారు. ప్రపంచము మొత్తం యేలగలిగిన దేవి శక్తులు ఇక్కడ ఉంటాయి, వీరందరు దేవి భువనేశ్వరి దూతికలు గా చెప్పబడుదురు.చేతిలో బెత్తములు చేపట్టి తిరుగుతారు

వీరి పేర్లు:

| | | | |
|---|---|---|---|
| అనంగరూప | అనంగమదన | సుందరి | మదనాతురా |
| భువనవేద | భువనపాలిక | సర్వశిశిర | అనంగవేదన |
| అనంగమేఖల | | | |

## 13. వైడూర్యమణి ప్రాకారము

ఈ ప్రాకారము వైడూర్య మణులతో నిర్మించబడింది. ఇది పదియోజనముల వైశాల్యము కలిగినది. ఈ ప్రాకారము లో భవనాలు, రాజమార్గాలు. ఇక్కడ దిగుడుబావులు, వాపీకూప తటాకములు కలవు. ఇక్కడి ఇసుకతిన్నెలు అన్ని వైడూర్యముల తో ఉంటాయి.ఇక్కడ బ్రాహ్మీ మొదలగు మాతృకాశక్తులు ఉంటారు.తమ గణములతో విచిత్ర శోభతో అలరారుతుంటారు.ఈ మాతృకల బ్రహ్మరుద్రాదుల రూపం పోలిఉంటారు. అన్ని బ్రహ్మాండములకు చెందిన మాతృకల ఐక్యత రూపం గా చెప్పబడింది.ఈ ప్రాకారమునందు వాద్యములు ఉంచబడిన దివ్య విమానములు కోట్లాదిసంఖ్య లో ఉంటాయి. మాతృకల దివ్యనామములు:

| | | | |
|---|---|---|---|
| బ్రాహ్మీ | మహేశ్వరీ | కౌమారీ | వైష్ణవీ |
| వారాహి | ఇంద్రాణి | చాముండ | మహాలక్ష్మి |





## 14.ఇంద్రనీలమణి ప్రాకారం

పదియోజనముల వైశాల్యముతో ఉంటుంది ఈ ప్రాకారము. ఈ ప్రాకారము ఇంద్రనీలమణులతో నిర్మించబడినది.ఈ ప్రాకారము మధ్యలో అనేక వీధులు, వాపీకూపతటాకములు, భవనములు, లోయలు కూడా ఇంద్రనీలమణులతో నిర్మించబడినవి.ఇక్కడ ఉన్న దేవీశక్తులు మనకు 16 కళలు కలిగిఉంటారు, అమ్మను ఆరాధించే వారికి ఇస్తారు.దివ్యతేజస్సుకలిగి అనేక యోజనము విస్తారము గల కమలము ఒకటి ఈ ప్రాకారం లో ఉన్నది.16 శక్తులకు ఈ కమలము ఆవాసము కల్పిస్తుంది. జగత్తును ఏలే దేవీభగవతికి వీరు సేనానాయికలు. వీరందరు డాలును, ఖడ్గములను కలిగి ఉంటారు. వీరు నీలమేఘచ్చాయ కలిగినవారు.ఈ దేవీశక్తుల దివ్య నామాలు:

| | | | |
|---|---|---|---|
| కరాళి | వికరాళి | ఉమ | సరస్వతి |
| శ్రీ | దుర్గ | ఉష | లక్ష్మి |
| శ్రుతి | స్మృతి | ధృతి | శ్రద్ధ |
| మేధ | మతి | కాంతి | ఆర్య |

## 15. ముక్తా ప్రాకారము

పదియోజనముల తో ఉంటుంది ఈ ముక్తా ప్రాకారము. ఈ ప్రాకారము మధ్యలో అష్టదళ కమలము కలదు. ముత్యాలు, మణులతో కూడి ఉంటుంది ఈ కమలము. ఈ కమలము యొక్క ఎనిమిది దళములలో భువనేశ్వరిని పోలిన దేవీశక్తులు ఉంటారు. వీరు అమ్మకు మంత్రిణీ దేవతలు. వీరు అనేక కార్యములు చేయగలరు. అత్యంత సౌందర్యవతులు. అన్ని బ్రహ్మాండముల దగ్గర ఉన్న ప్రాణుల విషయములను వీరు నిత్యం అమ్మకు తెలియజేస్తారు.

| | |
|---|---|
| అనంగకుసుమ | అనంగమదనా |
| అనంగకుసుమాతురా | అనంగమదనాతుర |
| భువనపాల | శశిరేఖ |
| గగనవేగా | గగనరేఖ |

వీరి నామములు:

## 16. మహామారకత మణులప్రాకారము

పదియోజనములతో అత్యంత గొప్పదైనప్రాకారము ఇది. సౌభాగ్య పదార్థములు, భోగసామగ్రులు ఉండును. ఆరు కోణములు కలిగిన యంత్రము ఈ ప్రాకారము యందు ఒకటికలదు.ఆరు కోణములలో ఆరుగురు దేవతలు ఆయుధములుధరించి ఉన్నారు

| | దిక్కు | దేవతలు |
|---|---|---|
| 1 | తూర్పు | చతుర్ముఖ బ్రహ్మ, గాయత్రి |
| 2 | ఆగ్నేయము | కుబేరుడు, మహాలక్ష్మి |
| 3 | నైరుతి | దసావిత్రి , విష్ణు |
| 4 | పశ్చిమము | రతీ దేవిత,కామదేవుడు |
| 5 | వాయవ్యము | మహారుద్రుడు, సరస్వతి |
| 6 | ఈశాన్యము | గణేశుడు,పుష్టిదేవి |

- **తూర్పుదిశ** నందు చతుర్ముఖ బ్రహ్మ, భగవతి గాయత్రి ఉండును వీరు కమండలము, అక్షసూత్రము, అభయముద్రాదండము వంటి ఆయుధములు ధరించిఉందురు. ఇక్కడ వేదములు, స్మృతులు, పురాణములు కూడా రూపం ధరించి ఉండును



- **నైరుతిదిశ** యందు శంఖ, చక్ర, పద్మములను ధరించిన దేవీసావిత్రి , విష్ణుభగవానుడు ఉందురు.
- **వాయువ్యదిశ** యందు మహారుద్రుడు, సరస్వతి గండ్రగొడ్డలి, అక్షమాల, అభయ, వరముద్రలను ధరించి ఉంటారు.ఇక్కడ ఆగమశాస్త్రములు కూడ కొలువైఉండును
- **ఆగ్నేయదిశ** యందు ధనమునకు స్వామీఅయిన కుబేరుడు కలశమును, మణికరండమును ధరించిఉంటాడు. అనేక వీధులలో మహాలక్ష్మి తో కలిసి ఉండును. జగదాంబ యొక్క కోశాగారమును కుబేరుడు రక్షించును.
- **పశ్చిమదిశ** యందు రతీ దేవితో కూడిన కామదేవుడు ఉంటాడు. పాశం, అంకుశం, ధనుస్సు, బాణములతో ఎప్పడు అందంగా అలంకరించబడి ఉండును.
- **ఈశాన్యదిశ** యందు విఘ్నములు తొలగించు వాడు గణేశుడు,పుష్టిదేవీ ఉండును.

### 17. ప్రవాళ ప్రాకారము

వందయోజనముల తో నిర్మితమైంది ఈ ప్రవాళ ప్రాకారము. కుంకుమ తో సమానమైన అరుణ వర్ణము తో ఉండును.పంచభూతములకు అధిపతులైన ఐదుగురు ఇక్కడ ఉంటారు. ఈ శక్తులు పాశ, అంకుశ, వర, అభయ ముద్రలతో ఉంటారు. ఇక్కడ ఉండే ఐదుగురు శక్తుల నామములు

| | |
|---|---|
| హృల్లేఖ | గగన |
| రక్త | కరాళిక |
| మహోచ్ఛుష్మ | |

### 18. నవరత్న ప్రాకారము

ఈ నవరత్న ప్రాకారము అనేక యోజనముల వైశాల్యము కలది. ఇక్కడ ఆమ్నాయ దేవతలు ఉంటారు. ఈ ప్రాకారము యందు అన్ని నవరత్న నిర్మితములే. దేవీ అవతారములు అన్నిటికీ ఇదే నివాసస్థానం.ఇక్కడ అమ్మవారి యొక్క విద్యలు మహావిద్యలు ఉంటాయి.శ్రీ విద్య, ఆత్మ విద్య మహావిద్యా మళ్ళీ వీటిల్లో వామాచారము అని, కౌలచారము, దక్షణాచారము, సమయాచారము అని ఆచారములు అక్కడే ఉంటాయి. ఇవన్నీ వాహనాలు ఎక్కి, కొంతమంది సింహాలమీద కొంతమంది ఏనుగుల మీద కొంత మంది శవాల మీద, కొంత మంది స్త్రీల మీద కొందరు పురుషుల మీద తిరుగుతూ ఉంటారు. వీళ్లంతా కోటికోటి సూర్యకాంతి తో వెలిగిపోతారు.7 కోట్ల మహామంత్రములు స్త్రీ రూపం ధరించి దేవతలను స్తోత్రం చేస్తాయి. పంచాక్షరీ, అష్టక్షరీ మంత్రం, నవాక్షరీ మంత్రం, గాయత్రీ మంత్రం సావిత్రి మంత్రం ఇలా 7 కోట్ల మంత్రములు రూపం ధరించి అమ్మవారి అవతారమూర్తులను ఈ 18వ ప్రాకారం లో స్తోత్రం చేస్తాయి.

### చింతామణి గృహం

ఈ 18 ప్రాకారములు దాటిన తర్వాత అమ్మవారి యొక్క చింతామణి గృహము అత్యంత శోభతో ఉంటుంది. ఈ శోభను వర్ణించడము ఎవ్వరికి సాధ్యము కాదు.ఈ గృహం చింతామణులు అను పేరుగల మణులతో నిర్మింపబడిన గృహము అందువల్ల దీనిని చింతామణి గృహం అంటారు. చింత అనగా కోరిక, కోరిన వెంటనే కోరిక తీర్చే మణి కనుక చింతామణి అంటారు.మోక్షము కూడా ఇవ్వగలవు ఈ చింతామణులు ఇక సాధారాణ కోరిక తీర్చటంలో ఆశ్చర్యము లేదు.పాలసముద్రము చిలికినప్పడు వచ్చిన ఒక్క చింతామాణి కోసం దేవతలు, రాక్షసులు అందరు కొట్టుకున్నారు అటువంటిది అమ్మవారి గృహంమొత్తం చింతామణుల గృహం.చింతమణుల కాంతి ఎలాఉంటుంది అంటే కోట్లకోట్ల సూర్యులు ఉదయిస్తే ఉండే కాంతి ఉంటుంది, చంద్రుడి వెన్నెలంత ఆహ్లాదము కనబడతాయి.ఇక్కడ అమ్మ గృహం వెయ్యి స్తంభాలతో నిర్మించబడినది, ఇక్కడ వెయ్యి సంఖ్య మన మానవులు లెక్కపెట్టేది కాదు,

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



అనంతము అని అర్థం లెక్కవేయలేనిఅన్ని ఉంటాయి అని అర్థం. ఈ గృహముల చుట్టూ నాలుగు మంటపాలు ఉంటాయి అమ్మవారికి. ఈ నాలుగు మంటపాల పేర్లు ఏంటంటే శృంగార మండపము, ముక్తి మండపము, జ్ఞానమండ పము, ఏకాంత మండపము.ఈ నాలుగు మండపముల మధ్యలో అమ్మ గృహము ఉంటుంది.అన్ని మండపములలో విహరిస్తూనే అమ్మ తనగృహము లో ఉంటుంది. వేలాది స్తంబాలతో ఈ మండపములు నిర్మించబడ్డాయి. స్తంబాలు అన్ని మణులతో నిర్మించారు ఇక్కడ మణులు అత్తుకోవడానికి ఎటువంటి పదార్థములు ఉపయోగించలేదు. ఈ స్తంబాలను ఉపయోగించి నిర్మించిన పైకప్పు కూడా పూర్తిగామణులతోనిర్మించబడినది.అన్నిమండపముల నిర్మాణము ఇలానే ఉంటుంది. మండపముల లోపల మల్లెలు మొదలైన సువాసనలు ఇచ్చే తీగలు ఉంటాయి, చెట్లుఉంటాయి, మధ్యలో మహాపద్మములు ఉంటాయి, పెద్ద పెద్ద పద్మములతో ఉన్న అడవులు ఉన్నాయి, చెరువులు ఉన్నాయి ఆ చెరువుల మెట్లకు మణులతో తాపడము చేయబడ్డ మెట్లు ఉన్నాయి. మండపముల లోపలఉన్న చెరువులలో నీరుకు బదులు సుధారసము, అమృతము ఉన్నాయి, ఈ అమృతము పై తామరలు



ఉన్నాయి, వాటి తేన స్వీకరించటానికి తుమ్మెదలు ఝుంకారము చేస్తున్నాయి. ఇవి తుమ్మెదలు కావు అమ్మవారి యొక్క దివ్యశక్తులు.

| | మండపము | అమ్మ నిర్వర్తించు కార్యము |
|---|---|---|
| 1 | శృంగార మండపము | ఇక్కడి సభలో ప్రముఖ దేవతలు అమ్మను గానము చేస్తారు |
| 2 | ముక్తి మండపము | ప్రతి బ్రహ్మాండము లో ఉన్న భక్తులకు ముక్తినిస్తుంది |
| 3 | జ్ఞానమండపము | దివ్యమైన తెజ్జస్సుతో ఇక్కడ అమ్మజ్ఞానమును ఉపదేశిస్తుంది |
| 4 | ఏకాంత మండపము | తన శక్తులతో జగత్తును ఉద్దరించుటకు,రక్షించుటకు అనేక ఆలోచనలు చేస్తుంది |

చింతామణి గృహము దేవికి ప్రధానస్థానము.జగజ్జనని లోకములను ఏలు అంబిక, అనేక బ్రహ్మాండ జనని అయిన భగవతి భువనేశ్వరి ఇక్కడ కొలువుతీరి ఉంటుంది.అమ్మవారు ఇక్కడ ఒక మంచం పై కూర్చున్నది. ఈ మంచమునకు నాలుగు పాదములుగా బ్రహ్మ, విష్ణు,రుద్రుడు, ఈశ్వరుడు. ఈ మంచమునకు బల్లగా సదాశివుడు ఉంటాడు.ఈ ఐదుగురు అమ్మవార్ని మోస్తూఉంటారు.లోక శ్రేయస్సు కోసము తన శరీరమును రెండుగా మార్చుకున్నది.అందులో కుడివైపు కామేశ్వరుడు ఉంటాడు ఆయన యడమ తొడ మీద కూర్చొనిఉంటుంది జగదాంబ. ఈయన కోటి కామదేవుల సమానమైన సౌందర్యము కలవాడు, ఐదు ముఖములు,మూడు నేత్రములు కలవాడు.సర్వాభరణములను ధరిస్తాడు. ఎప్పుడు చుసినా పదహారు సంవత్సరములు కలిగిఉంటాడు. అభయముద్ర, వరముద్ర, గొడ్డలి చేబూని ఉంటాడు. కోట్లాది చంద్రుల వలే చల్లనిచూపు చూస్తాడు.ఈ తండ్రి ఎడమ తొడపైన కూర్చొని ఉంటుంది అమ్మలను కన్నా అమ్మ దేవీ భువనేశ్వరి.ఆ తల్లి ఎలా ఉన్నది అంటే నవరతనముల తో తాపడము చేయించిన వడ్డాణము, భుజకీర్తులు, మెడలో హారాలు ధరించింది,శ్రీచక్ర ఆకారముగల కుండలము లు



ధరించినది.అమ్మ ముఖం తామరపువ్వు వలే వెలుగుతూ ఉంటుంది, నుదురు అర్ధచంద్రాకారము వలే వెలుగుతుంది.దొండపండు వంటి పెదవులు కలిగిఉన్నది అమ్మ.దంతాలు తెల్లని ముత్యముల వలె ఉన్నది. నుదుటి కుంకుమ ఉంటుంది. తలపై చూడా మణి ధరించినది. ఇది కోటి సూర్యుల కాంతి కలిగినది.ఉదయిస్తున్న సూర్యభగవానుడి వలెఉన్న ముక్కుపుడక ధరించింది.ముక్కు సంపంగి పూవు వలె ఉంటుంది. ఒంటికి అమ్మ పచ్చకర్పూరం, కుంకుమ ధరించి ఉంటుంది.దానిమ్మ పళ్ళ వలె అమ్మ పళ్ళవరస ఉంటుంది.అపూర్వమైన కిరీటము ధరించినది.సువర్ణ కంకణములు ధరించినది. చేతి వేళ్ళకు అమ్మ ఉంగరాలు ధరించిఉంటుంది.మూడు నేత్రములతో అమ్మ దర్శనంఇస్తున్నది. కోటానుకోట్ల సూర్యచంద్రులకాంతితో వెలిగిపోతున్నది. అమ్మ రత్నములు తాపడం చేయబడ్డ బంగారు కిరీటం ధరించి ఉన్నది విష్ణువు కూడా ఆ బంగారానికి ఆ బంగారు అతికించిన టువంటి మణులకు కానీ లెక్క కట్టలేడు కిరీటం మీద చంద్రుడు ఉంటాడు కాళ్లకు బంగారముతో తయారు చేయబడ్డ నూపురము లు ఉన్నాయి ఆ ఆ ను పురములకు మంచి మంచి మువ్వలు ఉన్నాయి ఆ మువ్వలు కూడా సువర్ణము రత్నముల తో తాపడం చేయబడినవే అమ్మ కాళ్లు కదిలినప్పడల్లా ఆ గజ్జె గల్లు గల్లు మంటూ శబ్దం చేస్తాయి ఈ శబ్దం సరస్వతి దేవి పాడిన పాట కన్నా అద్భుతంగా ఉంటుంది చేతులకు రత్నములలో తాపడము చేయబడ్డ కంకణములు ఉంటాయి ఈ కంకణాలు అపూర్వ కాంతితో వెలుగుతూ ఉంటాయి అమ్మ పై నుండి క్రింద వరకు వేలాడుతున్నట్టు వంటి జడతో ఉంటుంది నల్లని తుమ్మెద రెక్కల్లాంటి జుట్టు తో ఉంటుంది అమ్మ ఈ జుట్టు ముడి లో మల్లికలు సంపంగులు ఇటువంటి పువ్వులన్నీ దండలుగా ధరించి ఉంది అమ్మ. ఆవిడ చేతుల్లోనే ఒక చేత్తో వరద హస్తం ఇస్తుంది ఓ చేత్తో వరాలు ఇస్తుంది ఒక చేత్తో అభయమిస్తుంది.మణిద్వీపం లో ఉన్న అమ్మ ఎప్పుడూ నవ్వుతూనే ఉంటుంది అమ్మ సంగీత సాహిత్యములను తన స్తనములుగా చేసుకున్నది అమ్మ తన చేతుల్లో ఒకపాత్ర పెట్టుకున్నది ఆ పాత్ర రత్నముల తో అలంకరించబడిన బంగారు పాత్ర. ఇది మామూలు పాత్రకాదు.ఈ పాత్ర పైన తుమ్మెదలు వాలుతున్నాయి. ఈ పాత్ర తేనేతో నింపబడినది.అమ్మ ఒకచేత్తో ఎర్రకలువపువ్వు పట్టుకున్నది. ఒక చేత్తో పాశం ఒక చేత్తో అంకుశం ధరించినది. ఒక చేత్తో శంఖము ఒక చేత్తో చక్రము ధరించింది అమ్మ అమ్మవారి పాదాలు ఎర్రగా ఉంటాయి. ఈ విధముగా రకరకాల ఆయుధాలు ఆభరణములు ధరించి అమ్మ దర్శనమిస్తుంది ఆపాదమస్తకం అమ్మ అలంకరించుకుని ఉంటుంది అమ్మవారి అలంకారాన్ని అసలు వర్ణించలేము. అమ్మ సుకుమార స్వరూపిణి సౌందర్యవతి అవ్యాజకరుణామూర్తి అమ్మ మాట్లాడితే ఆ మాధుర్యము సరస్వతీ దేవి యొక్క వీణ కూడా పనికిరాదు అమ్మ చుట్టూ లజ్జా తుష్టి, పుష్టి, కీర్తి, క్షమా, కాంతి అని పిలవబడే దేవతలు నిరంతరము తిరుగుతూఉంటారు అనేక దాసీలు, దేవతలు అక్కడ అమ్మను కీర్తిస్తున్నారు.అమ్మ కొలువైన చింతామణి గృహం వేలయోజనముల విస్తీర్ణం కలది. ప్రళయ కాలములో నశించదు, సృష్టి కాలము లో ఆవిర్భవించదు. ప్రతి లోకము, బ్రహ్మాండము నుండి దేవీ భక్తులు ఇక్కడకువచ్చెదరు. అమ్మవారి చింతామణి గృహము ఇంత వైశాల్యము అని చెప్పడానికి వీలు లేదు వేలాది యోజనముల వైశాల్యము కలిగినటువంటి ఈ చింతామణి గృహం అటువంటి చోట కూర్చొని భువన బ్రహ్మాండములను రక్షిస్తూ ఉంటుంది అక్కడ నిరంతరం ద్రాక్షరసం ప్రవాహము నేరేడు పండు రసం ప్రవాహములు ఇంకా రకరకాల పళ్లరసాలు కాలువల కింద ప్రవహిస్తూ ఉంటాయి ఇవన్నీ కూడా సుధా సముద్రంలో కలిసిపోతాయి ఇక్కడ మాటవరసకు కూడా రోగాలు ఉండవు ముసలితనం ఉండదు ఇక్కడ అసలు ఎవరికీ ఏ విధమైన ఆలోచనలు ఉండవు ఇక్కడ అందరూ యువతీయువకులు గానే ఉంటారు ఇక్కడ నిరంతరము అందరూ భువనేశ్వరి ని పొగుడుతూ భక్తితో కొలుస్తూ





పూజిస్తూ ఉంటారు ఇక్కడ ఉన్న వారు కొందరు అమ్మకు దగ్గరగా ఉంటారు కొందరు అమ్మలో కలిసిపోతారు కొందరు అమ్మకు సలహాలు ఇస్తారు. జగన్మాతకు రూపం లేదు లోకం కోసం ఇలా రూపం ధరించి ఉంటుంది ఆ తల్లి మనందరి కోసం మణిద్వీపం అనే ఈ లోకాన్ని సృష్టించుకొని మనందరినీ ఆనంద పెడుతున్నది ఆ అంబిక జగన్మాత మణిద్వీపమునకు సాటి వచ్చేది ఈ ప్రపంచంలో మరెక్కడా లేదు అటువంటి లోకానికి నిరంతరం అమ్మను ఆరాధించిన వాడు ఉండగలుగుతాడు ఎవరైనా మంచం మీద ఉన్నప్పుడు ఈ మణిద్వీప వర్ణన వినిపిస్తే వాడు అమ్మ దగ్గరికి వెళ్ళి పోతాడు ఈ మణిద్వీప వర్ణన శ్లోకాన్ని పారాయణం చేస్తే భూత ప్రేత పిశాచ బాధలు ఇళ్లల్లో ఎప్పటికీ కలగవు కొత్తగా ఇల్లు కట్టుకున్నప్పుడు మణిద్వీప వర్ణన చదివిస్తే ఇళ్లలో ఉన్న వాస్తు దోషాలు అన్ని తొలగిపోతాయి అన్ని దోషాలు తొలగిపోయి ఇళ్ళు పరమపవిత్రమైన మణిద్వీపము గా మారిపోతుంది చదవలేని వాళ్ళు ఎవరైనా పిలుచుకుని వచ్చి చదివించిన చాలు వారికి సకల శుభాలు కలుగుతాయి ఇది ఈ మణిద్వీప మహిమ

*****

## దుర్గా సప్తశతి ని నవరాత్రులలో పారాయణం చేసుకొనవచ్చున ? చేసుకొనుటకు పాటించవలసిన నియమములు ?

దుర్గా సప్తశతి లో మొత్తము 13 అధ్యాయములు ఉంటాయి, ప్రతి దినము దుర్గా సప్తశతి పారాయణము చేయుటకు గంటా, గంటన్నర సమయంలో అవుతుంది. ఆ మాత్రం సమయం కేటాయించుకుని సప్తశతి పారాయణము చేయడం ఎంత గొప్పది. దుర్గా సప్తశతిని అది కూడా బాల పూజ చేసి (బాల అనే శబ్దమునకు సకలలోక ఆధిపత్యం అని అర్థము)అంటే అమ్మని బాలా రూపములో పూజ చేస్తే సకల లోకాలు మన ఆధీనం అవుతాయి. బాలా రూపములో అమ్మ పూజ చేస్తే రాక్షసులను మనం దూరం చేయగలుగుతాము, అనేక శక్తులు వస్తాయి. ఇంకా బాల గురించి చెప్పాలంటే అది ఒక మహా మంత్రం బాల అని రూపంలో ఉన్న అమ్మవారు వాక్సిద్ధినిస్తుంది. కోరికలు తీరుస్తుంది. శరీరమును మనసును దృఢంగా ఉంచుతుంది. అదే ఐం క్లీం సౌః అనే బీజములు .

*****

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




## నవరాత్రి పూజావిధానము

| అమ్మవారికి ఇష్టమైనవి 4 మాసాలు |
| --- |
| ఆశ్వయుజ మాసం |
| మాఘ మాసం |
| చైత్ర మాసం |
| వైశాఖ మాసం |

అమ్మవారికి ఇష్టమైనవి 4 మాసాలు ఆశ్వయుజ మాసం,మాఘ మాసం ,చైత్ర మాసం , వైశాఖ మాసం . వసంత నవరాత్రులు , శరత్ కాలంలో వచ్చే నవరాత్రులు (అనగా శుక్ల పక్షం లో పాడ్యమి మొదలు నవమి వరకు) ఇవి రెండూ అమ్మకి మరింత ఇష్టం.వసంత నవరాత్రులు శరన్నవరాత్రులు యముని కోరలు (మృత్యు దేవత స్వరూపం). ఈ సమయంలో విపరీతంగా రోగాలు వచ్చేవి. శ్రావణ, భాద్రపద మాసాలలో వచ్చే వానల వలన రకరకాల రోగాలు వస్తాయి. ఈ రోగాలు విజృంభించే కాలం పరాకాష్టకు చేరేది. ఈ రోగాలు జ్వరం లాంటి వాటివలన ఒక్కోసారి ప్రాణ నష్టం జరిగేది.ఈ రోగములు నుంచి మానవులు ఎలా విముక్తి పొందాలి అని నారదునికి అనుమానం వచ్చింది. వెంటనే బ్రహ్మ లోకానికి వెళ్ళాడు . బ్రహ్మ వైకుంఠంమునకు ,వీళ్ళంతా కైలాసమునకు , ఆ తర్వాత నలుగురు కలిసి అమ్మవారి దగ్గరకి వెళ్లారు.అప్పుడు అమ్మవారు అన్నది అతి భయంకరమైన యమ దంష్ట్ర లాంటి సంధి కాలంలో ఋతువు నుంచి ఋతువు మారే క్రమంలో మానవులు విముక్తి పొందడానికి సులభోపాయం చెప్తున్నాను. ఆ ఉపాయాన్ని నేను చెప్పినట్టుగా చేశారంటే వారికున్న రోగాలు తొలగిపోతాయి.. వసంత నవరాత్రి ,శరన్నవ రాత్రి మళ్లీ ఈ రెండిటిలో ఆశ్వయుజ శరన్నవరాత్రులు నాకు చాలా ఇష్టం.పాడ్యమి మొదలు నవమి వరకు 9 రోజుల పాటు నన్ను భక్తి శ్రద్ధలతో పూజించండి. 10 వ రోజు విజయదశమి ఆ రోజు చేయవలసిన కార్యక్రమాలు మానవులకి నేను విధిస్తున్నాను ,ఇలా అర్చన చేయాలి అని కొన్ని సూచనలు చేస్తాను వాటి ప్రకారం నన్ను ఆ 10 రోజులు విశేషంగా అలంకారం చేసి పసుపు తో కుంకుమ తో వివిధమైన పుష్పాలతో, ఫలాలతో , ధూపం తో ,దీపం తో , నైవేద్యాలతో నన్ను అర్చిస్తే అటువంటి వారికి మాటవరసకు కూడా అనారోగ్యం లేకుండా చేస్తాను వాళ్ళని బాగుపరుస్తాను అన్నది. అప్పుడు త్రిమూర్తులు నారదుల వారు ఆ విధానం ఏమిటి అన్నారు.శరత్కాలం లో అమ్మని పూజించడం మహాయోగం. అమావాస్య నాటికే పూజా సామానులు అన్నీ తెచ్చుకోవాలి.





## మండపారాధన విధానం:

మండపారాధనకి పీట లేదా పూజ మందిరం లో గద్దెను ఏర్పాటు చేసుకోవాలి

దాని మీద చీర గాని , దుప్పటి గాని బాగా విశాలమైన తువ్వాలు గాని పరచాలి

.దాని మీద బియ్యం పొయ్యాలి . బియ్యానికి కూడ కేజీంపావు కి తక్కువ కాకూడదు వీలుంటే 5 కేజీలు పోయడం చాలా మంచిది

పేద వాళ్ళం అనుకుంటే విస్తరాకో అరటి ఆకో వేయండి అది కూడ లేదంటే అక్షింతలు వేసి పీటపై బియ్యం పోసి మండపారాధన చేయమన్నారు

## కలశారాధన విధానం:

**కలశస్థాపన**

* మండపారాధన అయ్యాక ఒక కలశం పెట్టాలి.రాగి/ఇత్తడి,/ బంగారం,/వెండి/మట్టి చెంబు అయిన పెట్టొచ్చు

**కలశస్థాపన**

* కలశంమీద కొబ్బరికాయ పెట్టాలి. ఆ కొబ్బరికాయ చుట్టూ పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టాలి

**కలశస్థాపన**

* కొబ్బరికాయ పైన అందమైన జాకెట్టు ముక్క వీలుంటే ఎర్ర ముక్క పెట్టడం మంచిది

**కలశస్థాపన**

* కలశ స్థాపన పాడ్యమి నాడు చేయాలి , అమావాస్యసాయంత్రం కే ఈ సామానులు తెచ్చులోవాలి



పూజకు సూచనలు

(గమనిక: మీ ఆరోగ్యాన్ని, శక్తిని, ఆర్థిక స్థితిని, మీ సాంప్రదాయమును అనుసరించి అవసరమైన సూచనలను మాత్రమే స్వీకరించగలరు)

- ఈశాన్యం తూర్పు లేదా ఉత్తరము వైపుగా పూజ చేయాలి. కలియుగం లో తూర్పు ఉత్తరం వైపు కి తిరిగి పూజిస్తే కోరికలు తీరుతాయి
- దక్షిణం వైపుకి తిరిగి పూజిస్తే వైరాగ్యం ధన నష్టం విరక్తి కలుగుతాయి. పడమర దిక్కుగా పూజిస్తే కేవలం శత్రువుల మీద విజయం కలుగుతుంది.
- పుష్పములు, గరిక నైవేద్యం ఇవి మాత్రం ఏ రోజు కు ఆ రోజు తెచ్చుకోవాలి చేసుకోవాలి.మండపారాధన తో అర్చన చేసే వాళ్ళు కదపకూడదు
- కలశం పడగొట్ట కూడదు ,పువ్వులు తీసేసి వేరేవి పెట్టొచ్చు
- బియ్యం కలశం చెంబు కదపరాదు.
- అమ్మవారికి చాలా ఇష్టమైన మంత్రాలలో చండీ మంత్రం ,నవార్ణ మంత్రం , షోడాశాక్షరి , పంచదశి, బాల . గురువుల ద్వారా ఉపదేశం పొంది అనుష్టానం చేయాలి
- ఈ తొమ్మిది రోజులు అమ్మని పూజించేందుకు తెల్లవారు జామున లేచి 9 రోజులు శిర స్నానం చేయండి,
- తాజా గంధం అరగదీసి అమ్మకు సమర్పించాలి
- అమావాస్య నాటికి అన్ని పూజా వస్తువులు తెచ్చుకోవాలి.నేను నవరాత్రి పూజ చేయాలి అనుకుంటున్న నీ అనుగ్రహం కలగాలి,పూజకు ఆటంకం ఉండకూడదు అని దేవిని ప్రార్థించాలి

  శ్లో॥ కరిష్యామి వ్రతం మాతః నవరాత్రమనుత్తమమ్॥
  సాహాయ్యం కురుమే దేవి, జగదంబ మమాఖిలమ్॥

  శ్రీమద్దేవీ భాగవతం 3వ స్కంధం - 26వ అ - 26 శ్లో॥

- 16 ఉపచారములు చేయాలి కుదరకపోతే పంచ పూజ అయినా చేయాలి
- అవకాశం ఉన్నవారు 4,8,18 చేతులు ఉన్న సింహవాహినిని పూజించాలి
- అవకాశం ఉన్నవారు ఆరోగ్య సమస్యలు లేని వారు నక్తం, ఉపవాసం ఉండాలి
- అవకాశం ఉండి శరీరము సహకరించిన వారు నదీ స్నానం, బావి, కుంట వద్ద స్నానం చేయాలి కుదరదు అనుకుంటే ఇంట్లో స్నానం చేయవచ్చు
- హింస చేయకూడదు, అబద్ధాలు ఆడకూడదు, శరీరము సహకరించిన వారు నేలపై నిద్రపోవాలి
- మన శక్తి అనుసరించి దాన ధర్మాలు చేయవచ్చు
- నవ రాత్రి పూజ వలన పాపముల నశించి అమ్మ అనుగ్రహం పొందుతారు
- దుర్గాష్టమి అమ్మకు ఇష్టమైన రోజు. యోగినీ దేవతలతో కలిసి భద్రకాళీగా అమ్మ జన్మించింది
- కుమారి పూజ, సువాసిని పూజ చేయాలి. కుమారి పూజకు 2 నుండి 10 సంవత్సరాలు వయసు ఉన్న పిల్లలను పూజించాలి
- అమ్మవారి పూజలో గంధం, అగరువత్తులు, కర్పూరం, సుగంధ పుష్పాలు ఉండాలి.
- అమ్మవారిపూజకు ఈ క్రింది పూవులుండాలి 1. మందారం. 2. గానుగపూలు, 3. అశోకం, 4. సంపెంగ, 5. గన్నేరు, 6. మాలతి, 7. బిల్వపత్రాలు, 8. తామరపూలు, 9. కలువపూలు ముఖ్యంగా నల్లకలువలు.
- ప్రతిదినం వీలున్నంతవఅకు అమ్మకు నైవేద్యంలో ఉండవలసిన ఫలాలు 1. కొబ్బరికాయ 2. నిమ్మ 3. దానిమ్మ 4. అరటిపళ్ళు 5. నారింజ 6. పనస 7. మారేడుకాయ.



# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



## శ్రీ ప్రణవ పీఠం లో అమ్మవారి అలంకారము వివరాలు

| | తేదీ | వారము | ప్రణవ పీఠం లో అలంకారము | తిథి |
|---|---|---|---|---|
| 1 | 26-09-2022 | సోమవారము | శ్రీ బాలాత్రిపురసుందరీ | పాడ్యమి |
| 2 | 27-09-2022 | మంగళవారము | శ్రీ గాయత్రీ దేవి | విదియ |
| 3 | 28-09-2022 | బుధవారము | శ్రీ అన్నపూర్ణాదేవి | తదియ |
| 4 | 29-09-2022 | గురువారము | శ్రీ శ్రీ లలితా దేవి | చవితి |
| 5 | 30-09-2022 | శుక్రవారము | శ్రీ మహాలక్ష్మీ దేవి | పంచమి |
| 6 | 01-10-2022 | శనివారము | శ్రీ మంగళ గౌరీ దేవి | షష్ఠి |
| 7 | 02-10-2022 | ఆదివారం | శ్రీ సరస్వతీ దేవి | సప్తమి |
| 8 | 03-10-2022 | సోమవారము | శ్రీ దుర్గా దేవి | అష్టమి |
| 9 | 04-10-2022 | మంగళవారము | శ్రీ మహిషాసుర మర్ధిని | నవమి |
| 10 | 05-10-2022 | బుధవారము | సువర్ణ కవచాలంకృత శ్రీ మాత | దశమి |

## అమ్మకు చేయవలసిన అన్ననైవేద్యములు

| | తేదీ | వారము | అన్ననైవేద్యం | తిథి |
|---|---|---|---|---|
| 1 | 26-09-2022 | సోమవారము | పులగం | పాడ్యమి |
| 2 | 27-09-2022 | మంగళవారము | దధ్యన్నము | విదియ |
| 3 | 28-09-2022 | బుధవారము | గుడాన్నము | తదియ |
| 4 | 29-09-2022 | గురువారము | నేతి అన్నం | చవితి |
| 5 | 30-09-2022 | శుక్రవారము | పాయసాన్నము | పంచమి |
| 6 | 01-10-2022 | శనివారము | పులిహోర | షష్ఠి |
| 7 | 02-10-2022 | ఆదివారం | పాయసాన్నము,పులిహోర | సప్తమి |
| 8 | 03-10-2022 | సోమవారము | దధ్యన్నము, పాయసాన్నము | అష్టమి |
| 9 | 04-10-2022 | మంగళవారము | పాయసాన్నము,పులిహోర, దధ్యన్నము, గుడాన్నము | నవమి |
| 10 | 05-10-2022 | బుధవారము | దశమినాడు పైన చెప్పిన అన్ని కానీ కొన్ని కానీ మన వీలును బట్టి | దశమి |

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



## అమ్మకు చెయవలసిన నివేదనలు వాటి ఫలితలు

| | తేదీ | తిథి | నివేదన | నివేదన ఫలితం |
|---|---|---|---|---|
| 1 | 26-09-2022 | పాడ్యమి | ఆవునేతి నైవేద్యం | రోగాలు తొలగుతాయి |
| 2 | 27-09-2022 | విదియ | పంచదారతో అభిషేకం | దీనివలన దీర్ఘాయువు కలుగుతుంది. |
| 3 | 28-09-2022 | తదియ | పాలతో అభిషేకం | దుఃఖాలు తొలగుతాయి. |
| 4 | 29-09-2022 | చవితి | అప్పాలు- అభిషేకం | మన పనులలో విఘ్నాలు కలగవు. |
| 5 | 30-09-2022 | పంచమి | అరటిపళ్ళ నైవేద్యం | తెలివితేటలు. పెరుగుతాయి |
| 6 | 01-10-2022 | షష్ఠి | తేనెతో అభిషేకం | సుందరరూపం, మధుర స్వరం లభిస్తాయి. |
| 7 | 02-10-2022 | సప్తమి | బెల్లంతో అభిషేకం ,నైవేద్యం | శోకనాశనం |
| 8 | 03-10-2022 | అష్టమి | జీడిప్పతో అభిషేకం కొబ్బరికాయ నైవేద్యం | తాపాలు తొలగుతాయి. |
| 9 | 04-10-2022 | నవమి | జీడిపప్పుతో అభిషేకం కొబ్బరికాయ నైవేద్యం | ఈ లోకంలో సుఖజీవనం స్వర్గం వంటి ఉత్తమగతులు. |
| 10 | 05-10-2022 | దశమి | నువ్వులతో అభిషేకం | యమభయం తొలగుతుంది |





## కథలు

యథాశక్తిగా అమ్మను ప్రార్థించి, పూజ పూర్తి అయ్యాక పాడ్యమి మొదలు దశమి వరకు రోజు చదవవలసిన అమ్మ కథలను పూజ్య గురుదేవులు వద్దిపర్తి పద్మాకర్ గారు అందించారు.



### పుజావిధానము మఱియు నివేదనము:

**ఉదయం:** అరటిపళ్ళు,కొబ్బరికాయ. నివేదన చేయాలి. ఉదయం పూట దేవి ఖడ్గమాల స్తోత్రం తో కుంకుమ తో పూజ చేయాలి. అన్న నైవేద్యం మీ వీలు ని బట్టి చేసుకోండి

**సాయంత్రం:** ఉడకబెట్టిన శెనగలు పోపు పెట్టినవి నివేదన చేయాలి సాయంత్రం శ్రీ లలితా సహస్రనామం కానీ దుర్గా సహస్ర నామ స్తోత్రం తో కానీ లక్ష్మీ దేవి సహస్రం తో కానీ ఎదో ఒక దానితో ఈ కలియుగం లో లలితా సహస్రనామం చాలా శక్తి వంతమైనది దానితో చేస్తే చాలా మంచిది. లలితా త్రిశతి మన శక్తి సమయంని బట్టి స్తోత్రాలు చేయాలి. సాయంకాలం పూజ అమ్మవారికి ప్రత్యేకత. నృత్యం, వాద్యం,గీతం అమ్మకి చాలా ఇష్టం. అందుకే భక్తులు శరన్నవ రాత్రులలో పూజ చేసేటప్పుడు చక్కగా పాటలు కూడ పాడుతారు. ప్రతి దినము బాలా పూజ, సువాసిని పూజలు చేయాలి

### పాడ్యమి రోజు :

| | |
|---|---|
| తేదీ | 26-09-2022 |
| వారము | సోమవారము |
| ప్రణవ పీఠం లో అలంకారము | శ్రీ బాలాత్రిపురసుందరీ |


**9 రోజులు 9 కథలు ఉన్నాయి.** ఈ కథలు వినడం వలన దేవీ భాగవతం పారాయణం చేయకపోయినా ఈ కథ వినడం వలన పారాయణ ఫలితం తో సమానం.ఈ కథ విన్నప్పుడు చేతిలో అక్షతలు పెట్టుకుని కథ అయ్యాక అమ్మవారి పాదాల దగ్గర వేసి ఆ కథాక్షతలు నెత్తి మీద వేసుకుంటే శుభఫలితం వస్తుంది

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




**పాడ్యమి రోజు కథ:**



ఈ మొదటి రోజు కథ ఏమిటి అనగా ఒకానొకప్పుడు వైకుంఠం లో లక్ష్మీ దేవి శ్రీ మహావిష్ణువు పాదాలు వత్తుతున్నది ,ఆ సమయం లో సూర్యదేవుని సారథి రథాలు నడిపే వాళ్ళలో ఒకడు గుర్రం ఎక్కి రేవంతుడు వస్తున్నాడు , వరసకు లక్ష్మీ దేవి కి సోదరుడు అవుతాడు,పాల సముద్రం చిలికినప్పుడు లక్ష్మీ దేవి తో పుట్టాడాయన . ఎంత కాలానికి మా సోదరుడు వచ్చాడు అని ప్రేమగా చూస్తూ ఉండిపోయింది. విష్ణువు, మహా లక్ష్మి అని పిలిచాడు !పలకలేదు, మళ్ళీ లక్ష్మీ అన్నాడు రేవంతుడిని చూస్తూ పలకలేదు, విష్ణువు కోపం తో సోదర ప్రేమతో భర్త పిలిస్తే పలకలేదు గనుక నువ్వు గుఱ్ఱం అయిపో అని శపించేసాడు. లక్ష్మీ దేవి ఉలిక్కి పడింది. రాక రాక మా సోదరుడు వచ్చాడని అటు చూసాను ఆ మాత్రానికే శపిస్తావా !అంటే లోక శ్రేయస్సు కోసం అలా శపించాను అని చెప్పారు విష్ణువు. ఈలోపు రేవంతుడు హడిలిపోయి అనవసరంగా వచ్చి వాళ్ళిద్దరినీ విడదీశాను అనుకొని దర్శనం చేసుకోకుండా అటునుంచి అటే వెళ్ళిపోయాడు. అపుడు లక్ష్మీ దేవి నేను మళ్లీ నీ దగ్గరకు ఎలా వస్తాను ఆడ గుర్రం అయిపోయి?నేనక్కడ నువ్వక్కడ ఉంటే? అప్పుడు విష్ణువు చెప్పాడు నావల్ల నీకు సంతానం కలగగానే ,తిరిగి వైకుంఠానికి వస్తావ్ అన్నాడు.లక్ష్మీ దేవి ఆడ గుర్రం రూపం ధరించి ఉత్తర కురుభూముల్లో గుర్రం రూపంలో ఎంతో భక్తితో శివుని కోసం తపస్సు చేసింది. అపుడు శివుడు ప్రత్యక్షమై ఏం కావాలి అంటే నా భర్త నా దగ్గర కి రావాలి !అయన వల్ల పిల్లాడిని కనాలి , కన్నాక నాకు విముక్తి కలుగుతుంది అట! శాపం నుంచి అపుడు నేను వైకుంఠానికి వెళతాను దయతో మా ఆయన్ని పిలిపించు అంటే శివుడు చిరునవ్వు నవ్వి నీ భర్త విష్ణువు సకల లోకాలకి అధిపతి అటువంటి అయన గురించి తపస్సు చేయక మధ్యలో నాకోసం ఎందుకు తపస్సు చేశావు అన్నాడు. అపుడు లక్ష్మీ దేవి ఇలా అంది, వైకుంఠం లో నా భర్త కళ్ళు మూసుకుని ధ్యానం లో ఉన్నాడు ఆ సమయంలో నేను ఆయన దగ్గరకి వెళ్ళాను స్వామీ లోకం అంతా మీ కోసం ధ్యానం చేస్తుంటే మీరు ఎవరికోసం ధ్యానం చేస్తున్నారు అని అడిగాను అపుడు ఆయన "నేను ఎప్పుడూ కళ్ళుమూసుకుని శివుని ధ్యానిస్తాను, శివుడు నన్ను ధ్యానిస్తాడు, మేమిద్దరం ఒకటే,ఆ విషయం తెలీక కొంతమంది మూర్ఖులు శివకేశవ భేదం తో కొట్టుకు పోతూ ఉంటారు. నా భక్తులు శివుడ్ని ద్వేషిస్తూ ఉన్నారు , శివ భక్తులు నన్ను ద్వేషిస్తూ ఉన్నారు , దానివల్ల వారు సూర్యచంద్రులు ఆకాశంలో ఉన్నంత వరకు నరకం కి పోతున్నారు. సృష్టి ఉన్నంత వరకు నరకానికి వెళతారు , శివకేశవులు ఇద్దరినీ భేదం తో చూసి తిట్టేవాళ్ళు. అందుకే లోకానికి సందేశం ఇవ్వడానికి మేమిద్దరం ఒకనొకళ్ళం ఇలా ధ్యానం చేసుకుంటూ ఉంటాం అని చెప్పాడు. కాబట్టి నిన్ను పూజిస్తే ఆయన్ని పూజించినట్టే , ఆయన్ని పూజిస్తే నిన్ను పూజించి నట్టే . నీకు చెప్పానంటే నువ్వు ఆయన్ని నాదగ్గరకు పంపుతావు.శివుడు నవ్వి ఇది శరత్ కాలం ఆశ్వయుజ మాసం పాడ్యమి ఈరోజు మొదలైంది ,



అమ్మవారి ప్రతిమ ను ఇస్తాను ,ఈ ప్రతిమని మందార పుష్పాలతో పూజించు. ఎవరు అమ్మవారిని పాడ్యమి నాడు ఎర్రని పూలతో పూజిస్తారో వారికి అనుకున్న కోరికలు తీరుతాయి వారికి భర్త సమాగం అవుతుంది భర్త తో కలిసి ఉండవచ్చు. వాళ్ళకి సకల సౌభాగ్యాలు వస్తాయి అని అమ్మవారి విగ్రహం ఇచ్చి,పూజ చేయడానికి మందార పుష్పాలు తానే ఇచ్చాడు,ఈ పుష్పాలతో అమ్మవారి యొక్క అష్టోత్తర శతనా మాలతో భక్తితో లక్ష్మీ దేవి అమ్మని పూజించింది ఆనాడు శరత్ కాలంలో కృత యుగం లో పాడ్యమి నాడు అంటే దసరా లో మొదటి రోజు పూజించింది . కాబట్టి మనం కూడా ఎం చేయాలి.? దసరా లో కలశ స్థాపన అయ్యాక కలశం వెనక గానీ ముందు గానీ అమ్మవారి రూపం పెట్టుకోండి (మట్టి/వెండి/బంగారం/కాగితం పటం ) ఆ పటానికి ముందు ఓ పళ్ళెం పెట్టాలి ఆ పళ్ళెం లో అవకాశం ఉన్నవాళ్లు శ్రీచక్రం పెట్టుకోండి లేనివాళ్ళు అమ్మవారి పాదాలను చూసుకుంటూ కుంకుమ తో పూజించాలి,ఆ పూజ అయ్యాక అప్పుడు మందార పుష్పాలతో పూజిస్తే చూడండి.వాళ్లకి ఆ ఏటి కి ఏడాది వాళ్లు అనుకున్న పనులు అయి తీరుతాయి.లక్ష్మీ దేవి పూజ చేయగానే , అమ్మవారు ఒక దూతని పంపి విష్ణువుని అక్కడకు రప్పించింది,విష్ణువు మొగ గుర్రం రూపంలో అమ్మదగ్గరకి వచ్చాడు ఈ అశ్వ రూపంలో ఉన్న విష్ణువు అశ్విని రూపంలో ఉన్న లక్ష్మీ దేవితో సాంగత్యం చేసాడు, లక్ష్మీ దేవి గర్భం ధరించి ఒక కుర్రాడిని కన్నది. గుర్రం ని సంస్కృతం లో హయము అని కూడా అంటారు. హయమునకు హయమునకు పుట్టాడు గనుక ఆ పుట్టిన కుర్రాడికి హై హయుడు అని పేరు వచ్చింది. వాడు ఒక్కడైనా ప్రపంచాన్ని జయించాడు అందుకే ఏకవీరుడు అని పేరు. ఆ ఎకవీరుడు మళ్లీ అమ్మవారిని పూజించాడు ఏకావళీ అనే భార్య ని పొందాడు , కాలకేతుడు అనే రాక్షసుడిని సంహరించాడు ,ఆ ఏకవీరుడికి ఏకావళి కి పుట్టినవాడు కృతవీర్యుడు,ఆ కృతవీర్యుడి కొడుకు కార్తవీర్యార్జునుడు (దత్తాత్రేయ భక్తుడు). అంత గొప్ప హయహాయ వంశమే స్థాపించబడినది ,అమ్మ అనుగ్రహంతో ఆ వంశం చాలపాటు సాగింది. అమ్మని పుజించినంత కాలం వాళ్లు బాగున్నారు, అమ్మని తిరస్కరించారు మధ్యలో ఆ వంశం లో వాళ్లు కొంతమంది చివరికి పరశురాముడి చేతిలో మరణించారు. కాబట్టి మనం ఎప్పుడు కూడా పాడ్యమి నాడు మందారం పూలతో పూజించి ఏదో ఒక అన్న నైవేద్యం పెట్టి కొబ్బరికాయ రెండు అరటిపళ్ళు పెట్టండి.సాయంకాలం శెనగలు నైవేద్యం పెట్టిన వాళ్ళకి వంశాభివృద్ధి అవుతుంది, భార్యా భర్తల మధ్య లో ఐకమత్యం కలుగుతుంది, ఎప్పుడూ కూడా ఈ కార్యక్రమాలు అయిపోయాక ఇంట్లో అయతే ఆత్మ ప్రదక్షిణము గుళ్ళో అయతే పీఠం చుట్టూ గానీ ప్రదక్షిణం చేసుకుంటే వాళ్ళు తరిస్తారు.

ఈ విధంగా మొదటి రోజున అమ్మవారిని పూజించి , కథ విని భక్తులందరూ కూడా అనేక శుభాలు పొందాలని గురువుగారు మంగళా శాసనము చేశారు

## విదియ రోజు:

| | |
|---|---|
| తేదీ | 27-09-2022 |
| వారము | మంగళవారము |
| ప్రణవ పీఠం లో అలంకారము | గాయత్రీ దేవి |

## పుజావిధానము మఱియు నివేదనము:

అనుదినము కొబ్బరి అరటి పళ్ళు ఉండితీరాలి. కొబ్బరికాయ అద్భుతమైన బలిదానంతో సమానం. అరటిపండు ఆత్మార్పణ తో సమానం. హింసతో అర్చన చేయకూడదు. కొంతమంది మేకలు గొర్రెలు బలి ఇస్తున్నా రే అది దోషము. బలి బదులుగా బలి ఇచ్చిన ఫలితము పొందడానికి కొబ్బరికాయను కొట్టమన్నారు. మనల్ని మనం సమర్పించుకోవడానికి రెండు అరటి పండ్లను పెట్టాలి. జీవాత్మ పరమాత్మ కు సంకేతంగా రెండు అరటిపళ్లను తప్పక పెట్టాలి. అమ్మవారిని మనసులో



ధ్యానం చేసుకున్న రూపంతో ఎదురుగా పెట్టుకోవాలి. పూజామందిరంలో అమ్మ వారి యొక్క మట్టి విగ్రహం లేదా బంగారు విగ్రహము లేదా పంచలోహాలు ఏదో ఒకటి అమ్మవారి విగ్రహం స్థాపన చేయాలి. అమ్మవారు ఎర్రగా ఉంటుంది మూడు కళ్ళు కలిగి ఉంటుంది నెత్తి మీద చంద్ర రేఖ కలిగి ఉంటుంది కిరీటం ధరిస్తుంది చేతులకి కంకణాలు, భుజకీర్తులు, నడుముకు వడ్డాణం, కాళ్లకు నూపురాలు ఉంటాయి .ఇలాంటి రూపంతో అమ్మను ఊహించి చిత్రీకరించి పటము లేదా విగ్రహము పెట్టి పూజించాలి. నిత్యం కుంకుమ పూజ చేయాలి. అమ్మవారి పటమునకు పసుపు కుంకుమ సమర్పించడం పూజలో తప్పక చేయాలి. పానకము, వడపప్పు ప్రతి దినము ఉదయము సాయంకాలము కూడా సమర్పించాలి. స్వచ్ఛమైన జలం తీసుకుని అందులో మిరియాల పొడి చక్కని బెల్లం ఇంకా సుగంధ ద్రవ్యా యాలకులు కలిపి ఘుమ ఘుమ లాడే పానకాన్ని పెట్టండి. ఎవరికైనా వాక్శుద్ధి కావాలి అనే కోరిక ఉంటే ఈ శరన్నవరాత్రులలో అమ్మవారికి తాంబూలం సమర్పించాలి.అమ్మ తాంబూలం నిండిన నోరు గలది. ఎల్లవేళలా కాదు అర్చన కాలంలో అమ్మ మనకోసం ఈ తాంబూలం స్వీకరిస్తుంది, తాంబూలం సమర్పించిన స్త్రీలు పురుషులు ఈ శరత్కాలంలో అమ్మవారి పటం దగ్గర తాంబూలం పెడితే ఆ రోజు నుంచి వాళ్ళు ఏమంటే అది అయిపోతుంది. అందుకే పూర్వకాలం లో ఏదైనా ఆశీర్వదిస్తే టక్కున ఆ పని అయిపోయేది, ఎందుకని వాక్శుద్ధి వస్తుంది గనక, ఎలా కలుగుతుంది అమ్మవారికి తాంబూలం ఇవ్వడం ద్వారా

## విదియ రోజు కథ:

రోజుకి ఒక కథ ఉంటుంది వాటిని పారాయణ అయినా చేయాలి లేదా గురువుగారు చెప్తున్నప్పుడు వినినా ఫరవాలేదు. రెండవ రోజున వినవలసిన కథ హయగ్రీవ చరిత్ర, పూర్వం ఒకానొకప్పుడు హయగ్రీవుడు అనే పేరు కలిగిన ఒక రాక్షసుడు ఉండేవాడు రాక్షసుడు గుర్రపు తల కలిగినవాడు గనుక హయగ్రీవుడు అన్నారు. మెడ నుంచి పైభాగం వరకు గుర్రం మిగతాదంతా రాక్షస శరీరం. వాడు బ్రహ్మకోసం తపస్సు చేస్తే బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకోమంటే వాడు నాకు మరణం లేని వరం ఇమ్మన్నాడు. ఇది మాత్రం కుదరదు, ఓయి వీరుడా! ఈ భూమండలం లో పుట్టిన ప్రతి ఒక్కరూ మరణించి తీరాలి. మరణం ఈరోజు అవ్వచ్చు. రేపు అవ్వచ్చు .నూరేళ్ళ తర్వాత అవ్వచ్చు. మృత్యువు మాత్రం తప్పదు. మృత్యువు లేకుండా శాశ్వతంగా చిరంజీవిగా బ్రతికే వరము నేను ఇవ్వను. రాక్షసుడు బాగా ఆలోచించి చావులేకుండా వరం ఇవ్వనంటున్నావు చావు కోరుకుంటాను. నాలాగా గుర్రపు తల కలిగినవాడు ఈ ప్రపంచంలో ఎవరైనా ఉన్నాడా? బ్రహ్మదేవుడు చిరునవ్వు నవ్వి ప్రస్తుతానికి లేడు అన్నాడు. ప్రస్తుతము లేడంటే భవిష్యత్తులో కూడా రాడు, కాబట్టి నేను ఎవరి చేతుల్లోనూ మరణించకుండా వరం ఇవ్వు ఎప్పటికైనా చావు అంటూ వస్తే మాత్రం నావంటి హయగ్రీవుడి చేతిలో మాత్రమే నాకు మరణం ప్రసాదించు. బ్రహ్మ తథాస్తు అన్నాడు. దాంతో వాడు విజృంభించాడు, లోకాల న్నిటిని పట్టి పీడించాడు. వాడిని ఎవరూ ఏమీ చేయలేకపోయారు. ప్రపంచమంతా అల్లకల్లోలం అయిపోయింది, అప్పుడు అంతా కలిసి వైకుంఠానికి వెళ్లి శ్రీమన్నారాయణుని దగ్గర మొర పెట్టారు. ప్రభూ! పాహి పాహి రక్షించు! రక్షించు అన్నాడు. అప్పుడు శ్రీమన్నారాయణుడు దేవతలకు సహకారంగా హయగ్రీవు డితో ఘోర యుద్ధం చేసాడు, ఎంతకాలం యుద్ధం చేసినా వాడు చావలేదు,5000 సంవత్సరాలు యుద్ధం చేసాడు. రాక్షసుడికి అలసట రాలేదు స్వామికి అలసట వచ్చి పాలసముద్రంలో ఒక చోట వింటి మీద తల పెట్టుకుని నిద్ర పోయాడు ఈలోపు దేవతలంతా హయగ్రీవుడు చేతిలో చావు దెబ్బలు తిని బ్రహ్మ దేవుడి దగ్గరికి బాబోయ్ విష్ణు వు మధ్యలో తప్పుకున్నాడు ఆయన తప్పుకుంటే మేము ఓడిపోయాము. ఇప్పుడు ఆ విష్ణువు ఎక్కడ ఉన్నాడో వెతుకు దాము. ఆయన వచ్చి ఈ రాక్షసుడిని చంపితే గాని మనము బ్రతకమని అంటే అంతా కలిసి విష్ణువు కోసం వెతకగా, విష్ణువు పాలసముద్రంలో ఒకచోట ఏకాంతంలో



అల్లెత్రాడు ఎక్కుపెట్టి ఆ తాడు మీద తల పెట్టి నిద్ర పోతూ కనపడ్డాడు. గాఢంగా నిద్రపోతున్నాడు, ఈ నిద్రపోతున్నాయన లేవాలి రాక్షసుడిని చంపాలి. ఈయనను ఎవరు లేపుతారు అనగా, ఎవరికివారు అసలు నిద్ర పోతున్న వారిని లేపకూడదు అందులో గాఢంగా అలసి నిద్రపోతున్న భగవంతుని శ్రీమన్నారాయణుడిని లేపడం మహా పాపము అని ఎవరికి వాళ్లు భయపడ్డారు.అప్పుడు బ్రహ్మ తన మహామహిమతో ఒక పురుగుని సృష్టించాడు. దానిని సంస్కృతంలో వమ్రి అంటారు. బ్రహ్మదేవుడు దాని ని పిలిచి విష్ణువు పడుకున్న అల్లెత్రాడు కొరికితే ఆయన తల ఒరిగి మెలుకువ వస్తుంది నువ్వు వెళ్లి ఆ పని చెయ్యి అన్నాడు. అప్పుడు ఆ పురుగు పాపపు పనిని చేయడానికి నన్ను సృష్టిస్తా వా ఎవరైనా గాఢనిద్రలో ఉన్నటువంటి వాడిని లేపడం మహా పాపం నిద్రాభంగం బ్రహ్మ హత్య పాపం తో సమానం, పురాణ కథ సాగుతూ ఉంటే దానికి భంగం కలిగించడం అది బ్రహ్మ హత్యతో సమానం, భార్యాభర్తలు ఐకమత్యంతో కలిసి ఉంటే వాళ్లని విడదీయడం అది మహాపాపం ,తల్లిని బిడ్డ ని వేరు చేయడం ఘోర పాపం ఈ నాలుగు బ్రహ్మహత్యాపాపము తో సమానం. ఇప్పుడు ఈ నిద్రపోతున్న భగవంతుని నేను లేపితే నాకు బ్రహ్మహత్యాపాపము చుట్టుకో దా అని అడిగితే నీకు ఆ పాపం లేకుండా ప్రాయశ్చిత్తం చేస్తానని బ్రహ్మ దేవుడు చెప్పాడు. ఎన్ని చేసినా నేను ఎందుకు చేస్తాను స్వార్థం లేకుండా, నాకేమిటి ప్రయోజనం అని పురుగు అంది. బ్రహ్మదేవుడు చెదపురుగు ని చూసి నవ్వి సరే ఇక మీదట యజ్ఞం చేస్తున్నప్పుడు స్రుక్కు శ్రువ ల నుంచి కారుతున్న నెయ్యి నీకు ఇస్తున్నాను దానిని ఆహారంగా స్వీకరించు వెళ్లి ఆ తాడు కొరుకు అన్నాడు, చెదపురుగు ఒప్పుకోలేదు ఇంత చేస్తే నాకు ఇచ్చేది ఆ నేతి బిందువులా ? సరిపోదు అంది. అప్పుడు బ్రహ్మదేవుడు నేల మీద ఒరిగిన ద్రవములు కూడా నీకు ఇచ్చేస్తున్నాను. (పాలు పెరుగు నెయ్యి మొదలైనటువంటి ద్రవ పదార్థాలు కింద పడిపోతే పొరపాటున కూడా ఎత్త రాదు. అది ఎత్తితే ఉపద్రవం వస్తుంది. అవి మనం వాడుకోకూడదు. అనారోగ్యం కూడా).ఈ రెండే నా ఇంకొక వరము ఇవ్వు అని ఆ చెదపురుగు అడిగింది. అప్పుడు బ్రహ్మదేవుడు చాలామంది పుస్తకాలు తెరువని పుస్తకాలు నీవే, తినమని అన్నాడు. అప్పుడు ఆ చెదపురుగు ఒప్పుకొని ఆ వమ్రి టక్కున అల్లె త్రాడు ని కొరికింది.ఆ త్రాడు ఎక్కుపెట్టి ఉండడం వలన బలంగా లేచిపోయింది, విష్ణువు తల తెగి సముద్రంలో పడిపోయింది. మామూలు తాడు కాదు వింటినారి సారంగం అనే కోదండం. ఆ బలానికి స్వామి తల తెగి సముద్రంలో పడగానే ప్రపంచమంతా అల్లకల్లోలం అయిపోయింది, హాహాకారాలు చేశారు దేవతలు. అయ్యో శ్రీమన్నారాయణుని శిరస్సు తెగిపోతే మనల్ని ఎవరు రక్షిస్తారు. ఇంత అన్యాయం జరిగింది ఏమిటంటే అప్పుడు బ్రహ్మదేవుడు ఏదో ఒక కారణం లేకుండా ఇది జరగదు నీ వెనకాల అమ్మ వారి యొక్క సంకల్పం ఏదో ఉంది. మనమందరం ఆ అమ్మని ప్రార్థిద్దాం. శరత్కాలంలో అది రెండవ రోజు ఈ రోజు అంతా కలిసి అమ్మని పాల సముద్రం ఒడ్డున ఓ పెద్ద మండపం ఏర్పాటు చేసి చతురస్రాకారంలో, అందులో అమ్మవారి యొక్క విగ్రహం పెట్టి కలశస్థాపన చేసి, బ్రహ్మ గనక భక్తి తోటి గన్నేరు పూలతో పూజించాడు, రెండో రోజు గన్నేరు పువ్వులతో పూజిస్తే శత్రువుల మీద విజయం సాధిస్తారు, ఎటువంటి భయంకర శత్రువైనా తొలగిపోతాడు. అప్పుడు అమ్మవారు ఆకాశంలో ప్రత్యక్షమై భక్తిశ్రద్ధలతో విదియ నాడు నన్ను కలశస్థాపన చేసి గన్నేరు పూల తో పూజించారు. కరవీర పుష్పాలతో నన్ను పూజించిన వారికి శత్రు వినాశనం అవుతుంది, అపజయం తొలగిపోతుంది విజయం పొందుతారు.ఈ విష్ణువు యొక్క శిరస్సు తెగడానికి ఒక కారణము ఉన్నది, ఒకప్పుడు పాలసముద్రంలో లక్ష్మీదేవి విష్ణువు యొక్క పాదాలు వత్తు తుండగా , హఠాత్తుగా లక్ష్మీదేవి కళ్ళని నలుము కుంది. అప్పుడు ఆమె కంటి కున్న కాటుక బుగ్గలకి ఒక మచ్చ కింద అంటుకుంది. బంగారం లాంటి లక్ష్మీదేవికి ఒక నల్లటి చుక్క వచ్చిందే అని చిరునవ్వు నవ్వాడు విష్ణువు, ఆ నవ్వుకి లక్ష్మీదేవికి అనుమానం





వచ్చింది, కాల ప్రభావం వల్ల లక్ష్మీదేవి ఇలా అనుకుంది, పర స్త్రీ వ్యామోహం లో పడి నన్ను అపహాస్యం చేస్తున్నాడేమో అని అనుమానం పెరిగిపోయి, వెనక ముందు చూడక గాఢ నిద్రలో ఉండగా నీ వింటి తాడు తెగి నీ తల సముద్రం పాలై పో గాక! సముద్రంలో పడిన తల ఎవరికీ కనపడకుండా అయిపో గాక !అని శపించి నది. ఆ శాపం వల్లే ఇలా జరిగింది ఆ శాపం కూడా నేనే కావాలని పెట్టించాను. ఎందుకంటే ఈయన తల తెగి కనపడకుండా పోతే అప్పుడు ఆయనకు కొత్త తల పెట్టవచ్చు. హయగ్రీవుని హయగ్రీవుడు చంపాలి, మీరంతా విశ్వకర్మ ద్వారా ఇనుము తోటి ఒక గుర్రపు తలను తయారుచేయించి మొండెం దగ్గర పెట్టండి.ఠక్కున ఆ తల అతుక్కుపోతుంది. ఆయనకి ప్రాణం వస్తుంది లేస్తాడు. అప్పుడు ఆయన కూడా హయగ్రీవుడు అవుతాడు. ఆ గుర్రపు తలలో చైతన్యం వస్తుంది. తెల్లని రూపంలోకి వస్తాడు ఆయన. తెల్లని హయగ్రీవుడు ఆ హయగ్రీవుడు ని చంపుతాడు. మీకు పీడ పోతుంది. ఆ తరువాత విష్ణువు హయగ్రీవ అవతారం లో కొంతకాలం తపస్సు చేసి ఎప్పుడు వద్దనుకుంటే అప్పుడు ఆ అవతారాన్ని వదిలి తిరిగి వైకుంఠ రూపం పొందుతాడు. అందుకోసమే నేను ఈ యన తల తెగేలాగా లక్ష్మీదేవి ద్వారా శాపాన్ని ఇప్పించాను. మీకు శుభం కలుగుతుంది. ఆశ్వయుజ మాసంలో రెండవ రోజు మండపారాధన చేసి పసుపు కుంకుమలతో పూజించి గన్నేరు పూలతో పూజించిన వారికి ఈరోజు నుంచి శత్రు విజయం శత్రువులపై విజయం ప్రసాదిస్తున్నాను అని వరం ఇచ్చింది అమ్మ. ఈ దేవతలు సంతోషించారు. విశ్వ కర్మ ద్వారా తల తయారు చేయించి మొండెం దగ్గర పెట్టారు తల అతుక్కుపోయింది. చైతన్యం వచ్చి కదిలింది. తెల్ల వాడు అయిపోయాడు తెల్లని గుర్రం తల తెల్లని శరీరం అయింది.ఆయన సంకల్పం వల్ల నల్లగా ఉన్నవారు తెల్లగా అయ్యాడు. ఈ హయగ్రీవుడు జూలు విదిలించి కొని ఆ హయగ్రీవ రాక్షసుడితో యుద్ధం చేసాడు, వాణ్ని సంహరించాడు. దేవతలంతా సంతోషించి జయహో హయగ్రీవ అవతారం శ్రీమన్నారాయణ ఆ హయగ్రీవుడు అనే రాక్షసుడిని సంహరించి మాకు శుభం ప్రసాదించారు అంటూ ఆయనని పూజించారు. స్వామి వెంటనే వైకుంఠానికి వెళ్ళకుండా, కొంతకాలం పాటు భూలోకంలో తపస్సు చేస్తాను అమ్మవారి యొక్క పూజా నామాలు లోకంలో వ్యాపింపజేస్తాను అని సంకల్పం చేసుకొని (ఇవాళ అస్సాంలో గౌహతి అంటున్నామ్ కదా అక్కడికి వచ్చారు స్వామి వారు). అక్కడ బ్రహ్మపుత్ర మధ్యలో ఒక మంచి పర్వతం ఉన్నది, మణి పర్వతము అని పేరు, ఆ పర్వతం మీదకు వెళ్లి భక్తితో, 1000 సంవత్సరాలపాటు తపస్సు చేసాడు. జగన్మాత అని ధ్యానం చేసాడు, అప్పుడు అమ్మ ప్రత్యక్షమై, ఆయనకి పంచదశి అనే ఒక మంత్రం ఇచ్చింది ఆ మంత్ర జపం చేయగా, అప్పుడు అమ్మవారు నీకు ఏం కావాలి ? అన్నది నీ సహస్రనామాలు ప్రసాదించు తల్లి అన్నాడు. అప్పుడు అమ్మ నవ్వి సంతోషం నీకోసం నేను ఈ కొండ మీద విగ్రహారూపంలో వెలుస్తాను, ఈ పర్వతానికి ఈరోజు నుంచి నీ పేరు మీదుగా హయగ్రీవ పర్వతం అని పేరు వస్తుంది.. కలియుగాంతం వరకు ఈ హయగ్రీవ పర్వతంలో నీవు



విగ్రహ రూపంలో ఉంటావు. నేను అమ్మవారిని ఉంటాను. మానవులు నన్ను నిన్ను చూచి తరిస్తారు అన్నది. నీకోసం నేను సహస్రనామం రాయిస్తాను అని అప్పుడు వశిని, కామేశ్వరీ ,మోదిని ,విమల అరుణ ,జయని, సర్వేశ్వరి, కౌలిని అనే పేరు కలిగిన ఎనిమిది దేవతలు వాళ్లకి వశిన్యాది దేవతలు అని పేరు వాళ్ళని పిలిచి సహస్రనామం రాయమన్నది. వాళ్లు ఎంతో భక్తిశ్రద్ధలతో టి అమ్మవారి యొక్క సహస్రనామం తయారు చేశారు. ఆ స్తోత్రాన్ని అమ్మకు సభలో వినిపించారు. సహస్రనామ స్తోత్రాన్ని మణిద్వీప పర్వతం మీదున్న హయగ్రీవుడు కి అమ్మవారు ఉపదేశించింది. ఆయన ఆ శాస్త్ర నామం చాలాకాలం జపం చేసాడు. ఆయన భగవంతుడు శ్రీమన్నారాయణుడు.ఈ రూపంలో ఇక్కడే ఉండేవాడు వైకుంఠంలో తన దివ్యమంగళ రూపంలో అక్కడ ఉండే వాడు ఏకకాలంలో రెండు చోట్లా ఉండేవాడు. అయినా అక్కడ ఉంటూ వేయి సంవత్సరాలపాటు అమ్మవారిని పూజించాడు శరత్కాలంలో. అందుకే ఆ కొండ కు వెళితే అంత శక్తి,ఆ తరువాత హయగ్రీవుడు దగ్గరికి అగస్త్య లోపాముద్ర సమేతంగా వస్తే, లోపాముద్ర కి అగస్త్యునికి ఈ సహస్రనామం ఇచ్చాడు.



ఈ రెండో రోజు మనం ఈ కథని భక్తితో చదువుకున్నా లేక గురువుగారు చెబుతున్నప్పుడు విన్నా ఎలా వినాలంటే చేతిలో అక్షతలు పట్టుకొని ఈ కథ వినండి, తరువాత అక్షతలు తల పైన చల్లుకోండి.వీలుంటే ఈ పూట అమ్మవారిని బాగా ధూపం తో నింపేయండి. శత్రు వినాశనం అయిపోతుంది .ఈ లలితా సహస్రనామం తొమ్మిది రోజులు పాటు రెండుపూటలా చదవడం చాలా మంచిది, దానివల్ల హయగ్రీవుడు తరించాడు అగస్త్యుడు తరించాడు లోపముద్ర తరించింది.అత్యంత పవిత్రమైన ఆ నామాలతో అమ్మని ఈ రోజున అర్చించండి రెండవ రోజు పులిహోర నైవేద్యం పెట్టినా ధద్ద్యోజనం నైవేద్యం పెట్టినా అటువంటి వాళ్ళకి అనుకున్న కోరికలు అన్నీ తీరుతాయి ఏమున్నా లేకపోయినా పానకం వడపప్పు చలిమిడి రెండు అరటి పళ్ళు కొబ్బరికాయ మాత్రం ఇవ్వండి సాయంకాలం పూట రోజు తప్పక పోపు పెట్టినటువంటి సెనగలు మాత్రం సమర్పించండి. శనగల వల్ల అన్ని లాభాలు కలుగుతాయి.

## తదియ రోజు :

| తేదీ | 28-09-2022 |
|---|---|
| వారము | బుధవారము |
| ప్రణవ పీఠం లో అలంకారము | శ్రీ అన్నపూర్ణాదేవి |

## పుజావిధానము మఱియు నివేదనము:

శరన్నవరాత్రులలో అమ్మవారిని తెల్లని వస్త్రం తో అలంకారం చేస్తే మంచిది అని దేవీ భాగవతం చెబుతున్నది. శ్వేత దివ్యాంబర ధర అని అమ్మవారికి పేరు, తెల్లగా ఉన్న చీర ఎర్ర అంచు తో సమర్పిస్తే ఎక్కువ ఫలితం వస్తుంది. మూలా నక్షత్రం వచ్చినప్పుడు సరస్వతి మాత కి కూడా తెల్లని వస్త్రం సమర్పించాలి. అలంకారములు ప్రమాణము కాదు అలంకారములు మన ఇష్టం. పూర్వం ఈ తొమ్మిది రోజులు తొమ్మిది కథలు సహస్ర నామాలు కుంకుమార్చన లతో చేసాం. రాను రాను గుళ్ళల్లో అలంకారము చేయడం సంప్రదాయంగా పెట్టుకున్నారు. బాల అలంకారం, గాయత్రి అలంకారం ఇలా అలంకారాలు



ఇవన్నీ శాస్త్రం కాదు ఈ ఆలయంలో పెట్టుకున్న సంప్రదాయము మాత్రమే. నీకు ఏ అలంకారం ఇష్టమైతే ఆ అలంకారం చేసుకోండి. అర్చన లో మాత్రం ఈ నైవేద్యం ఈ పుష్పం అని చెప్పినవి అవే చేయండి. అర్చనా విధానంలో మనము లోభించ కూడదు.అమ్మవారిని మూడోరోజు అశోక పుష్పాలు చంపక పుష్పాలు తో పూజించడం చాలా మంచిది.★(మందార, పుష్పాలు గానీ కరవీర పుష్పాలతో గానీ అంటే తెల్లగా ఉండేటువంటి పూలు, అశోక పుష్పాలతో గాని సంపంగి పుష్పాలతో గాని గన్నేరు పుష్పాలతో గాని పూజ చేయండి. వీటిల్లో కూడా అశోక పుష్పము లకి సంపంగి పుష్పాలకే ప్రత్యేక స్థానం.అశోక పుష్పాలు ఇప్పుడు దొరకడమే లేదు అమ్మవారికి మూడవ రోజు సంపంగి పుష్పములు సమర్పించిన వారికి ఇంటిలో మాటవరసకి కూడా అనారోగ్యం రాదు శ్వాస సంబంధమైన రోగాలు పోతాయని పేరు. ఈ రోగములు నుంచి విముక్తి పొందడానికి మూడవరోజు గొప్ప వరం కాబట్టి వీలున్ని సంపంగి పూలు అమ్మవారికి సమర్పించండి. వీలైన వాళ్ళు ఈ రోజు కట్టు పొంగలి దద్యఅన్నం కూడా నివేదన చేయండి. ప్రతి దినమూ ఒక కొబ్బరికాయ రెండు అరటి పళ్ళు సమర్పించండి సాయంకాలం పోపు పెట్టిన శనగలు నివేదన చేయండి. ఈరోజు అమ్మవారికి పంచామృతాలు నివేదన చేయండి. పంచామృతాలు అంటే ఆవుపాలు ,ఆవు పాలతో తయారు చేయబడిన పెరుగు, ఆవు నెయ్యి, తేనె, పంచదార అయిదింటికి పంచామృతాలు అని పేరు. వీటిని కలిపి అమ్మకి నివేదించి సాయంకాలం పూజ అయ్యాక తీర్థంగా స్వీకరించండి ఇది కూడా మనకు చాలా ఆరోగ్యాన్నిస్తుంది.ప్రతి దినము సూర్యోదయానికి ముందు లేవాలి. ఆరోగ్యం బాగుంటే తలారా స్నానం చేయండి. మంచి బొట్టు పెట్టుకోండి. నిక్కర్లు కాకుండా కుంకుమ పెట్టుకుని పూజ చేయండి . ఎప్పుడూ ఆరేసిన బట్టలు కట్టుకోవాలి. మూడవ రోజు మనం కట్టుకునే వస్త్రం తెలుగపు గాని ఎరుపు గాని ఏదైనా పర్వాలేదు అవకాశం ఉంటే వాటిలో ఒక వస్త్రం ధరించండి .అమ్మవారికి యథాప్రకారంగా షోడశోపచారాలు, ధూపం దీపం తప్పక ప్రతి దినం ఉండాలి. పంచపల్లవాలు కలశంలోని ఉండటం కాకుండా అమ్మవారి కూడా సమర్పించిన చాలా మంచిది.

## తదియ రోజు కథ

ఉదయం కానీ సాయంకాలం కానీ మీ శక్తిని బట్టి వినండిఈ వృత్తాంతం సత్యవ్రతోపాఖ్యానం. పూర్వకాలంలో కోసల దేశం లో అయోధ్య నగరం లో దేవదత్తుడు అనే పేరు కలిగిన ఒక పండితుడు ఉండేవాడు. ఆయన భార్య అదృష్టవశాత్తు అనుకూలవతి.మాటవరసకి కూడా భర్తకు వ్యతిరేకంగా వెళ్ళేది కాదు. వాళ్ళిద్దరికీ పెళ్లి అయింది పదహారేళ్ల అయింది సంతానం కలగలేదు. దాంతో దేవదత్తుడు బెంగ పెట్టుకొని పెద్దల ని సలహా అడిగితే, జమదగ్ని మహర్షి ఇలా చెప్పాడు నాయనా దేవదత్త సంతానప్రాప్తికి ఏదైనా నదీతీరంలో కానీ ఆలయ ప్రాంగణంలో గాని స్వగృహం లో గాని పుత్రకామేష్టి యాగం చేస్తే మంచిది. పుత్రకామేష్టి లో ప్రధాన మంత్రాలన్నీ అమ్మవారివి. దేవదత్తుడు సంతోషించి సరయూ నదీతీరంలో చక్కని యాగ మండపం నిర్మాణం చేసాడు శాస్త్ర ప్రకారంగా. యజ్ఞగుండం ఏర్పాటు చేసాడు. ద్రవ్యాలు తెప్పించాడు. అందులో విశ్వామిత్రునికి ఒక వేదం చదవడానికి పిలిచాడు. జమదగ్ని ని ఏకంగా అధ్వర్యుడు గా ఉండమన్నాడు. తాను యజమానిగా తన భార్యని యజమానినిగా, ఇక దుర్వాసమహర్షి ని ఋగ్వేదం చదవడానికి పెట్టాడు. గోభిలుడు అని ఒక మహర్షి ఉన్నాడు, ఈయన వశిష్టుడు ఎంత గొప్పవాడో అంత గొప్పవాడు. ఆయనని సామవేదం చదవడానికి పెట్టాడు. ఇక తక్కిన ఉపనిషత్తులు అన్నీ చదివి వినిపించడానికి వేద వ్యాస యొక్క శిష్యుని సూతుడిని పెట్టాడు. ఇలా అందర్నీ అన్ని ఏర్పాట్లు చేసాడు. యజ్ఞసమయంలో పురాణాలు ఇతిహాసాలు ఇవన్నీ పారాయణాలు చేయాలి చదవాలి. అద్భుతంగా యజ్ఞం జరిగింది ఆఖరులో పూర్ణాహుతి సమయంలో మధుర కంఠస్వరంతో ఎక్కడ స్వర భంగం లేకుండా వేదాలు చదివారు అందులో గోభిలుడు



అనేటువంటి ఆయన సామవేదం చదవడం మొదలు పెట్టాడు. సామవేదం స్వర ప్రధానం. శ్లోకములను మధురముగా చదువుతారు. గోభిలుడికి హఠాత్తుగా కొంచెం ఆయాసం వచ్చి స్వర భంగం అయింది, ఓహో అనే చోట దీర్ఘం లో తేడా వచ్చింది. స్వర భంగం అవ్వగానే అందరూ కూడా ఊరుకున్నారు ఎందుకంటే ఆయన మహానుభావుడు అని తెలుసు గనుక కానీ దేవదత్తుడు తొందర పడిపోయి మూర్ఖ అన్నాడు. ఎంతో కష్టపడి ఎన్నో డబ్బులు పెట్టి చేస్తుంటే.ఈ యాగంలో నువ్వు స్వర భంగము చేస్తావా? ఇష్టి అంటే యజ్ఞం, కోరికతో చేసే యజ్ఞం గనక కామ ఇష్టి కామేష్టి, పుత్రులు కావాలి అనే కోరికతో చేస్తే పుత్రకామేష్టి, ఇటువంటి కామ్యకర్మల లో మాట వరసకు కూడా వేదాలలో, స్వర భంగము ఉండకూడదు, నువ్వు స్వర భంగము చేస్తావా మూర్ఖుడా అనగానే గోభిలు డికి కోపం వచ్చింది. సాధారణంగా ఆయనకు కోపం రాదు కానీ సభ మధ్యలో అలా అనడంతో నీకు శాపం పెడుతున్నాను అని ఈ పుత్రకామేష్టి వలన నీకు పుట్టే కుమారుడు మూర్ఖుడు అవుతాడు అని శాపం పెట్టాడు. ఇలా అనగానే దేవదత్తునికి అహంకారం దిగిపోయింది. అప్పటిదాకా చెడామడా తిట్టి వేసిన వాడు కాళ్ళమీద పడిపోయాడు. క్షమించు అయ్యా ! పుట్టిన కొడుకు మూర్ఖుడు అయితే ఎంత ప్రమాదం అసలు కొడుకు పుట్టకపోయినా ఫరవాలేదు. దయతో ఆ శాపాన్ని మరల్చ వా మార్పు చేయవా అంటే ఆయన జాలిపడి శాపం ఇవ్వడం తేలిక మార్చడం కష్టం నువ్వు తొందర పడ్డావు నేను తొందరపడ్డాను అయినా చిన్న మార్పు చేస్తున్నాను, నీ కుమారుడు పదహారేళ్లు వచ్చేదాకా సుంఠ గా ఉంటాడు , జగదంబ ,పదహారేళ్లు వీ డికి రాగానే ఏదో ఒక సమయంలో మంత్రోపదేశం చేస్తుంది .ఉపదేశం ప్రభావంతో వీళ్ళు పండితుడుగా మారతాడు. జగద్విఖ్యాతి పొందుతాడు. ఇది అమ్మ అనుగ్రహం నా మాట తప్పదు అన్నాడు. దాం తో కొంతలో కొంత సంతోషించాడు. ఋత్విక్కులు అందరికీ ఇవ్వవలసిన కానుకలు ఇచ్చాడు. యజ్ఞం పూర్ణాహుతి చేసాడు. ఇంటికి వెళ్లిపోయాడు.

పుత్రకామేష్టి మహాయాగం ప్రభావంతో భార్య గర్భవతి అయింది. కుమారుడిని కన్నది వాడు చాలా అందంగా ఉండేవాడు.ఆ పిల్లవాడికి ఉతథ్యుడు అని నామకరణం చేశారు.ఎనిమిదేళ్లు రాగానే వాడికి ఉపనయనం చేసాడు. 8 ఏళ్ల లోపు వాడికి నోట్లో మాటలు వచ్చేవి కాదు, కొత్తగా మాటలు రాలేదు ఒకటి అరా తప్ప ,ఆ మాటలు కూడా తడుముకుంటూ నత్తి కింద కొన్ని శబ్దాలు పలకలేక ఉండేవాడు, ఉపనయనం తర్వాత గురువుల దగ్గరికి విద్యాభ్యాసం కోసం పంపాడు తండ్రి. గురువుగారు చాలా పండితుడు వీడి చేత కూర్చోబెట్టి విఘ్నేశ్వర పూజ చేయించి తరువాత అకారాంతః పుం లింగ హ రామ శబ్దః రామ అను రా అంటే వీడు ఏమిటండి అన్నాడు. రామ రామ అను రా అంటే లామ లామా అనేవాడు, దాంతో గురువుగారికి కోపం వచ్చింది, వీరికి రా పలకదు లా అంటాడు ఏం చెప్పినా స్వరంలో తేడా. జ్ఞాపక శక్తి ఉండదు. రామ శబ్దం చాలా తేలిక. వాడికి 1000 సార్లు చదివినా రామ శబ్దం రాలేదు .దాంతో గురువుగారికి మండిపోయి వీడు సుంఠ అని తెగ తిట్టేసి తండ్రిని పిలిచి నీ కొడుకు కిచదువు చెప్పడం వల్ల మిగతా విద్యార్థులు పాడై పోతున్నారు తీసుకు వెళ్ళి ఫో నేను చెప్పలేను అన్నాడు. తండ్రి విసిగిపోయి అంతా అవమానం పాలై పోయి, ఒక రోజు కొడుకుని చాలా విసుక్కున్నాడు , ఆయనకి చాలా బాధ కలిగింది. గురువులు పాఠం చెప్పడం లేదు, తాను చెబితే ఎక్కడం లేదు. ఎక్కడికి వెళ్ళినా ఫలానా మహాపండితుడు కొడుకు శుంఠ అంటున్నారు. దాంతోటి తట్టుకోలేకపోయాడు ఆయన. తక్కిన విద్యార్థులు మహాపండితులు అవుతున్నారు నా కొడుక్కి ఏమో నోట్లో మాట రావడం లేదు ఇదంతా శాపం వల్లే కదా అని బాధపడి ఒకరోజు, పుట్టకుండా ఉంటే బావుండేది ,చస్తే బాగుండేది అని తిట్టేశాడు. దాంతో కుర్రాడు బాధపడి పోయి,ఏం చేయను ఎక్కడికి వెళ్ళను నా తప్పేముంది ఎన్ని సార్లు పలికించినా నోట్లో మాటలు రావడం లేదు. దీనికి నన్ను ఇంత తిట్టాలా?? ఛీ అని బాధపడి ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. అంతలోనే మళ్ళీ ఆత్మహత్య



మహాపాపం చచ్చి ఏమి సాధిస్తారు? తల్లికి తండ్రికి బాధ కలిగిస్తూ ఇంట్లో ఉండడం కంటే ఎక్కడికైనా పోతే మంచిది అనుకుని ఒక రాత్రి వేళ ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్ళిపోయాడు. తల్లిదండ్రుల తరువాత ఏడ్చారు. పాపం తొందరపడి ఎక్కడికి పోయా డా అనుకుంటున్నారు. కుర్రాడు కాలినడకన అయోధ్య నుంచి హరిద్వార్ నడిచి వెళ్ళి పోయాడు. గంగా నదిలో స్నానం చేసి గంగా నది తీరంలో ఒక మర్రి చెట్టు కింద కూర్చున్నాడు. తడబడుతున్న మాటలతో అక్కడ చుట్టుపక్కల వాళ్ళని నాయనలారా నేను ఈ మర్రిచెట్టు కింద కూర్చుంటాను మీకు ఏమి అభ్యంతరం లేదు కదా !అన్నాడు. అక్కడున్న బోయ వాళ్ళు మీరు ఎక్కడ కూర్చుంటే మాకేంటి ఇదంతా తపో భూమి, మీరు కూర్చోవచ్చు అన్నారు. రోజూ గంగలో స్నానం చేయడం, సంకల్పం చెప్పకోవడం కూడా రాదు ,అక్కడున్న మట్టిని తీసి విభూది లా పెట్టుకొని అక్కడ కూర్చొని శివ, రామ అనే వాడు. అది కూడా లోపల లోపల పైకి అంటే ఉచ్చారణ బాగుండదు కనుక. వాడు ఒక నియమం పెట్టుకున్నాడు,"అటు సూర్యుడు ఇటు పొడిచినా ఈ గంగానదీ తీరంలో హరిద్వారం లో సత్యం పలుకుతాను అసత్యం పలకను" అనేవాడు. చుట్టుపక్కల వాళ్ళు దీన్ని బాగా పరిశీలించి సత్యం తప్ప అసత్యం పలుకడు ఏం జరిగితే అది చెబుతాడు ఉన్నది ఉన్నట్లుగా, వాడి సత్య వ్రతానికి మెచ్చుకొని చుట్టుపక్కల వాళ్ళు, సత్యవ్రతుడు అని బిరుదు ఇచ్చారు.12 వ ఏట అక్కడికి వచ్చిన వాడు నాలుగు ఏళ్ల పాటు గంగాతీరంలో ఉన్నాడు ఈ నాలుగేళ్ల పాటు వాడు ఏమైపోయాడు తల్లిదండ్రులకు తెలియదు. వీడు అక్కడే కూర్చొని ఏమి ఎరుగక పోయినా సత్యం పలకడం వలన సత్యవ్రతుడు అయిపోయాడు. ఆ చుట్టుపక్కల వాళ్లంతా మెచ్చుకొని పాండిత్యం లేదు మాటలు తడబడతాయి అయినా చాలా బుద్ధిమంతుడు అండి ,ఎంత మహానుభావుడు అండి, సత్యం తప్ప అసత్యం పలుకడు ఇంకా అంతకంటే గొప్ప తపస్సు ఏముంది !అని మెచ్చుకొని అతనికి గంగానదీ తీరంలో ఆ మర్రిచెట్టు ప్రక్కనే ఒక మంచి ఆశ్రమం నిర్మించి ఇచ్చారు.ఆ గుడిసె లో ఉంటూ, ఆ గంగలో స్నానం చేసి సత్యం పలికే వాడు, ఇలా కొంతకాలం గడిచింది. 16 ఏళ్లు వచ్చాయి వాడికి ఒక రోజున సూర్యోదయ సమయంలో, రోజులాగే గంగాస్నానం చేసి గంగ మట్టిని విభూతి గా ధరించి యధా ప్రకారం గా ఆశ్రమం బయట ఉన్నటువంటి మర్రిచెట్టు తిన్నె దగ్గర కూర్చున్నాడు. వెదురుతో తయారు చేసినటువంటి తలుపు తీసేసి వచ్చాడు. ఆ సమయం లో ఒక బోయవాడు పందిని తరుముతూ బాణం విడిచి పెట్టాడు. ఆ బాణం మహా వేగంగా ఆ పంది చెవికి రాసుకుంటూ వెళ్ళిపోయింది. కొంచెం దెబ్బ తగిలింది, దాంతో అది ఉలిక్కిపడి 'ఐ' అని ఒక్క అరుపు అరిచి, మహా వేగంగా ఆ గంగానదీ తీరంలో పరిగెత్తుకుంటూ వచ్చి ఈ సత్యవ్రతుడు యొక్క ఆశ్రమంలో ఆ గుడిసెలో దూరిపోయింది. ఆ పంది భయపడుతూ 'ఐ' అని ఒక అరుపు అరిచింది , ఆ 'ఐ' అనే అక్షరం వీడిని ఆకర్షించింది, ⋆సత్యవ్రతుడు వెంటనే 'ఐ' 'ఐ' అని జపం చేసాడు, ఆ జపం చేస్తూ ఉంటే తెలియకుండానే మధ్యలో 'ఐం' అని వచ్చేసింది. కాలం కలిసి వస్తే అమ్మ అనుగ్రహము ఉంటే పంది గురువు అతనికి ఐ కా రం ఇచ్చింది. ఐ పక్కన బీజం చేరి ఐకారం జపించడం మొదలుపెట్టాడు.'ఐం' అనేది వాక్ బీజం, అమ్మవారిని పూజించిన వాడు ఈ కథ విన్నాక, ఐం ఐం అనే అక్షరమును జపం చేసిన ఐం కారం తో అమ్మవారిని (ఐం సరస్వ త్యయ్ నమః , ఐం లలితాయై నమః) ఇలా జపం చేస్తే వాళ్లకి అద్భుతమైన పాండిత్యం వస్తుంది సంపూర్ణంగా అమ్మ కటాక్షం లభిస్తుంది. వాక్కుని ఇచ్చే బీజం అది.ఆ బీజాన్ని జపిస్తున్నాడు సత్యవ్రతుడు. ఇంతలో అక్కడికి బోయ వాడు వచ్చాడు. అయ్యా నేను ఒక పంది ని ఇందాకే చూశాను. దాని వేటాడడానికి బాణం వేసాను అది గురితప్పింది పంది పారిపోయింది మూడు రోజుల నుంచి తిండి లేక మా కుటుంబం చచ్చిపోతున్నాం. ఆ పంది ఏమైపోయిందో కనబడడం లేదు. నీ కళ్ళ ముందు నుంచి ఆ పంది పరిగెత్తింది గనుక మీరు చూసే ఉంటారు. మీరు సత్యం తప్ప అసత్యం పలకరు కదా!. చెబితే ఆ పందిని



చంపేసి పట్టుకు పోతాం .ఆ పంది మంచి అడవి పంది కనుక మాకు నెలపాటు సరిపోతుంది. ఎండ పెట్టుకొని మరీ తింటాం చెప్పండి బాబు అన్నాడట. సత్యవ్రతుడు కి పెద్ద సమస్య వచ్చి పడింది , పంది తన గుడిసెలోకి వెళ్లడం చూశాడు, అందులో కి వెళ్ళింది అని చెబితే ఈ దుర్మార్గుడు దానిని చంపేస్తాడు అనవసరంగా ఒక జీవి ప్రాణం తీసిన పాపం వస్తుంది పైగా అది శరన్నవరాత్రులలో మూడో రోజు . నాకు తెలీదు అని చెబుదామంటే తన నియమం తనకు గుర్తుకు వచ్చింది. ఇప్పుడు నియమమా? ప్రాణి ని చంపడమా? ఏం చేయాలో అర్థం కావడం లేదు నిజం చెబితే చచ్చిపోతుంది. అసత్య మాడితే నియమ భంగం అవుతుంది. ఆసమయంలో ఆశువుగా తనకు తెలియకుండానే ఒక శ్లోకం చెప్పాడు సత్యవ్రతుడు. అక్షరాలు పలకలేని వాడు రామ శబ్దం రాని వాడు అనుష్టుప్ ఛందస్సులో శ్లోకం చెప్పాడు.

యా పశ్యతి నసా బ్రూతే

యా బ్రూతె శా నపస్యతి

అహోవ్యాత స్వకార్యా ర్థిన్

కిం ప్రుచ్ఛసి పునః పునః

బోయవాడ నీ స్వార్థం కోసం ఎన్నిసార్లు నన్ను అడుగుతావు. నేను పంది ని చూశాను చూసిన కళ్ళు మాట్లాడలేవు. నోరు మాట్లాడుతుంది కానీ చూడలేదు. చూసింది మాట్లాడలేదు, మాట్లా డేది చూడలేదు. ఇప్పుడు ఆ పంది ఎలా వెళ్ళిందో నేను ఎలా చెప్పను. ఆ బోయ వాడు బుర్ర గోక్కుని అయ్యగారు చెప్పింది నిజమే ఆయన కంటితో చూశాడు కన్ను మాట్లాడలేదు, సమాధానం ఇచ్చే నోరు చూడలేదు, మధ్యలో ఆయన నన్ను ఎందుకు ఇబ్బంది పెట్టడం అనుకొని వెళ్ళిపోయి మామిడి పళ్ళు కోసుకొని బ్రతికాడు. బోయవాడు బ్రతికాడు పంది బ్రతికింది, ఆ తర్వాత సత్యవ్రతుడు ఆశ్చర్యపోయాడు ఏమిటి ఈ శ్లోకం అనుకుంటే అప్పుడు అమ్మవారు అందట ఐం అనే బీజం జపం చేయడం వల్ల నువ్వు ఈరోజు నుంచి మహా పండితుడు అయ్యావు. ఇలా ఈ మూడు రోజు ఐంకార జపం ఒక సామాన్యుడిని పండితుడిని చేసింది, పందిని రక్షించింది, బోయవాని పండ్లు తిని బ్రతికేలా చేసింది,ఇలా ఎన్నో ఉపకారాలు చేసిన అపూర్వ బీజం ఐంకార బీజానికి సంబంధించిన కథ ఈ మూడవ రోజు వినాలి. విని కథాక్షతలు అమ్మవారి పాదాల దగ్గర వేసి అవి నెత్తిమీద వేసుకుంటే అమ్మ అనుగ్రహం తో అనేక శుభాలు కలుగుతాయి ఈ కథను ముఖ్యంగా పిల్లల చేత సాధ్యమైనంత వరకు మనం పారాయణం చేయిస్తే లేక పిల్లలకు వినిపించిన వాళ్లు విన్నా చాలా శుభాలు కలుగుతాయి. ఈరోజు సాధ్యమైనంతవరకు కూడా అమ్మవారికి గాజులు, పసుపు కుంకుమ సమర్పించండి . గాజులు తప్పక మూడో రోజు అమ్మవారి పాదాల దగ్గర పెట్టి ముత్తయిదువులకు ఇస్తే, అటువంటి వాళ్లు సౌభాగ్యంతో ఉంటారు.



ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



సాయంకాలం నృత్య గీతాలతో ధూప దీప నైవేద్యాలతో అమ్మను సంతోష పెడితే ఏటికేడాది శుభం కలుగుతుంది.రోజు ఇలాగే అమ్మవారిని యధాశక్తిగా పూజించండి.ఈ ఐంకార కథ అయిన తర్వాత కుంకుమలో ముంచి నటువంటి నిమ్మకాయలు మూడు గాని-౯ గాని అమ్మవారి దగ్గర పెట్టి, ఈ నిమ్మకాయలు గుమ్మానికి కట్టుకుంటే, దృష్టి దోషాలు పోతాయి,,.. ఇవన్నీ కూడా చేసి తరించండి అని అనేక మంగళా శాసనాలు గురువుగారు అందించారు.

### చవితి రోజు :

| | |
|---|---|
| తేదీ | ౨౯-౦౯-౨౦౨౨ |
| వారము | గురువారము |
| ప్రణవ పీఠం లో అలంకారము | శ్రీ శ్రీ లలితా దేవి |



### పుజావిధానము మఱియు నివేదనము:

నాలుగవ రోజు చతుర్థినాడు అమ్మవారికి అప్పాలు నైవేద్యం పెడితే చాలా పవిత్రమైనటువంటి జీవితం వస్తుందని సకల శుభాలు కలుగుతాయి అని దేవీ భాగవతం చెబుతున్నది. ఈ నాలుగవ రోజు అమ్మవారిని అప్పాల తో అభిషేకం చేయడం ,అప్పాలు నివేదన చేయడం చాలా మంచిది. అప్పాలు కూడా రెండు రకాలు బియ్యపు పిండి తో టి చలిమిడి లాగా తయారు చేసి దానిని నూనెలో వేసి తయారు చేసే టువంటి అప్పాలు ఒక రకం, బొంబాయి రవ్వ ని సత్యనారాయణ ప్రసాదం తయారు చేసి దానితో కూడా అప్పాలు తయారు చేస్తారు. వీటిని సిద్ధం చేసుకోవాలి ఎక్కువ వేడి లేకుండా మరీ చల్లగా కాకుండా గోరు వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడు పూజా గృహంలోకి ప్రవేశించి అమ్మవారి మట్టి విగ్రహం కానీ పంచలోహ విగ్రహం కానీ ఏదో ఒకటి తొమ్మిది రోజులు పెట్టుకుంటారు కదా (పటానికి మాత్రం అభిషేకం చేయకూడదు) విగ్రహం అయితే మాత్రం విగ్రహాన్ని పళ్లెంలో పెట్టి అప్పాలు ఒకటొకటిగా అమ్మవారు మీద పువ్వులు వేసినట్టుగా వేయాలి తర్వాత అభిషేకం చేసినటువంటి అప్పాలు పక్కన పెట్టేసి విడిగా మూడు లేదా తొమ్మిది అప్పాలు అభిషేకంలో వాడనివి నైవేద్యం పెట్టాలి. దీని వల్ల మనిషికి ఏ పనిలోనైనా విఘ్నం కలగదు. ఆ విఘ్నాలన్నీ తొలగించి మానవ జీవితం ప్రశాంతంగా సాగేలా గా విజయం తప్ప అపజయం లేకుండా చేసేటటువంటి శక్తి అప్పాల తో అభిషేకం అప్పాలు నైవేద్యం పెట్టడం వల్ల అమ్మ మనకు ఇస్తుంది.చవితినాడు అమ్మకి తప్పక గంధము అరగదీసి పూయండి. ఆ గంధము వల్ల పుణ్యం లభిస్తుంది.ఈ తొమ్మిది రోజుల్లో కూడా తెల్లవారు జామున లేవడం శిరస్నానం చేయడం విభూతి లేదా ఊర్ధ్వ పుండ్రాలు కానీ కుంకుమ కాని పెట్టుకొని పూజ మొదలు పెట్టాలి. సాధ్యమైనంతవరకు దీక్షా వస్త్రాలుగా ఎర్ర రంగు వాడండి. అమ్మని పూజించేటప్పుడు ఎర్ర బట్టలు కట్టుకొని చేస్తే మంచిది. ముఖ్యంగా నాలుగో రోజు పూజలు గానుగ చెట్టు పువ్వులు, సంపంగి పువ్వులు, గన్నేరు

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




పువ్వులు,మాలతి పుష్పాలు ఈరోజు వాడండి. బిల్వపత్రాల తోటి ఈ రోజున శ్రీ సూక్తంతో అమ్మను పూజిస్తే సకల సంపదలు లభిస్తాయి. రాత్రిపూట పూజల్లో తామర పువ్వులు కలువ పువ్వులు అందులోనూ ముఖ్యంగా నల్లకలువలు అంటే అమ్మకు చాలా ఇష్టం. వాటితో అర్చన చేస్తే శుభాలు కలుగుతాయి. ప్రతి దినము అమ్మవారికి కొబ్బరికాయ ఒకటి ,రెండు అరటి పండ్లు సమర్పించాలి.వీలుంటే అమ్మవారికి నిమ్మకాయలు, దానిమ్మకాయలు, నారింజ, పనస ,మారేడుకాయ వీటిని సమర్పించండి. రోజు కుమారి పూజ, సువాసిని పూజ చేయండి. ఈ పూజ చేసేటప్పుడు పిసినారితనం లేకుండా పిల్లలు కట్టుకునే టటువంటి బట్టలు కూడా ఇవ్వడం మంచిది. నవరాత్రులలో అమ్మవారి పూజ చేసే ముందు

కరిష్యామి వ్రతం మాతః నవ రాత్ర మనుత్తమం

సాహాయం కురుమే దేవి జగదంబ మమా ఖిలం

ఇది దేవీభాగవతంలో మూడవ స్కంధంలో 26 వ అధ్యాయంలో 26 వ శ్లోకం. ఈ శ్లోకం చదివి నవరాత్రి వ్రతం ఆరంభించాలి రోజుకారోజు పూజ చేసేటప్పుడు తప్పక ఈ శ్లోకం చదవాలి.ఈ శ్లోకాన్ని ఎప్పుడు పూజ చేసినా ఈ శరన్నవరాత్రులలో ముందుగా చదువుకోవాలి. అప్పుడు పూజ మొదలు పెట్టాలి .అప్పుడు అమ్మ యొక్క సహాయం లభిస్తుంది. దీని అర్థం ఉత్తమోత్తమమైన శరన్నవరాత్రుల అనే పేరుతో ప్రసిద్ధికెక్కిన దేవీ నవరాత్రి పూజను నేను ప్రారంభిస్తున్నాను నవరాత్రి దీక్షను స్వీకరిస్తున్నాను ఈ కాలములో పూజలు మొదలు పెడుతున్నాను ఓ తల్లి !జగదంబ నాకు అన్ని విధాలుగా సహాయం చేయి నీ అనుగ్రహం లేకపోతే ఈ పూజలు సాగవు. మానవుడికి మనస్సు సక్రమంగా లేకపోవడం వల్ల పూజలు ఫలించవు కాబట్టి తప్పక సాధ్యమైనంతవరకు మనసుని నిలకడగా పెట్టుకోవాలి. మానసికమైన నిలకడ లేకపోతే అటువంటి వాళ్ళ పూజలు వ్యర్థం అవుతాయి. మానవుడు ఎప్పుడూ సంకల్పం చెప్పుకోవాలి ఆచమనం చేసి సంకల్పం చెప్పాలి. సంకల్పం చెప్పని దే పూజ ఫలించదు.వేదికమీద కుడివైపు కలశస్థాపన చేస్తే చాలా మంచిది. (మనకి ఎడమ వైపు వేదికకు కుడి వైపు అవుతుంది.) కలశంలో పంచపల్లవాలు ఉండాలి. రావి, జువ్వి ,మేడి ,మామిడి, మర్రి చిగుర్లు ఉండాలి. పూర్ణ కలశం పెట్టేటప్పుడు అందులో నీళ్ళు కూడా పోస్తారు కదా ఆ నీళ్లు గంగాజల మే అయ్యుండాలి, గంగాజలం దొరకకపోతే నీళ్లు పోయ కండి, చిగుర్లు వేసి కలశంపై కొబ్బరికాయ పెట్టేయండి, కలశంలో బంగారం రత్నాలు ఉంగరాలు వేసుకొని ఈ తొమ్మిది రోజులు లేదా విజయదశమినాడు ఉద్వాసన చెప్పాక మీ బంగారములు మీరు తీసుకోండి. మీరు ధరించండి.సాధారణంగా ఈ శరత్కాలంలో దేవీ భాగవతం లో 18,000 శ్లోకాలు ఉంటాయి 12 స్కంధాలు ఉంటాయి ఈ తొమ్మిది రోజులు రోజు కొంచెం కొంచెం క్రమం ప్రకారం పారాయణ చేయాలి. దీనికి కూడా ఒక నియమము ఉన్నది. మొదటి రోజు ఉదయమే పండితుల అయినటువంటి వారి ని 3/5/9 మన ఓపిక ని బట్టి పిలిచి " అయ్యలారా ఈ శరన్నవరాత్రులలో దేవి భాగవతాన్ని మా గృహంలో మీరు పారాయణ చేయండి. ఆ పారాయణం మా గోత్రనామాలతో చేయండి లోక శ్రేయస్సు కోసం చేయండి. దీనికి మీకు దీక్ష వస్త్రాలు ఇస్తున్నాము దాంతోపాటు యధాశక్తి తాంబూలం ఇస్తున్నాం అని చెప్పి గురువుల్ని ఋత్విక్కులు గా వరించాలి. ముగ్గురికి తక్కువ కాకుండా చేస్తే మంచిది 5 లేదా 9 కూడా ఉండవచ్చు. అసలు ఎవరు దొరకకపోతే మనకు మనమే పారాయణ కూడా చేసుకోవచ్చు. దొరికితే అధమపక్షం ఒక్కరినైనా పెట్టుకొని పారాయణ చేయడం మంచిది.పారాయణ సమయంలో రోజు ఒక్కొక్క కథ తప్పక వినాలి.

### చవితి రోజు కథ

ఒకానొక అప్పటి మాట శ్రీ మహా విష్ణువు పాలసముద్రంలో గాఢంగా నిద్ర పోతూ ఉండగా, ఆయన చెవిలోంచి గులిమి బయటకు వచ్చింది . కర్ణమలం కుడి ,ఎడమ చెవిలోంచి



బయటకు వచ్చింది. అందులో నుంచి ఇద్దరు రాక్షసులు పుట్టుకు వచ్చారు. కర్ణ మలము అంటే చెవిలోని గులిమి నల్లగా చింతపండు ముద్ద లా ఉంటుంది గనక ఆ పుట్టినవాడు అచ్చం చింతపండు రంగులో నల్లగా పుట్టుకొచ్చారు, వాళ్లు బీకర కారులు, వాళ్లకి మధువు కైటబుడు అని పేరు. ఈ మధు కైటబులు నీళ్ళలో పడి సముద్రజలాల లోనే తిరుగుతూ, జలంలో పుట్టడం వల్ల వాళ్ళు జల జీవులు అయ్యారు."వాళ్లలో వాళ్లు అనుకున్నారట, ఎక్కడచూసినా నీళ్ళ తప్ప ఏమీ లేదు మన లాంటివాళ్ళు ఉండడానికి ఆధారం అంటూ ఏమీ లేదు, నీళ్లలోనే ఉంటున్నా మనం, ఎక్కడైనా ఈ సృష్టిలో లో మనలాంటి వాళ్ళు కూర్చోవడానికి ఒక తడి లేని పొడి ప్రాంతం ఉంటుందా అని అనుకున్నారట.అది ఎక్కడా వాళ్లకు కనపడలా."అసలు ఈ సృష్టికి కారణం ఎవరు అనిపించింది వాళ్ళకి,( ఏదో ఒక ఆలోచన వచ్చింది అది కూడా అమ్మ అనుగ్రహం అమ్మ వారి సంకల్పం లేకపోతే పరిశోధన అనే పని కూడా మనం చేయలేము.) వాళ్లు బాగా ఆలోచించారు వాళ్లకి ఏం అర్థం కాలా ఇంతలో వాళ్ళు నీళ్ళల్లో డాం డాం చేతులతో కొడుతుంటే, పెద్ద శబ్దం అయింది. ఆ శబ్దం క్లీం అనే బీజం, వాళ్లకి ఆశ్చర్యం కలిగింది. ఆహా !భలే శబ్దమే ఇదేదో బాగుంది అనుకొని, వాళ్లు నీళ్లలోనే మనుషులు గనక కదలకుండా ఉండగలరు .వాళ్లు నిశ్చలంగా నీళ్లలోనే కూర్చొని 'క్లీం' 'క్లీం' అని జపించారు. ఆ జపానికి మెచ్చుకుని అమ్మవారు ప్రత్యక్షమైంది .ఆ 'క్లీం' అనేది కామరాజ బీజం, కోరిన కోరికలు తీర్చే బీజము, ఆ బీజాన్ని జపం చేసిన చాలా మంది అమ్మవారి సాక్షాత్కారాన్ని పొందారు,అమ్మ అనుగ్రహం తో వాళ్ళు అనుకున్న పనులు నెరవేర్చుకున్నారు.ఆ జపానికి అమ్మ ప్రత్యక్షమై నాయనలారా, నేనే ఈ చరాచర జగత్తుకి మూలకారణమైన అమ్మని, ఇంతకీ మీరు ఏం కోరుకొని నాకోసం జపం చేశారు అంటే తల్లీ నీళ్ళల్లో చేత్తో కొడుతుంటే క్లీం అనే శబ్దం మాకు వినిపించింది. ఆ శబ్దం చాలా బాగుంది అనిపించి దాన్ని జపం చేసాము, నువ్వే మాకు నీటి కెరటము ద్వారా "క్లీం' కారాన్ని ఉపదేశంగా ఇచ్చావు, ఆ క్లీంకార జపానికి నువ్వే ప్రత్యక్షమయ్యావు , ఉపదేశం ఇచ్చింది నువ్వే ఆ ఉప దేశానికి ఫలితాన్ని ఇచ్చింది నువ్వే," మేము ఎప్పుడూ చచ్చిపోకుండా ఉండే వరము ఇవ్వు" అంటే అది మాత్రము కుదరదు అంది అమ్మ. చావు లేకుండా ఈ సృష్టిలో ఎవడూ ఉండడు, ఎప్పుడో ఒకప్పుడు ప్రతి వ్యక్తి చావాల్సిందే, కాబట్టి అది కాకుండా ఇంకా ఏదైనా కోరుకోండి అనగా వాళ్ళిద్దరూ బాగా ఆలోచించి, మరణం లేని వరం ఇవ్వను అంటున్నావు, తల్లి మాకు స్వచ్ఛంద మరణం ప్రసాదించు అనగా కోరుకుంటే మాత్రమే వాళ్లకు చావు రావాలి, కోరుకో కపోతే చావు రాకూడదు, ఆమె తథాస్తు! అన్నది అప్పుడు వాళ్ళు పకపక వెకిలి నవ్వు నవ్వారు, తల్లి మాకు మరణం లేకుండా వరం ఇవ్వను అన్నావు ఇప్పుడు ఏం చేశావు, స్వచ్ఛంద మరణం ఇచ్చావు, మాకు గా మేము చావాలని కోరుకో ము మేము కోరుకుంటే తప్ప చావు రాదు, ఇంకెందుకు భయం కాబట్టి మాకు చావు ఉండదు, చూసావా నువ్వు వరం ఇవ్వకపోయినా మా శక్తితో నిన్ను మోసం చేశాం, అన్నారు వాళ్ళు.అమ్మవారి చిరునవ్వు నవ్వి, సరేలే సంతోషించండి అలాగే, ఒరేయ్ మీరు బుద్ధిగా ఉంటే చావు ఎందుకు తొందరగా వస్తుందిరా? , మీరు గనక ఎప్పుడైనా నా సృష్టికి వ్యతిరేకంగా నడుచుకోవడం మొదలుపెడితే .... ఇప్పుడు మీకు ఈ వరాలు ఎలాగూ ఉపయోగపడవు అని మాయమైపోయింది,.ఆ తర్వాత వాళ్లు హాయిగా నీళ్లల్లో స్వేచ్ఛగా మనకు చావు లేదు కదా అని తిరుగుతూ ఉండగా,ఆ సమయంలో నిద్ర పోతున్న టువంటి శ్రీ మహావిష్ణువు బొడ్డులో నుంచి చక్కని తామరపువ్వు ఒకటి పుట్టింది,తెల్ల తామర పువ్వు, సముద్ర పైభాగము కి వచ్చి ఆ నీటి ఉపరితలం మీద విచ్చుకుంది , అది వెయ్యి రేకుల పుండరీకము, సహస్ర కమలం అందులోనుంచి బ్రహ్మదేవుడు పుట్టుకొచ్చాడు, ఎర్రగా అందంగా ఉంటాడు బ్రహ్మదేవుడు, చతుర్ముఖ బ్రహ్మ పుట్టి, అసలు నేను ఎవరిని? ఏం పని చేయాలి ?అని అటూ ఇటూ చూశాడు, ఎక్కడ చూసినా నీరు తప్ప ఏమీ లేదు అప్పటికింకా భూమి



లేదు, అప్పుడు ఆకాశవాణి సృష్టి చెయ్యి అని అనింది, ఎలాగా అన్నాడు బ్రహ్మదేవుడు? ఆ సమయంలోనే మధుకైటభులు ఈదుకుంటూ బ్రహ్మ దేవుడి దగ్గరకు వచ్చారు. ఎవడురా నువ్వు? మేం పుట్టినప్పటి నుంచి ఈ నీళ్ళలో నాని పోయి నాచు పట్టి యాతన పడి పోతుంటే నువ్వు మాత్రం దర్జాగా టీవీ గా, తామర పువ్వు లో కూర్చుంటావా! పద్మాసనంలో పాడిగా సుఖంగా ఆసనం మాకిచ్చే య్ అన్నారు. లేదండి నేను ఈ ఆసనంలో నేను పుట్టాను అండి, ఇది నా జన్మ స్థలం , జన్మస్థలాన్ని మీకెలా ఇస్తాను అన్నాడు బ్రహ్మదేవుడు?. ఇవ్వకపోతే మాతో యుద్ధానికి రా! అని పిడికిలి బిగించి మీదకు వచ్చారు. మధుకైటభులు. యుద్ధం చేయను అలాగని ఈ ఆసనము మీకు ఇవ్వను వాళ్లు మీదకు వస్తుంటే తామరపువ్వు లోపలనుంచి మూసేసాడు బ్రహ్మదేవుడు. ఆ తామర పువ్వు రేకులు అయితే భగవదనుగ్రహం వల్ల లేదా బ్రహ్మదేవుడు తీస్తే తప్ప మనలాంటి వాళ్ళు ఎవరైనా ఎన్ని వరాలు ఉన్నా ఆ తామర ఆకులను విచ్చుకునేలా చేయలేరు, వాటిని విడదీయలేరు దాంతో లోపల ఉండిపోయాడు బ్రహ్మదేవుడు. దానితో మధుకైటభులకు ఆగ్రహం కలిగింది .నువ్వు ఎంత కాలం లోపల రేకుల మూసుకుని కూర్చుంటావు ఒకప్పుడు బయటికి వస్తా వు అప్పుడు నీ అంతం చూస్తాం అన్నారు.ఈ రేకుల నుంచి బ్రహ్మదేవుడికి మధుకైటభులు కనిపిస్తున్నారు , మధుకైటభుల కు బ్రహ్మదేవుడు కనిపిస్తున్నారు. ఆ రేకుల అంత స్పష్టంగా ఉంటాయి స్పటికం లాగా తెల్లగా.బ్రహ్మ దేవుడు భయపడి ఎక్కడో ఒక చోట ఈ తామర పుట్టడానికి మూల కారణం ఉంటుంది. అక్కడికి వెళితే నాకు రక్షణ కలుగుతుంది అనుకుని తామర పువ్వు కాండం లో నుంచి కిందకి దిగుతున్నాడు. మధు కైటబులు కూడా పై నుంచి కిందకి దిగుతున్నారు. బ్రహ్మదేవుడు అలా నూరు సంవత్సరాలు దిగి పోతున్నాడు, ఎంత వెతికినా మూల కారణం కనపడదు. చివరికి ఈ జగత్తుకు మూల కారణమైన పరమాత్మను ధ్యానం చేస్తున్నాను అనగానే ఆత్మ కటాక్షంతో విష్ణువు కనపడ్డాడు. విష్ణు బొడ్డు లోంచి తామర పువ్వు వచ్చినట్టు అర్థమైంది. అప్పుడు బ్రహ్మదేవుడు విష్ణువుని భక్తితో ప్రార్థించి,నీ బొడ్డు లో నుంచి తామర పువ్వు లో నుంచి పుట్టినటువంటి బిడ్డని నన్ను రాక్షసులు ఇద్దరు చంపడానికి తరుముకు వస్తున్నారు వాళ్లని సంహరించు! రక్షించు !అంటే విష్ణువు లేవలేదు. అప్పుడు బ్రహ్మ దేవుడికి అర్థమైంది విష్ణు శరీరాన్ని ఏదో పట్టుకొని నిద్రపుచ్చింది అది ఏమిటి అంటే నల్లని ఒక రూపం కనపడింది అది అమ్మ వారి యొక్కతామసి శక్తి, దాంతో అమ్మ ని ప్రార్థించాడు, అప్పుడు విష్ణువు కు మెలుకువ వచ్చింది, ఆ సమయానికి మధు కైటబులు అక్కడకు వచ్చారు. అప్పుడు విష్ణువు మీతో నేను యుద్ధం చేస్తాను బ్రహ్మ కాదు అని వాళ్లతో యుద్ధం చేసాడు, 5,000 సంవత్సరాలు వాళ్లు ఇద్దరు విష్ణువు తో ఘోర యుద్ధం చేశారు. విష్ణువు వాళ్లని చంపలేక ఆశ్చర్యపోయి ఎందువల్ల నేను వీళ్ళను చంపలేకపోతున్నాను అని దివ్యదృష్టితో చూడగా అప్పుడు ఆయనకు అర్థమైంది, అమ్మవారు వాళ్లకి స్వచ్ఛంద మరణం ఇచ్చింది. దాంతో ఆయనకు ఏం చేయాలో అర్థం కాక ఒరేయ్ మీరు సంవత్సరం తర్వాత ఒకరు ఇంకో సంవత్సరం ఇంకొకరు యుద్ధం చేస్తున్నారు మధువు తర్వాత కైటభుడు ,కైటభుడు తర్వాత మధువు ఇలా మార్చిమార్చియుద్ధం చేస్తున్నారు దాంతో ఒకరికి సంవత్సరం ,సంవత్సరం విశ్రాంతి లభిస్తుంది నేను అవిశ్రాంతంగా యుద్ధం చేస్తున్నాను, నేను అలిసిపోయాను కాబట్టి నాకు విశ్రాంతి కావాలి, మధు కైటబులు అలాగే అన్నారు. ఆయుధాలు లేని వాళ్ళ మీద అలిసిపోయిన వాళ్ల మీద భయపడుతున్న వాళ్ల మీద మేము ఆయుధాలు ఎత్తము వాళ్లతో యుద్ధం చేసి వాళ్లను చంపము. విశ్రాంతి తీసుకో అన్నారు. అప్పుడు విష్ణువు పక్కకు వెళ్ళి విశ్రాంతి తీసుకొని అమ్మని ప్రార్థించాడు. అప్పుడు అమ్మ అన్నది నేను వీళ్ళని మోసం చేస్తాను మళ్ళీ యుద్ధానికి పిలువు అన్నది. దాంతో వాళ్లు మళ్లీ విష్ణు యుద్ధానికి రమ్మనగానే యుద్ధానికి వస్తుండగా అమ్మవారు వారికి ఎదురు గుండా పరమ సుందరి రూపంలో దర్శనమిచ్చింది. అద్భుతమైన రూపం ఆ రూపం.



ఆటువంటి సుందరీమణి ఈ ప్రపంచంలో ఉండదు. ఆ సౌందర్యానికి మధుకైటభులు వ్యామోహితులై అలా గుడ్లప్పగించి చూస్తున్నారు. అప్పుడు విష్ణువు వీరులారా ఇన్నేళ్ళు నాతో యుద్ధం చేసిన వాళ్ళు ఈ ప్రపంచంలో ఎవరూ లేరు. మీ పరాక్రమానికి మెచ్చుకున్నాను ఏం వరం కావాలో కోరుకోండి అన్నాడు. మూర్ఖులు సౌందర్య వ్యామోహంలో పడిపోయిసుందరీ మణి కనపడగానే మాకు వరాలు ఇస్తున్నావు , ఎవరు వరాలు ఇస్తారో వాళ్ళు గొప్ప వాళ్ళు అని, పుచ్చుకునే వాళ్ళు తక్కువ వాళ్ళు అని ఈమె అనుకుంటుంది. అప్పుడు ఆమె వరాలు ఇచ్చిన నిన్ను వరిస్తుంది. వరాలు పుచ్చుకున్న మమ్మల్ని కాదంటుంది. అని ఆవిడని ఆకర్షించడానికి ఏదో పెద్ద గొప్ప వాడిలాగా మాకు వరాలు ఇస్తాను అంటున్నావు, మేమే వీరులం మా చేతిలో నువ్వు ఓడిపోయావు నీకే వరాలిస్తాం.ఏం వరం కావాలో కోరుకో అన్నారట మధుకైటభులు.అప్పుడు విష్ణువు నాకు వరాలు ఇస్తారా ?ఒట్టు వేయండి అని అన్నాడు వాళ్ళు ఒట్టు అన్నారు. పంచభూతాల సాక్షిగా ,నీ సాక్షిగా, జగదంబ సాక్షిగా, ఈ సుందరి సాక్షిగా నీకు ఏ వరం కావాలంటే ఆ వరం ఇస్తాము. అప్పుడు విష్ణువు అయితే మీ ఇద్దరూ నా చేతిలో చచ్చే వరం ఇవ్వండి అన్నాడు. ఇచ్చేసామన్నారు వాళ్ళు. వాళ్లు అలా అనగానే ఎదురుగుండా ఉండే సుందరీమణి మాయమైపోయింది. అప్పుడు మధు కైటబులు స్పృహలోకి వచ్చి, అరే మనము ఎటువంటి వరం ఇచ్చాము, మనం చచ్చిపోయే వరము ఇచ్చాము. సుందరి ఎవరో కాదు సాక్షాత్తు అమ్మవారే ఆవిడ మనల్ని మోసగించింది ఆ తల్లి. విష్ణు చేతిలో చావడానికి భయపడుతూ వాళ్లు నీళ్లు లేని పొడి ప్రదేశంలో చంపు అన్నారు. విష్ణువు తన శరీరాన్ని పెంచి తన తొడ ప్రదేశంలో వాళ్లను చేర్చి వాళ్ల తలను నరికేశాడు. వాళ్ళ తలలు రెండు నీళ్లల్లో పడిపోయి గిర్రున తిరిగి, అతుక్కుపోయి చూస్తూ ఉండగా గుండ్రంగా భూమి గా మారిపోయాయి. రాక్షసులు యొక్క మేధస్సు మెదడులోని మాంసము ఉందే దాని వల్ల భూమి పుట్టింది అందుకే భూమికి మేధిని అని పేరు. అందుకే మట్టిని మనము తినకూడదు, అది రాక్షసుల యొక్క మెదడు గుజ్జు, మట్టిలో పుట్టిన పదార్థాలు తినాలి తప్ప మట్టిని మాత్రం నేరుగా తినకూడదు. తింటే రాక్షస బుద్ధులు వస్తాయి. ఈ విధంగా అమ్మవారి యొక్క అనుగ్రహం వల్ల విష్ణువు రాక్షసులను సంహరించాడు, రాక్షసుల తలకాయలు అతుక్కుపోయి భూమి వచ్చేలా చేసాడు, ఆ తర్వాత బ్రహ్మ సృష్టి చేసాడు, విష్ణువు పోషించాడు , శివుడు లయం చేసాడు. ఇది దేవి భాగవతంలో నాలుగవ రోజు వినవలసిన కథ, ఈ కథను శ్రద్ధగా విని, చేతుల్లో అక్షతలు పట్టుకొని వినాలి ఆ తర్వాత అవి అమ్మవారి పాదాల దగ్గర వేసి ఆ కథాక్షతలు నెత్తి మీద వేసుకోవాలి. ఈరోజు సాంబ్రాణి గుగ్గిలం కానీ నిప్పుల మీద వేయాలి, చక్కని బొగ్గులు కుంపట్లో వేసి కణకణలాడే నిప్పు లాగా తయారు చేసి, గుగ్గిలం లేదా సాంబ్రాణి వేసి ఆ ధూపం అమ్మవారికి ఇస్తే అది ధూపం వల్ల సకల సంపదలు లభిస్తాయి. ఆఖరు న అమ్మ వారి దగ్గర మన చేతుల్లోకి కాసిన్ని నీళ్లు అక్షతలు తీసుకొని పళ్లెంలో విడిచిపెట్టి,శ్రీదేవీం స్వాభిన్నాం ఖ్యాత్వా విహరేత్ సర్వత్రవిజయఃఅని పలుకుతూ నీళ్లు అమ్మవారి పాదాల దగ్గర విడిచిపెట్టి ఆ విడిచిపెట్టిన నీళ్ళల్లో ఉంగరం వేలు మధ్యవేలు ఈ రెండు వేలు ఆ నీళ్లలో పెట్టాలి, ఆ నీళ్లు తగిలించుకొని దాంతో కుడి కన్ను తర్వాత ఎడమ కన్ను తుడుచుకుంటే ఇంకా ఏటికేడాది వాడికి అన్ని పనులలో విజయం లభిస్తుంది.ఈ విధంగా అమ్మని శరత్కాలంలో

## పంచమి రోజు :

| | |
|---|---|
| తేదీ | 30-09-2022 |
| వారము | శుక్రవారము |
| ప్రణవ పీఠం లో అలంకారము | శ్రీ మహాలక్ష్మీ |





## పుజావిధానము మఱియు నివేదనము:

పంచమికి ఒక విశిష్టత ఉన్నది. అమ్మ వారి గురించి అనేక విధాలుగా పురాణాలు వివరించాయి. అందులో ప్రత్యేకంగా బ్రహ్మాండపురాణంలో లలితా సహస్రనామం లో అమ్మవారికి ఒక గొప్ప నామం ఉన్నది "పంచమి" అని. పంచమీ పంచభూతేశి పంచ సంఖ్యోపచారిణి లలిత సహస్రనామంలో ఒక ౨ పాదాలు. అమ్మవారు పంచమి స్వరూపిణి. తిధుల లో పంచమి అనే తిథి తల్లి స్వయంగా, ఆ పంచభూతాలకు అధిష్టాన దేవత. అమ్మవారికి ఎప్పుడు పూజ చేసిన ఐదు ఉపచారములు తప్పక ఇవ్వాలి.

1)ఓం లం -పృధ్వియాత్మనే -గంధం సమర్పయామి

౨)ఓం హం - ఆకాశతత్త్వాత్మనే పుష్పం సమర్పయామి

3)ఓం యంవాయుతత్త్వాత్మనే ధూపమాఘ్రాపయామి

4)ఓం రం తేజతత్త్వాత్మనేదీపం పరికల్పయామి

5)ఓం వం అమృతత్త్వాత్మనే అమృత నైవేద్యం సమర్పయామి

ఈ క్రమంలో ఇస్తే పంచ ఉపచారములు,పంచోపచారములు, పంచ సంఖ్య ఉపచారములు. 5 ఉపచారములు వల్ల అమ్మ చాలా సంతోషిస్తుంది. పంచ సంఖ్యోప చారిణి అని పేరు కూడా ఉన్నది. అటువంటి అమ్మని ఈ పంచమి నాడు ఎలా పూజ చేయాలి. అమ్మ పసుపు రంగు అంటే ఇష్టపడుతుంది. పూర్వం ఆడవాళ్ళయితే పసుపు రంగు చీర మగవాళ్ళైతే పసుపు బట్టలు ధరించి పూజ చేసేవారు. ఈనాడు కూడా రోజులాగే సూర్యోదయం ముందు లేచి తలారా స్నానం చేసి యధాశక్తిగా కుంకుమ పెట్టుకుని సంధ్యావందనాది కార్యక్రమాలు చేసుకున్నాక, మండపారాధన పాత సామాగ్రి అంతా తీసి మాలిన్యం తీసి కొత్త పువ్వులతో పూజించాలి. పూజించిన తర్వాత పంచ ఉపచారములు చేయాలి. పంచమి నాడు అరటి పళ్ళు అమ్మవారి శిరస్సు మీద అభిషేకం చేస్తే చాలా మంచిది. తర్వాత ఆ పండ్లు తీసి ప్రజలకు ప్రసాదంగా ఇవ్వాలి. నైవేద్యం కూడా అరటి పండ్లు పెట్టాలి. దీనివల్ల మంచి తెలివితేటలు వస్తాయి. తెలివితేటలు బాగా పెరగాలంటే అరటి పండ్లతో పంచమినాడు అమ్మ వారిని అభిషేకించి ఆ తరువాత నైవేద్యం పెట్టి దానిని అందరికీ పంచి పెట్టడం చాలా మంచిది అన్నారు. ప్రతి దినము అమ్మకు సమర్పించవలసిన వి కొబ్బరికాయ రెండు అరటి పండ్లు, నిమ్మ ,దానిమ్మ ,నారింజ, పనస ,మారేడు కాయి ఇందులో మనకి తోచిన వి ఇవ్వడం మంచిది అన్నీ మంచిది. మందార పుష్పాలు, గన్నేరు పుష్పాలు పూజకు



ఉండితీరాలి. పాయసాన్నం చేయడానికి నాలుగు లీటర్ల పాలు తీసుకోవాలి. కిలో బియ్యం పోయాలి .జీడిపప్పు, కిస్మిస్ మొదలైనవి వేయాలి. సాయంకాలం వేళ ప్రతిరోజూ ఉన్నంతవరకు దేవీఖడ్గమాల తోటి లలితా సహస్రనామం తోటి అమ్మవారికి కుంకుమ పూజ చేయండి .నిత్యం బాలా పూజ, సువాసిని పూజ చేయండి.పంచమినాడు తప్పక వినవలసిన కథ మహిషాసుర మర్దిని.చాలా మంది తెలియక అష్టమినాడు చంపడం వలన దుర్గాష్టమి వచ్చింది అనుకుంటున్నారు అది అపోహ. అష్టమి నవమి చతుర్దశి లు అమ్మకు చాలా ఇష్టం అని ఆ రోజుల్లో అమ్మని పూజించాలని మంత్ర శాస్త్రము దుర్గా సప్తశతి చెబుతున్నాయి. నిజానికి అమ్మవారు మహిషాసురుడిని సంహరించింది పంచమి నాడు.

### పంచమి రోజు కథ:

ఒకానొకప్పుడు ధనువు అను పేరు గలిగిన రాక్షసుడు ఉండేవాడు. వంశంలో రంభుడు, కరంభుడు అనే అన్నదమ్ములు ఉండేవాళ్ళు. రంభుడు కరంభుడికి ప్రపంచంలో అందరినీ జయించే వరం కావాలని మరణాన్ని జయించాలి అనే కోరిక కలిగి హిమాలయ పర్వతాలకు వెళ్లి, కంఠం దాకా నీళ్ళల్లో నిలబడి ఆకాశ గంగలో మందాకిని లో తపస్సు చేశారు. కరంభుడు ఒడ్డుమీద చేసాడు. ఒడ్డుమీద ఉన్నవాడు చుట్టూతా పంచాగ్నులు పెట్టుకొని తపస్సు చేసాడు. తపస్సు వల్ల బ్రహ్మ ప్రత్యక్షమై వరాలిస్తే మా ఇంద్ర పదవి కి ప్రమాదం వస్తుందనుకున్న ఇంద్రుడు,నీళ్లల్లో తపస్సు చేస్తున్న రాక్షసుడిని మొసలి రూపంలో పట్టి చంపి తినేశాడు అప్పుడు ఒడ్డు మీదున్న రాక్షసుడు నా సోదరుడిని దీక్షతో తపస్సు చేస్తూ ఉంటే ఇంద్రుడు మారు వేషంలో వచ్చాడు. మొసలి రూపంలో సంహరించాడు. నా సోదరుడు లేని బ్రతుకు నాకెందుకు నేను చచ్చిపో తా అని ,తన చుట్టూ ఉన్న పంచగ్నులలో తన తల నరుక్కుని చచ్చి పోతాను అని కత్తి తీస్కుని తన తల నరికి అందులో వేస్కోబోయా డు. రక్కున అగ్నిహోత్రుడు ప్రత్యక్షమై వాడి చేతిని గట్టిగా పట్టుకుని " నీకు చచ్చే అధికారం లేదు, ఏమి వరము కావాలో కోరుకోమన్నాడు " దేవ దానవులు కు అజేయులైన మహా పరాక్రమ వంతులు అయిన కొడుకులు నాకు కావాలి. అలాంటి కొడుకులను ఇయ్యి అంటే తథాస్తు !నువ్వు ఈ తపస్సు ఆపి హిమాలయ పర్వతాల పైకి ఎక్కు, అక్కడ నీకు కనబడిన స్త్రీలలో , నీకు నచ్చిన స్త్రీ ని పెళ్లి చేసుకో,ఆవిడ వల్ల నీకు ఇద్దరు కొడుకులు పుడతారు, వాళ్లు దేవదానవ లుకు అజేయులవుతారు అన్నాడు అగ్నిహోత్రుడు.వెంటనే వీడు తపస్సు ఆపి హిమాలయ పర్వతాల పైకి ఎక్కడం మొదలు పెట్టాడు. తనకు కనబడి స్త్రీలలో బాగా అందమైన దానిని పెళ్లి చేసుకోమన్నాడు కదా అగ్నిహోత్రుడు అని , అక్కడున్న ఆడవాళ్లు వీడికి నచ్చక వీడి కర్మ వల్ల ఒక గొడు గేదె నచ్చింది. ఆ గేదె ని చూడగానే వీడికి ఆకర్షణ కలిగింది, (పశువులు అంటారు అలాంటి వాళ్ళని,)వీడు ఆ గేదె దగ్గరకు వెళ్లి నన్ను పెళ్లి చేసుకో మహిషి అనగానే , ఆ గేదె నువ్వు కూడా దున్నపోతు గా మారి పోతే అప్పుడు పెళ్లి చేసుకుంటాను అనింది. వెంటనే వీడు ఒక మహిషం గా మారిపోయాడు. ఈ మహిషం ఈ మహిషిని పెళ్లి చేసుకుంది. ఆ గేదె గర్భం ధరించింది , ఈ గేదని చాలా కాలం నుంచి పొందాలని ఒక దున్నపోతు ఎదురు చూస్తూ ఉంది. ఆ దున్నపోతు ఈ సంఘటన చూసి నేనెంతో కాలం నుంచి ఈ గేదె ను పెళ్లి చేసుకో వాలనుకుంటే మధ్యలో వీడు వచ్చాడు అని రాక్షసుడిని కొమ్ములతో చీల్చి చంపి వేసింది. ఆ తర్వత ఈ దున్నపోతు గేదె వెంట పడింది, గేదె లలో కూడా పతివ్రతలు ఉంటాయి, ఈ పతివ్రత గేదె రక్షించండి అని అరిచింది, అప్పుడు పక్కన ఉన్న యక్షులు వచ్చి బాణాలతో దున్నపోతును చంపేశారు.ఈ గేదె నేనెంత దురదృష్ట వంతురాలిని ,నా భర్త చనిపోయాడు. నా భర్త లేకుండా నేను బ్రతకలేను నేను కూడా సహగమనం చేస్తాను అని అగ్ని తెచ్చి అందులో భర్త కళేబరాన్ని వేసి తాను కూడ అందులో దూకి చనిపో బోతుంటే , అప్పుడు అక్కడున్న యక్షులు అన్నారు , ఇది మహాపాపం గర్భవతికి సహగమనం లేదు , నీ కడుపులో ఉన్న ఇద్దరు పిల్లలను చంపుతావ, ఇది పాపం అనగానే. ఆ



గేదె ఆ పిల్లలు పుట్టేదాక నేను ఆగలేను. ఆ పిల్లలని ఇప్పుడే నేల మీద పడేసాను ,వాళ్లు ఎలాగో అజేయులు ,అని తన కొమ్ములతో తన పొట్టనే చీల్చుకుని,ఆ పొట్టలో ఉన్న పిల్లలు ఇద్దరినీ కిందపడేసి,తను హఠాత్తుగా అందులో దూకి చనిపోయింది. గేదె కడుపు చీల్చ గా వచ్చిన ఇద్దరు రాక్షసులు ఒకరు మహిషాసురుడు, రెండవ వాడు రక్త బీజుడు. ఈ రక్త బీజుడు శుంభ, నిశుంభుల దగ్గరకు వెళ్ళిపోయాడు, మహిషాసురుడు మాత్రం దున్నపోతు రూపంలో పుట్టిన వాడు కామరూపుడు అయి పుట్టాడు. వాడికి పుట్టుక తో ఏ రూపం కావాలంటే ఆ రూపం ధరించే శక్తి వచ్చింది.వీడు బ్రహ్మ కోసం తపస్సు చేసాడు, బ్రహ్మ ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకోమంటే, ఈ ప్రపంచంలో ఉన్న ఏ జాతి వల్ల ఏ పురుషుడి వల్ల నాకు చావు ఉండకూడదు, ఆడవాళ్ళు నన్ను ఏం చేస్తారు స్త్రీ చేతిలో చావు లేకుండా వరం కావాలి అన్నాడు వాడు. తథాస్తు !అన్నాడు బ్రహ్మదేవుడునీవు తప్పడు పనులు చేస్తే ఎప్పటికైనా నీకు స్త్రీ చేతిలో మరణం తప్పదు అన్నాడు. వాడికి వరాల వల్ల గర్వం పెరిగింది శుక్రాచార్యుడి ని గురువు గా పెట్టుకొని పాతాళ లోకంలో ఉన్న తామ్రుడు, చిక్షురుడు, దుర్ముఖుడు, భాష్కరుడు, అసిరోముడు మొదలైన వాళ్ళని పిలిచి మీరందరూ ఈరోజు నుంచి నన్ను కొలవండి, మనమందరం దేవతల్ని జయించు దాము. వారంతా అలాగే మహావీరుడైన మహిషాసురుడిని సేవించడం మొదలుపెట్టారు. దేవతల్ని జయించారు. అప్పుడు దేవతలంతా పారిపోయి త్రిమూర్తులను పిలిచి ఈ రాక్షసుడు భయంకరుడు మమ్మల్నందర్నీ జయించాడు, తిరిగి మన స్వ ర్గం మనకి ఎలా వస్తుంది? అని చింతించి విష్ణువుని శివుని శరణు కోరారు.బ్రహ్మ నీ శరణు కోరారు. అప్పుడు త్రిఘమూర్తులు బాగా ఆలోచించి వీడు పురుషుల చేతిలో చావడు . ఏ స్త్రీ వీడిని చంపుతుందా అంటే వీడిని చంపాలంటే మామూలు స్త్రీ సరిపోదు.సాక్షాత్తు ఆ జగదంబ వీడిని చంపాలి. ఆ జగదంబను ఎలా రప్పిద్దాము అనుకుంటూ ఉండగా విష్ణువు శరీరం లో నుంచి తెల్లని కాంతి బయటకు వచ్చింది, శివుడి శరీరంలో నుంచి నీలవర్ణం బయటకు వచ్చింది ,బ్రహ్మ శరీరంలో నుంచి ఎఱ్ఱని కాంతి వచ్చింది. ఇలా ఇంద్రుని శరీరంలో నుంచి అగ్ని ఇలా మొత్తం దేవతల అందరి శరీరం లో నుంచి తెల్లగా, ఎర్రగా, గోధుమ రంగులో, పసుపుగా ,ఆకుపచ్చగా ఉండే రంగులు బయటకు వచ్చాయి రంగులతో కూడిన కాంతులు, ఆ కాంతంతా కలిసి గుండ్రని ముద్దగా మారిపోయి, చూస్తూ ఉండగా ఆ ముద్దలో నుంచి అమ్మవారు ఆవిర్భవించింది. అంటే అమ్మ వీరందరి తేజస్సులు స్వీకరించి ఇంత మంది తేజస్సులు కలిస్తే కానీ వారిని చంపడం కుదరదు అందుకని అమ్మ ఈ రూపం ధరించింది. ఎక్కడో మణిద్వీపంలో ఉండే అమ్మవారు భూమికి దిగి వచ్చి దేవతల తేజస్సుతో అద్భుతమైన సుందరీమణి గా జగన్మాత గా ఆవిర్భవించింది. అప్పుడు అందరూ జయహో దుర్గామాత జగదంబ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయక రక్షించు అని శరణు కోరారు.హిమవంతుడు సింహమును వాహనముగా ఇచ్చాడు అమ్మకు, విష్ణుమూర్తి తన చక్రం నుంచి ఇంకో చక్రం సృష్టించి ఇచ్చాడు, శివుడు తన శూలం నుంచి ఇంకో శూలం సృష్టించి ఇచ్చాడు, బ్రహ్మ అక్షరమాల కమండలం ఇచ్చాడు. ఇలా అందరూ తమ తమ ఆయుధాల్లో నుంచి ఆయుధాలను సృష్టించి అమ్మకు ఇచ్చారు. ఈ ఆయుధాలన్నీ పుచ్చుకుని 18 చేతులతో సింహ వాహనం మీద అనేక ఆయుధాలతో అమ్మవారు ప్రత్యక్షమై ఓ దేవతలారా! త్రిమూర్తులారా పరమ పాపాత్ముని సంహరించడానికి మీ ఆయుధాలు స్వీకరించి మీ కాంతులు స్వీకరించి వైకుంఠాన్ని ,కైలాసాన్ని ,బ్రహ్మ లోకాన్ని మించిన టువంటి ఊర్ధ్వ లోకం మణిద్వీపం నుంచి నేను వచ్చాను. ఆ రాక్షసుడిని సంహరించి మిమ్మల్ని రక్షిస్తాను అని పలికి దేవతలను వెంట పెట్టుకొని వాడు ఉన్నచోటకు వచ్చి హుంకారం చేసింది. అప్పుడు మహిషాసురుడి అనుచరులు ఈ హుం కారానికి కంగారు పడ్డారు, వాళ్ళు దూరం నుంచి చూశారు హిమాలయ పర్వతం మీద ఒక సుందరీమణి సింహ వాహనం మీద వచ్చింది. ఆవిడకు వెనక ముందు దేవతలు ఉన్నారు . ఈ



సుందరీమణి ఎవరో కానీ అసహాయ శూ రురాలు లా ఉంది. ఆ రూపం చూస్తేనే మనందరికీ భయం కలుగుతుంది అనుకుని వాళ్లంతా మహిషాసురుడి దగ్గరకు వెళ్లి, ఇందాక సింహనాదం వినగానే మనవాళ్లంతా వణికి పోయారే ఆ సింహనాదం చేసింది ఒక స్త్రీ. ఆవిడకు వెనక ముందు ఎవరూ లేరు కానీ పై నుంచి మాత్రం దేవతలు ఆవిడ కేసి భక్తితో చూస్తూ జయహో జగదంబ అంటున్నారు.ఆవిడ పరాక్రమం పక్కనపెడితే ఆవిడ అతిలోక సుందరి నువ్వు జగదేకవీరుడి వి ఆవిడ అతిలోక సుందరి, మీ ఇద్దరికీ పెళ్లి అయితే ఎంత బాగుంటుందో, ఇప్పటిదాకా నువ్వు పెళ్లి చేసుకోకుండా తిరుగుతున్నావు, ఆమెను వివాహం చేసుకుంటే బాగుంటుంది అనగానే మహిషాసురుడు ఒక దూతను పంపాడు, ఓ సుందరి ,నన్ను పెళ్లి చేసుకోమని. ఆవిడ ఏమంది? నీలాంటి పశువుల్ని పెళ్లి చేసుకోవడం కుదరదు, అయినా నీకు అంత ఉబలాటంగా ఉంటే యుద్ధానికి వచ్చి, నన్ను ఓడించు. యుద్ధ రంగంలో నన్ను ఓడించిన వాడిని పెళ్లి చేసుకుంటాను అని నా సంకల్పం అన్నది అమ్మ. వాడు పకపకా నవ్వి ఈ సుకుమారి ని ఓడించి తీసుకురమ్మని అసిరోముడ్ని, బిడాలుడ్ని పంపాడు. వాళ్ళిద్దరినీ అమ్మ చంపింది. ఆ తర్వాత తామ్రుడు, చిక్షిరుడు వెళ్లారు. వాళ్లు కూడా చచ్చారు, ఆ తర్వాత భా ష్కరుడు, దృముఖుడు వెళ్లారు వాళ్ళూ చచ్చారు. ఇంతమంది చచ్చాక ఆఖరున మహిషాసురుడు యుద్ధానికి వెళ్లి ఆ సుందరి ని చూసి ఆశ్చర్యపోయి ఎన్నో రకాలుగా బ్రతిమిలాడాడు, నువ్వు పరాక్రమవంతు రాలివి మనలో మనకు ఎందుకు తగాదా నన్ను పెళ్లి చేసుకుని ఈ లోకాలను పరిపాలించ వచ్చు కదా ? అంటే అమ్మ నన్ను శివుడు తప్ప ఎవ్వరూ భరించలేరు రా !కామేశ్వరుడు అనేవాడే భరించగల డు. అది పక్కన పెట్టు నువ్వు నన్ను యుద్ధంలో ఓడించావ్ అనుకో నిన్ను వరిస్తాను, నాకేం అభ్యంతరం అంది . వాడు ఘోర యుద్ధం చేసాడు, కామరూపి అవడం వలన ఎన్నో రూపాలను ధరించాడు, నిమిషానికో రూపం ధరించాడు .ఒకసారి సింహంలా ఒకసారి దున్నపోతు లా, ఒకసారి రాక్షస రూపం ఇలా ధరించాడు. వాడు ఎన్ని రూపాలలో ఉనన్నా అమ్మవారు వాడిని చీల్చి చెండాడింది. ఆఖరికి చక్రంతో వాడి తలను నరికింది. వాడి తల నరికి నేల మీద పడేయగానే, అప్పటిదాకా భయపడిన పంచభూతాలు సంతోషించాయి. ప్రపంచం సంతోషించింది, సముద్రాలు చక్కగా స్వచ్ఛంగా ఉప్పొంగాయి , నదులు ప్రవహించాయి, గాలి కూడా సక్రమంగా వీచింది. ఆ రాక్షసుడు ఉన్నంతవరకు గాలి కూడా వీచడానికి భయపడింది. అంతటి భయంకరుడు మహిషాసురుడు అంటే ఆ మహిషాసురుడిని సంహరించి లోక సంరక్షణ చేసింది అమ్మవారు. అందుకే పంచమినాడు అమ్మను పూజించాక... చేతిలోకి అక్షతలు తీసుకొని ఈ కథను శ్రద్ధగా వినాలి లేదా చదవాలి . కథ అయ్యాక అక్షతలు అమ్మవారి పాదాల దగ్గర వేయండి. అక్షతలు శిరస్సున వేసుకోండి. ఈ కథాక్షతలు వేసుకుంటే దుష్టులు అయిన వాళ్ళ వల్ల ఏ పీడా ఉండదు..... శత్రు విజయం. పంచమినాడు ఈ మహిషాసుర మర్దన కథవిన్న వాడికి మాట వరసకు కూడా శత్రుభయం ఉండదు. పంచమినాడు అమ్మవారికి బాగా ఇష్టమైన చిగుళ్ళు మామిడి చిగుళ్లు 1008/108 గాని తెప్పించుకొని లలితా సహస్రనామం చదువుతూ కుంకుమపూజ చేసినప్పుడల్లా ఒక్కొక్క నామానికి ఒక్కొక్క చిగురు వేయండి. 1008 లేని వాళ్ళు 108 అయినా వేయవచ్చు. చూత పత్రం సమర్పయామి అంటూ వేయాలి , లలితా సహస్ర నామ మే కాకుండా ఒక్కొక్కరు నామాలను కూడా విడిగా చేస్తారు వాళ్ళు కూడా ఈ చిగుళ్లను మధ్యమధ్యలో వేస్తూ చేస్తే చాలా మంచిది. భయంకరమైన టువంటి వ్యాధులను తొలగిస్తుంది. పూర్వజన్మ కర్మ వల్ల భయంకర వ్యాధులు ఉంటాయి పూర్వజన్మలో చేసుకున్న పాపం ఈ జన్మలో వ్యాధిగా బాధిస్తుంది. ఆ వ్యాధి పోవడానికి మామిడి చిగుర్లు తో పూజించమన్నారు. ఆఖరున ధూప స్టిక్కులతో గాని సాంబ్రాణి తో గాని అగరవత్తులు తో గాని ధూపం ఇవ్వాలి. దీపం ఇవ్వాలి, నైవేద్యం. ప్రతిరోజు మాత్రం ఉడకబెట్టిన శెనగలను నైవేద్యం పెట్టడం చాలా మంచిది.

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




శనగలు మాత్రం ఈ తొమ్మిది రోజులు కూడా నవరాత్రుల విడిచిపెట్టకుండా ఇవ్వండి. రోజు ఒక కొబ్బరికాయ రెండు అరటి పళ్ళు కొన్ని సెనగలు. బాలా పూజ ,సువాసిని పూజ నిత్యం చేయాలి. దేవాలయాలకు లేదా పీఠము నకు సాయంత్రం పూట వెళ్లాలి. పొద్దున కాకపోతే సాయంత్రం సాయంత్రం కుదరకపోతే పొద్దున. యధాశక్తి ప్రదక్షిణ చేయండి. శరత్కాలంలో నవరాత్రులలో అమ్మవారి ఆలయము నకు వెళ్లి గురు దర్శనం చేసుకుని,గురువుగారు ఉన్నప్పుడు దర్శనం చేసుకుని ప్రదక్షణ చేస్తే వచ్చే పుణ్యము ఇక దేనివల్ల రాదు. శరత్ కాలములో తప్పక, ప్రదక్షిణలు చేయండి. గురు దర్శనం చేయండి. భక్తులకు ఒక్కొక్కళ్ళకి కథాక్షతలు ఇవ్వండి నెత్తి మీద చల్లుకోండి. కుంకుమ పూజ చేసి కుంకుమ ధరించండి. ఈ విధంగా శరత్కాలంలో పంచమి నాడు కూడా అమ్మ ను పూజించి తరించండి.

## షష్ఠి రోజు :

| | |
|---|---|
| తేదీ | 01-10-2022 |
| వారము | శనివారము |
| ప్రణవ పీఠం లో అలంకారము | శ్రీ మంగళ గౌరీ దేవి |



## పుజావిధానము మఱియు నివేదనము:

షష్ఠి మంగళ కారిణి, షష్ఠి అనే పేరుతో ఉండే ఈ తిథి, మంగళ స్వరూపిణి .అమ్మ వారు, ఈ రోజున సర్వ మంగళ గా మంగళ దేవతగా లోకాల్లో తిరిగే టటువంటి పవిత్రమైన రోజు. చాలా గొప్ప రోజు ఈ రోజుకు ఒక విశిష్టత ఉన్నది. అది సూర్యోదయానికి ముందు లేవడం, తలా రా పవిత్ర స్నానం చేసిన తర్వాత, అమ్మవారి యొక్క ఏదైనా ఒక విగ్రహ రూపం,బంగారమో వెండో ,ఇత్తడో, పంచలోహాలో ఏదోకటి తీసు కోండి. దానిని యథాప్రకారంగా ముందు మంచి నీళ్ళ తోటి శుభ్రం చేసిన తర్వాత తేనె తో అభిషేకించండి. ఆ విగ్రహాన్ని, తేనె తోటి షష్ఠి తిథి నాడు అభిషేకం చేసి తర్వాత విగ్రహాన్ని మంచి నీళ్ళతో అభిషేకం చేసి శుభ్రం చేయండి. శుభ్రం చేసి తుడిచిన తర్వాత బొట్టు పెట్టండి. అప్పుడు తేనెని నైవేద్యంగా పెట్టండి. దీని వలన సుందర రూపం లభిస్తుంది. షష్ఠినాడు తేనెతో అభిషేకించి అమ్మకు నైవేద్యంగా తేనె ను పెట్టి ఆ తేనెను తీర్థంగా తీసుకుంటే, రూపం సుందరంగా తయారవుతుంది చూసే వాళ్ళకి మన రూపం ఆకర్షణీయంగా ఉంటుంది. మధుర స్వరం కూడా లభిస్తుంది. ఇలా తేనెతో అభిషేకించి తేనెను తీర్థంగా తీసుకున్న వాళ్లు ఈ శరన్నవరాత్రులలో క్రమక్రమంగా మధుర కంఠం పొందుతారు. గాయకులంతా పూర్వం ఈశ్వరుడిని తేనెతో అభిషేకించిన వాళ్లే.ఈ రోజు కలువపూల తోటి అమ్మవారిని పూజించాలి. శ్రీ లలితా సహస్ర నామం తో సాయంవేళ కలువ పువ్వులతో నమః అన్నప్పుడల్లా ఒక్కొక్క కలువ పువ్వు ,వెయ్యి కలువ పువ్వులు దొరకకపోతే యధా శక్తిగా అర్చన చేయడం మంచిది.పూర్వకాలంలో భార్య భర్త ల మధ్య ఐకమత్యం లేకపోతే, ఈ షష్టి తిథి నాడు అమ్మవారి పూజలు చేయించేవారు వాళ్ళ ఇద్దరినీ కూర్చోబెట్టి, తల్లిదండ్రులతో పిల్లల తగాదా పడుతున్నా ,పిల్లలతో తల్లిదండ్రులు తగాదాబడుతున్నా ఇటువంటి వాళ్లు ఈ రోజున అమ్మవారిని పూజ చేస్తే వాళ్ళు అంతా కలిసి ఉంటారు .ఐకమత్యంతో ఉంటారు. నిత్యం కుంకుమ పూజ చేయాలి.



ఉదయం సాయంత్రం కూడా కుంకుమ పూజ చేయండి. కుంకుమ పసుపు అమ్మకు చాలా ఇష్టం. వీలున్నప్పుడు ఈ షష్టి తిథి నాడు మంచి పండితుడిని పిలిచి వస్త్ర దానము చేయండి, ఆ పండితుడు మన ఇంటికి రాకపోతే మనమే వారి దగ్గరకు వెళ్ళాలి. ఎట్టి పరిస్థితులలో ఊర్లో మన గురువు గారు ఉన్నారు అని తెలిస్తే మాత్రం గురు దర్శనము చేయకుండా ఇంట్లో కలశ స్థాపన చేసేవారికి ఫలితము రాదు అని శాస్త్రము. గురు ద్రోహులకు భగవదనుగ్రహము లభించదు. ⋆మంత్రోపదేశం చేసిన గురువు దగ్గరకు వెళ్లి భక్తితో నమస్కరించి ఆశీర్వాదం పొందాలి.ఈరోజు నా పిల్లలకు బలపాలు, పలక ,పుస్తకం ,పెన్ను ఇటువంటివి దానము చేయడం చాలా మంచిది. అమ్మవారు మంగళ దేవత అనుగ్రహిస్తుంది అటువంటి వాళ్ళని.

### షష్ఠి రోజు కథ:

ఒకప్పుడు సురథుడు అను పేరు గలిగిన ఒక రాజు గారు ఉండేవారు. చాలా గొప్ప పరాక్రమం కలిగిన వాడు సూర్య వంశం లో పుట్టిన వాడు. ఏకచ్ఛత్రాధిపత్యంగా భూమండలాన్ని పరిపాలించిన వాడు. కాలం కలిసి రాక శత్రువులు ఇతని మంత్రులతో ఆంతరంగికులతో కలిసి ఇతని మీద దాడి కి వచ్చారు. ఆ కాలంలో అడవుల్లో కోలా విద్వాంసులు అనే భయంకరమైన జాతి వాళ్ళు ఉండేవారు. వాళ్లు ఈ మంత్రుల తోటి కలిసి రాజు గారిని యుద్ధ రంగంలో ఓడించారు. భార్య పిల్లలు ఏమైపోయారు తెలియదు. యుద్ధంలో ఓడిపోయి శత్రువుల చేతిలో చచ్చి పోతాం ఏమో అనే భయంతో గుర్రం ఎక్కి ఏకాకిగా ఎక్కడికో వెళ్ళిపోయాడు. బ్రతికి ఉంటే మళ్ళీ ఎప్పుడైనా రాజ్యం సంపాదించవచ్చు అనుకున్నాడు. కీకారణ్యంలోకి వెళ్ళిపోయారు రాజుగారు. అరణ్యంలో అదృష్టవశాత్తు మహానుభావుడు ఒక ఋషిశ్వరుడు సుమేదుడు లేక మేధావి అంటారు ఆయనని. ఆయన ఆశ్రమం దగ్గరకు వెళ్లి రాజుగారు ఆయన కాళ్ళ మీద పడి మహానుభావా! పదకొండు అక్షౌహిణీల సైన్యం నన్ను సేవిస్తూ ఉండగా లీవి గా సింహాసనం మీద కూర్చున్న నేను, ఇవాళ కాలం కలిసి రాక శత్రువుల చేతిలో ఓడిపోయి, ఒంటరి వాడిని అయిపోయాను. వెనక పరివారం లేదు, సేవ చేసే వాళ్ళు లేరు. ఆఖరికి మంచినీళ్లు ఇచ్చే వాడు లేడు. దుఃఖంతో ఉన్న నాకు అభయము ఇవ్వండి అని అంటే, ఆయన ఆశ్రమంలో ఒక గుడిసె ఇచ్చి, నిత్యం ఆయన బోధలు చేస్తూ ఋషీ శ్వరుడు రాజుగారికి ఆశ్రయమిచ్చి కందమూలాలు పెట్టి రోజు ఆధ్యాత్మిక బోధలు చేసేవాడు. ఈ రాజుగారికి మానసిక స్థైర్యం ఇచ్చేవాడు.కొద్ది రోజులు గడవగా అక్కడికి ఒక వ్యాపారి వచ్చాడు. ఆయన పేరు సమాధి. ఆ వ్యాపారి కోటీశ్వరుడు. ఒకప్పుడు అన్ని కోల్పోయి అడవి లోకి వచ్చాడు. రాజుగారు స్నానానికి వెళుతున్న సమయంలో వర్తకుడు ఏడుస్తున్నాడు, ఏం ఏడుస్తున్నావు అని రాజుగారు అడిగితే !ఆ వర్తకుడు అయ్యా ,!నా పేరు సమాధి అంటారు అండి. ఒకప్పుడు కొన్ని కోట్లతో వ్యాపారం చేసిన వాడిని డబ్బు సంపాదించాను కానీ, అనవసరంగా డబ్బులు ఖర్చు పెట్టద్దు అని పిల్లలకు చెప్పి వాళ్ళకు డబ్బులు ఇవ్వలేదని కసితో పిల్లలు, పెళ్ళాం అంతా కలిసి పిసినిగొట్టు పీనుగ అని బయటికి గెంటేసి నా ఆస్తినంతా లాగేసుకున్నారు. ఆస్తి అంతా పోయి అందరి చేత అవమానాల పాలై పోయి ఇక్కడికి వచ్చాను అని చెప్పాడు.రాజుగారు ఈ వర్తకుడిని ఋషీ శ్వరుడు దగ్గరకు తీసుకు వెళితే నీ ఆశ్రమంలోనే ఈయన కూడా ఆశ్రయము ఇవ్వు అని చెప్పాడు ఋషి. ఈ విధంగా రాజ్యం పోయిన రాజు, ఆస్తి కోల్పోయిన వర్తకుడు ఒకే ఆశ్రమంలో ఉండేవారు. ఇద్దరికీ ఒకటే బెంగ ఐశ్వర్యం పోయింది, పదవి పోయింది అని. ఒక రోజున రాజుగారు ఈ వర్తకుడి తో ఇలా అన్నాడు - నన్ను మోసం చేసిన మంత్రుల మీద వ్యామోహం పోవడం లేదు, నా పెళ్ళాం బిడ్డలు ఏమైపోయారు అని వ్యామోహం ,నా రాజ్యం ఏమైపోయిందో అని వ్యామోహం పోవడం లేదు. ఏమిటి ఈ వ్యామోహం అన్నాడు.? ఇప్పుడు వర్తకుడు కూడా నీకే కాదు, నాకు కూడా అలాగే ఉంది అన్నాడు. మెడ పట్టుకుని గెంటేసినా నా కొడుకుల మీద నా పెళ్ళాం మీద నాకు వ్యామోహం నా ఆస్తి అంతా పాడు చేస్తున్నారేమో అని



బెంగ ఎందుకో ఈ కుటుంబ వ్యామోహం వదలడం లేదు అన్నాడు వర్తకుడు. ఇద్దరూ కలిసి ఋషి దగ్గరకు వెళ్లారు .మహాత్మా! ఎందుకని ఈ సంసారం మీద వ్యామోహం పోవడం లేదు అని అడిగారు. అప్పుడు ఆయన అన్నాడు అదేరా! మహామాయ!. ఈ చరాచర జగత్తులో ఒక మాయ ఉన్నది మహామాయ, యోగమాయ ,శాంభవి మాయ అని దానికి పేరు. ఆ మహా మాయ బలంగా లాక్కొచ్చి ఎంత గొప్ప వాడినైనా సరే సంసారంలో పడవేస్తుంది, మహానుభావులు అనుకున్నవాళ్లే ఆ మాయకు గురి అయిపోయారు. ఆ మాయ లో నుంచి బయట పడడం అంత తేలిక కాదు. ఆ మాయ అమ్మ వారి ఆధీనంలో ఉంటుంది .అమ్మవారు మణిద్వీపం అనే లోకం సృష్టించుకుని అక్కడ ఉంటుంది.ఆ చరాచర జగత్తు అంతటికీ ఈ సృష్టి అంతటికీ మూల కారణం ఆ తల్లి.



ఆ తల్లికి శ్రీలలితా పరాభట్టారికా అని, దుర్గా అని, మహాకాళి అని, అంబికా అని, అంబా అనీ పేర్లు. ఎక్కడో ఊర్ధ్వ లోకంలో ఉంటుంది. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురూ కూడా ఒకానొకప్పుడు సృష్టి ఎలా చేయాలి? ఆ చేసిన సృష్టి ని ఎలా పోషించాలి ఎలా లయము చేయాలి అని ఆలోచించారట. మధు కైటభ వధ అయిపోయాక అమ్మవారు సృష్టి చేయమన్నారు .ఆ సృష్టి ఎలా చేయాలో బ్రహ్మకు అర్థం కావడం లేదు.అప్పటికే కొంతమందిని పుట్టించాడు బ్రహ్మ. వాళ్లని ఎలా పోషించాలి అర్థం కాక విష్ణువు బాధపడ్డాడు.తర్వాత వాళ్ళని ఎలా తనలో కలుపుకోవాలి తెలియక ఈశ్వరుడు ఆశ్చర్యపోయాడు, అప్పుడు ఆకాశవాణి నా దగ్గరకు రా !అన్నది .నువ్వంటే ఎవరు? అనగా మీ ముగ్గురికి మూల కారణమైన అమ్మవారిని నేను అన్నది ఆకాశవాణి. మీ దగ్గరకు ఎలా రావాలి? అన్నారు వీళ్లు. ఒక విమానం పంపిస్తాను. ఆ విమానము ఎక్కితే అది మిమ్మల్ని నా దగ్గరకు తీసుకు వస్తుంది. ఆ దివ్య విమానం ఎక్కి నా దగ్గరకు రండి! అప్పుడు నేను మీకు సృష్టి, స్థితి ,లయములు ఎలా చేయాలనే శక్తిని మీకు ఇస్తాను అన్నది. వెంటనే ఆకాశంలో వేగంతో విమానం వచ్చింది.త్రిమూర్తులు ఆ విమానం కి ప్రదక్షిణం చేసి ఎక్కారు. ఆ విమానం మహా వేగంతో పైకి వెళ్ళిపోయింది. ఈ విమానంలో త్రిమూర్తులు ప్రయాణం చేస్తూ ఉంటే దారిలో స్వర్గం కనబడింది,ఇదేమిట్రా! ఇక్కడేదో విచిత్రమైన లోకం కనబడుతూ ఉంది అంటే నువ్వు సృష్టించని స్వర్గం అన్నాడు విష్ణువు, అవి దాటి ఇంకా పైకి వెళ్లారు .పైన బ్రహ్మలోకం కనబడింది. అక్కడ ఇంకో బ్రహ్మగారు సరస్వతి ఉన్నారు. బ్రహ్మగారు తెల్లబోయాడు. ముందుకి వెళ్ళాక అక్కడ పార్వతీ పరమేశ్వరులు విహరిస్తున్న కైలాసము కనబడింది ఇంకా పైకి వెళ్ళాక అక్కడ ఒక వైకుంఠము అందులో లక్ష్మీనారాయణులు ఉన్నారు, అప్పుడు వాళ్లకు అర్థం అయింది మనం ముగ్గురం త్రిమూర్తులను ఉండే లోకాల్లాంటివి ఎన్నో ఉన్నాయి అంటే అనేక కోటి బ్రహ్మాండాలు ఉన్నాయి, మనం ఒక కల్పము నకు ఒక ప్రాంతమునకు పరిమితం. మనలాంటి బ్రహ్మలు, విష్ణువులు ,శివుడు లు, ఇంద్రుడు లు, స్వర్గాలు, బ్రహ్మ లోకాలు, కైలాసాలు, వైకుంఠాలు ఎన్ని ఉన్నాయో? అందుకే అమ్మవారికి అనేక కోటి బ్రహ్మాండ జనని అని పేరు



ఇలాంటి అనేక కోటి బ్రహ్మాండాలకు ఆవిడ తల్లి అని వాళ్లు అర్థం చేసుకున్నారట. క్రమంగా ఎన్నో లోకాలు దాటి దాటి దాటి విమానము దివ్య ప్రాంతానికి వెళ్ళింది.ఆ ప్రాంతంలో ఒక పెద్ద సముద్రం. అది మహా విశాలమైన సముద్రం ఇంత అని చెప్పడానికి వీలు లేని సముద్రం, అది సుధా సముద్రం, అక్కడంతా అమృతమే, ఆ అమృత సముద్ర మధ్యలో పెద్ద ద్వీపం ఉన్నది. ఆ ద్వీపం అంతా మణులతో మెరిసిపోతుంది గనుక మణిద్వీప మన్నారు. అక్కడ విమానము ఆగింది.అక్కడి నుంచి విమానంలో వెళ్ళకూడదు. ఎవరైనా సరే కిందకు దిగాల్సిందే. త్రిమూర్తులు కిందకు దిగి పోయారు. ఆ మణిద్వీపంలో ఒక కోట ఆ కోట చుట్టూ ఒక ప్రాకారం కనబడింది. ఇలాంటి కోటగోడలు అంటే ప్రాకారాలు మొత్తం 18 ఉన్నాయి.అందులో మొదటి ప్రాకారం దగ్గరకు వెళ్లారు త్రిమూర్తులు. అక్కడ కాపలా వాళ్ళు మీరు ఎవరు అంటే,నేను బ్రహ్మ ని, నేను శివుడ్ని, నేను విష్ణువుని అని వారు చెప్పారు, ఏ బ్రహ్మ, ఏ విష్ణువు, ఏ శివుడు అన్నారట వాళ్లు.అప్పుడు వాళ్లు తెల్లబోయి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అంటే గుర్తుపట్టి లోపలికి పంపుతారు అనుకుంటే ఏ బ్రహ్మ ?ఏ విష్ణువు? ఏ శివుడు అంటున్నారు వీళ్లు, అంటే అనేక లోకాలు ఉన్నాయి కదా! అంటే అనేక బ్రహ్మ లు, విష్ణువులు, శివుడు లు ఉన్నారు కదా! అనే విషయం గుర్తుకువచ్చి విష్ణువు తెల్లని వరాహ రూపం తో హిరణ్యాక్షుని చంపి భూమిని పైకి ఎత్తిన శ్వేతవరాహ విష్ణువుని అన్నాడట. ఓహో! 28వ విష్ణువా అయితే లోపలికి వెళ్ళు అన్నారట వాళ్లు, అంటే వీళ్లు 28వ కల్పము నకు సంబంధించిన వాళ్ళు, ఇలాంటివి ఎన్ని కల్పాలు ఉన్నాయో ?ఎన్ని లోకాలు ఉన్నాయో? మనకు లెక్కేలేదు.త్రిమూర్తులు లోపలకు వెళ్లారు. 18 ప్రాకారాలు దాటారు, 4 అద్భుతమైన మండపాలు ఉన్నాయి .అవి శృంగార మండపం, ముక్తి మండపం, సభా మండపం మరియు ఏకాంత మండపం. ఇందులో అమ్మవారు సభలో ఉంది. సభలో అమ్మ వారు కూర్చున్న సింహాసనానికి చుట్టూతా కొంచెం పల్ల ప్రాంతం , వీళ్లు ఆ మెట్లు దిగి ఆ పల్ల ప్రాంతంలోకి దిగారో లేదో త్రిమూర్తులు ఆడవాళ్లు అయిపోయారు. నా దగ్గరకు ఎవరైనా వెళ్లాలంటే స్త్రీలు అవ్వాలి. అందుకే శరత్కాలంలో అమ్మని పూజించేవాళ్ళు చాలామంది ఇప్పటికీ కూడా చీర కట్టుకుని కాళ్ళకి చేతులకి గజ్జెలు, గాజులు వేసుకుని ,బొట్టు పెట్టుకొని స్త్రీ వేషం తో అర్చన చేస్తారు, అమ్మను అర్చన చేసే వాళ్ళు స్త్రీ రూపంలో ఉండాలి, అలా స్త్రీ రూపంలో వాళ్ళు ఎన్నాళ్ళు ఉన్నారో వారికే తెలియదు. చాలా కాలం ఉన్నారు.కొంతకాలం పోయాక ఇప్పుడు వాళ్ళు ముగ్గురు అమ్మను భక్తితో ప్రార్థించగ, అప్పుడు అమ్మ మీ ముగ్గురికి సృష్టి, స్థితి ,లయలు చేయడానికి నా శక్తిని ఇస్తాను.శక్తి లేకపోవడం వల్లే మీరు ఈ పనులు చేయలేక పోతున్నారు అని తన శరీరం నుంచి మహా సరస్వతి ని, మహాలక్ష్మిని, మహాకాళిని సృష్టించి మహాకాళిని శివుడికి ,మహాలక్ష్మిని విష్ణువుకి ,మహా సరస్వతి ని బ్రహ్మ కి ఇస్తే శక్తులను వెంటబెట్టుకుని త్రిమూర్తులు, ఈ ముగ్గురు మీ భార్యలు ఇవి నా శక్తులే! నేనే మీ వెంట ఉంటున్నాను, వీళ్ళని గౌరవించినంతకాలం మీరు మీ పనులు హాయిగా చేస్తారు. కీర్తి పొందుతారు. వీళ్లను అవమానిస్తే మాత్రం మీకు ప్రమాదం సుమా! అనగా వాళ్ళు అలాగే అని ఆ తల్లికి నమస్కరించి బయటకు వచ్చారు. బయటకు రాగానే త్రిమూర్తులకు మళ్ళీ పురుష ఆకారాలు వచ్చాయి, ముగ్గురమ్మలను వెంటబెట్టుకుని వాళ్ళు తమ లోకాలకు వచ్చి, బ్రహ్మ సృష్టి, విష్ణువు పోషణ, శివుడు లయం చేయడం మొదలుపెట్టారు. అలా త్రిమూర్తులకు కూడా ముగ్గురమ్మలను ఇచ్చి వాళ్ళ చేత సృష్టి, స్థితి, లయలను చేయించే జగదంబ సకల లోకాలకు మూల కారకురాలు, ఇటువంటి అమ్మవారి యొక్క మాయ ప్రతి వ్యక్తిని పట్టుకుంటుంది, ఆ మహామాయ వల్లే నేను నా శరీరము, నా గృహము, నా సంపద, నా వాళ్ళు అని భ్రమ కలుగుతుంది.దానివల్ల ఇతరులను ద్వేషించడం, తన వాళ్ళని ప్రేమించడం, డబ్బు మీద వ్యామోహం పెట్టుకోవడం చేస్తాడు మానవుడు. ఈ వ్యామోహం పోదు. ఈ వ్యామోహం వల్లే మాయలో పడడం వల్లే మీకు ఈ



భ్రాంతి.!ఇలా అనగానే ఆ మాయ నుంచి మేము ఎలా బయట పడతాము అన్నారు వాళ్ళు. అప్పుడు నేను ఒక మంత్రం ఇస్తాను. నవావరణ మంత్రం " ఓం హ్రీం శ్రీం క్లీం చాముండాయై విచ్చే " అని దివ్య మంత్రం మీకు ఇస్తాను .మంత్ర జపం చేస్తూ అమ్మను పూజించండి. దేవీ నవరాత్రులలో పదవరోజు విజయదశమి నాడు యజ్ఞం చేయండి . అమ్మ అనుగ్రహం కలుగుతుంది అంటే, వాళ్ల ఈ శరత్కాలంలో ఆశ్వయుజ మాసంలో పాడ్యమి మొదలుకొని నవమి వరకు దీక్షా కంకణం ధారణ చేసి దీక్షా వస్త్రాలు ధరించి ఆశ్రమం బయట పెద్ద మండపారాధన చేసి, కలశస్థాపన చేసి ,అమ్మవారి విగ్రహాన్ని పెట్టుకున్నారు. రోజూ ఒక కథ విన్నారు .ఈ రోజు ఏ అభిషేకాలు ఏ పూలతో చేయాలో, ఏ అర్చనలు చేయాలో వారు కూడా చేశారు.ఈ రోజు తప్పక పంచ పూజలు చేసేవారు. సహస్ర నామాలతో తామరపూలతో దుర్గా సూక్తం తో పూజించారు. దశమినాడు అమ్మవారికి ఒక గొప్ప యజ్ఞం చేశారు. అంబా యాగం అంటారు దానిని, ఆ యాగంలో అమ్మ ఇంకా ప్రసన్నం కాకపోతే తలకాయలు నరుక్కోవ డానికి సిద్ధపడ్డారు.అప్పుడు అమ్మ ప్రత్యక్షమై మీ భక్తి నాకు తెలుసు రా !అవసరమైతే ప్రాణ త్యాగం అయినా చేస్తారు మెచ్చుకొని ముందు రాజుగారితో మహారాజా నీకు ఏం కావాలో ?నాకు తెలుసు అనగానే రాజు నాకు ఇంకా రాజ్యం మీద వ్యామోహం ఉంది తల్లి అన్నాడట. అమ్మ కొద్ది రోజులలోనే నీ రాజ్యం నీకు తిరిగి వస్తుంది నువ్వు చక్రవర్తి అవుతావు.సుఖంగా ఈ భూమండలంలో నీ భార్యా పిల్లలతో పరిపాలిస్తా వు. నన్ను పూజించి యజ్ఞం చేసి, మెప్పించా వు కనుక కథ విన్నావు గనుక, జన్మ చాలించాక రాజ్యపరిపాలన అయిపోయాక, సూర్యభగవానుడికి రెండవ భార్య ఛాయాదేవి కి సావర్ణి అనే పేరుతో కొడుకుగా పుడతావు, ఆ తర్వాత సప్తమ వైవస్వతమనువు కాలం వెళ్లిపోయాక ఎనిమిదవ మనువు గా సావర్ణి మనువుగా మారతావు అని వరం ఇచ్చింది. దాంతో అక్కడకు వెంటనే ఆయన మంత్రులు వచ్చి మీ రాజ్యాన్ని శత్రువుల ను చంపి మీకోసం వచ్చాం ,శత్రువులను మేము చంపి వేసాము , ఇంతకు పూర్వం శత్రువులతో కలిసి రాజ్యం తీసుకున్న మంత్రులు ఇప్పుడు శత్రువులను చంపి వేసి రాజ్యం ఇచ్చారు. రాజు గారిని రథంలో ఎక్కించుకొని పరివారంతో వెళ్లారు. సింహాసనము మీద కూర్చోబెట్టి పట్టాభిషిక్తుని చేశారు. వేల సంవత్సరాలు తిరిగి రాజ్యాన్ని పరిపాలించాడు రాజు. హాయిగా పుత్రపౌత్రాభివృద్ధి ని పొందాడు. సంపదలు పొందాడు.శరీరము విడిచిపెట్టాక, ఇప్పుడు ప్రస్తుతం సూర్యభగవానుడికి ఛాయాదేవికి కొడుకుగా పుట్టాడు. ఈయనకు సూర్యసావర్ణి అని పేరు. ఇప్పుడున్న మనువు వైవస్వత మనువు, తర్వాత రాబోయే మనువుగా ఈ సూర్య సావర్ణి మనువు అవుతాడు. బలి చక్రవర్తి దేవేంద్రుడు అవుతాడు. అమ్మవారి పూజ చేయడం వల్ల అందులో ముఖ్యంగా షష్టినాడు తేనెతో అభిషేకం చేయడం వల్ల ఆయనకు ఇంత మహా ఫలితము వచ్చింది. అమ్మ అనుగ్రహం కలగడం వల్ల మనువు అయిపోయాడు ఏకంగా....ఇక రెండోఆయనకు వ్యాపారి కేసి తిరిగింది అమ్మ , ఏం నాయనా సమాధి? రాజుగారికి రాజ్యం మీద కోరిక ఉన్నట్టు నీకేమైనా వర్తకం మీద, కుటుంబం మీద కోరిక ఉందా అంటే ఏదమ్మా ఇంతకు పూర్వం వాళ్ళు ఉండాలి డబ్బు కావాలి అనే కోరిక ఉండేది ఆ మాయ పోయింది నాకు ఏ కోరికా లేదు నాకు! నీ సన్నిధానము కావాలి .సంసార వ్యామోహము లేదు. కేవలం మోక్షమే పొందాలని ఉన్నది తల్లీ! ఈ వర్తకాలు, ఈ సంపాదన లు, భార్య, పిల్లలు, గృహం వీటి మీద వ్యామోహం లేదు. ధార పుత్ర ధన ధాన్య దిక మమకారం నాకు తొలగిపోయింది, శాశ్వతంగా నీ సన్నిధానానికి తీసుకుపో తల్లీ !అన్నాడు ఆ వర్తకుడు,ఇప్పుడు అమ్మ చిరునవ్వు నవ్వి,నిన్ను శరీరంతో సహితంగా నా మణిద్వీపానికి పట్టుకు పోతున్నాను. ఇక్కడికి రాగానే నీ శరీరం దివ్య రూపం ధరిస్తుంది. నా చెలి కత్తెగా మారి పోతావ్ , హాయిగా మణిద్వీపం లో సుఖం గా ఉంటావు అని సమాధి అనే వర్తకుని కి మణిద్వీపము ఇచ్చింది శాశ్వత కైవల్యము ఇచ్చేసింది. శరన్నవరాత్రులలో అమ్మను భక్తితో ఆశ్రమంలో ఉండి



తామర పువ్వులతో, కలువ పువ్వులతో పూజించడం వల్ల గురువుగారు ఇచ్చిన మంత్రాన్ని దీక్షతో జపం చేసి భక్తితో గురువుని తలచుకోవడం వల్ల ఏ రోజు ఏ నివేదన చేయాలో అలా చేయడం వల్ల ఈ విధంగా శాస్త్రాలు చెప్పినవి, అలా అదృష్టం వల్ల అక్కడ సుమేధుడు అనే గురువు గారు ఉన్నారు గనక ఆయన చెప్పిన వి చేయడంవల్ల మహానుభావులు తరించారు ఒక ఆయన మనువు అయ్యాడు. ఒక ఆయన శాశ్వతంగా మణిద్వీపం చేరుకున్నాడు. ఇవి గనక మనం కూడా యధాశక్తిగా చేయగలిగితే, ఇహ లోకంలో సకల శుభాలు పొందుతాం కైవల్యము పొందుతాము. షష్టినాడు తేనెని 11 మంది ముత్తయిదువులకు దానమిస్తే మీ పిల్లలకు తొందరగా పెళ్లిళ్లు అవుతాయి, పెళ్లిళ్లు అయి తీరుతాయి అని చెప్పారు. అమ్మవారి శరీరం మీద అభిషేకం చేయగా వచ్చిన తేనేని 11 మంది ముత్తయిదువులకు దానం చేస్తే హాయిగా సంబంధాలు వెతుక్కుని వస్తాయి, కుటుంబ వృద్ధి, ధనధాన్య వృద్ధి, పిల్లలకు కల్యాణాలు అయి సుఖంగా ఉంటారు.ఈ కథ విన్నాక కథాక్షతలు అమ్మవారి పాదాల దగ్గర వేసి అక్షతలు నెత్తి మీద చల్లుకోండి ధూప దీప నైవేద్యాలు ఇవ్వండి ప్రదక్షిణలు చేయండి, అమ్మ అనుగ్రహం పొందండి. ఈ విధంగా షష్ఠి తిథి నాడు అమ్మని పూజించి తరించండి.

## సప్తమి రోజు :

| | |
|---|---|
| తేదీ | 02-10-2022 |
| వారము | ఆదివారం |
| ప్రణవ పీఠం లో అలంకారము | శ్రీ సరస్వతి |

## పుజావిధానము మఱియు నివేదనము:



ఈ రోజు అమ్మవారికే బెల్లం తో అభిషేకం చేయడం మంచిది.. రోజులాగే ఈ రోజు కూడా భగవత్ ప్రార్ధన చేసుకొని పొద్దున్నే లేవండి, శిర స్నానం చేయండి ఆరోగ్యాన్ని బట్టి ,లేకపోతే కంఠ స్నానం చేయండి. కుంకుమ ధారణ చేయండి. పూజా మందిరంలో ఉన్న నిర్మా ల్యము తీసేసి మళ్ళీ యధాప్రకారం గా ఆచమనం సంకల్పం చెప్పకోవాలి . సంకల్పం లేని పూజ వ్యర్థం కనుక , సంకల్పం చెప్పకోవాలి గోత్ర నామాలతో.అమ్మవారి పంచ లోహ విగ్రహం లేదా బంగారం,వెండి , మట్టి ఏదో ఒక విగ్రహం పూజా మందిరంలో పెట్టుకుని (కాకపోతే మట్టి విగ్రహం తో ఒక ఇబ్బంది ఉంది.ఎప్పుడైనా అభిషేకం చేసేటప్పుడు మట్టి విగ్రహం పనికిరాదు. ఎందుకంటే అభిషేకం చేసినప్పుడు కరిగిపోతుంది కనుక, అందుకనే లోహాలతో కూడిన విగ్రహాలే ఈ శరత్కాలంలో వాడాలనమాట. పంచలోహ ము గాని, వెండిగాని ,రాగిగాని ,ఇత్తడి గాని ఇటువంటి వైతే జలాభిషేకం చేయగలుగుతారు, తేనే అభిషేకం చేయగలుగుతారు ,బెల్లం నీళ్లతో అభిషేకం చేయగలుగుతారు.)మట్టి ప్రతిమని కుంకుమ పూజ కి,



పుష్ప పూజ కి వాడుకుం టాము. అభిషేకానికి మాత్రం ఒక రూపం ఉండి తీరాలి అది కూడా లోహముతో చేసింది.సప్తమి నాడు ఆ ప్రతిమ ని బెల్లం తో అభిషేకించాలి. బెల్లాన్ని చిన్న చిన్న ముక్కలుగా తరిగి, ఆ తరిగిన బెల్లం తో ఆ విగ్రహాన్ని మొత్తం అభిషేకించాలి.

స్టీలు పళ్ళెం లేదా వెండి లేదా ఇత్తడి ఏదో ఒక పళ్లెంలో మన శక్తి ని బట్టి పెట్టుకుని,అందులో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి, బెల్లం ముక్కలతో అభిషేకం చేయాలి. అమ్మవారికి అభిషేకం చేస్తున్న సమయంలో దుర్గా సూక్తము కానీ లేదా శ్రీ సూక్తం కానీ లేదా వేదమంత్రములు చదువుకోవటం వస్తే నమక చమకం లతో చేస్తే కూడా చాలా మంచిది అని శాస్త్రం చెబుతోంది.లలితా సహస్రనామం కానీ దేవి ఖడ్గమాల కానీ చదువుతూ అమ్మవారి అభిషేకం చేయటం మంచిది.సహస్రనామం కానీ ఉచ్చారణ కానీ రాని వారు బెల్లం ముక్కల్ని అమ్మ ,అమ్మ అంటూ అమ్మవారి మీద అభిషేకం చేయండి. ఆ అమ్మ అనే రెండు అక్షరాలు మహా బీజము లై మహా మంత్రములై నిన్ను రక్షిస్తాయి . మానవుడికి భక్తి శ్రద్ధ కలిగితే వేరే మంత్రము అక్కరలేదు.అందుకే భక్త కన్నప్ప మంత్ర యుక్త పూజ చేయ మనసు కరుగునా, మంత్రమో తంత్రమో ఎరగనైతినే అన్నాడు. మంత్రం చేత కాకపోయినప్పటికీ ఫర్వాలేదు.)అందుకే ఆది శంకరాచార్యులు వారు కూడా దేవీ అపరాధ క్షమాపణ స్తోత్రం లో ఆయన కూడా అపరాధక్షమాపణ స్తోత్రం రాసారు.దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రం,అందులో

న మంత్రం నో యంత్రం తదపి చ న జానే స్తుతి మహోన చాహ్వానం ధ్యానం తదపి చ న జానే స్తుతి మహో న జానే ముద్రాస్తే తదపి చ న జానే విలపనంపరం జానే మాతస్త్వదనుసరణం క్లేశహరణమ్

శరణం శరణం అమ్మ ఎలా పూజించాలో తెలియడం లేదు శ్రీ చక్రం తెలియడం లేదు. ధ్యానం తెలీదు. ఆవాహన తెలీదు, ముద్రలు తెలియవు, ఏమీ తెలియదు ....మరి ఏం తెలుసు అని అడుగుతావేమో ? నీవు ఉన్నావు ...అని మాత్రం నాకు తెలుసు ,నమ్మి నీవున్నావని నమ్మకం తో నిన్ను అర్చి స్తాను. అదే నన్ను రక్షిస్తుంది అంటాడు..అదే ముఖ్యం.ఏ మంత్రాలు శాస్త్రాలు తెలియకపోయినా అభిషేక విధానాలు తెలియకపోయినా , పూజా ద్రవ్యాలు దొరకక పోయినా, భక్తి తో అమ్మా నువ్వు ఉన్నావని నమ్మి వెంటపడితే చాలు,అదే మన యొక్క ఆపదలను కష్టాలను తొలగిస్తుంది.పూజామందిరంలో ఉండే నిర్మాల్యం తీసేసి సంకల్పం చెప్పకొని సంకల్ప రహిత మైన పూజ ఎప్పడు మనం చేసుకోవాలి అది లేని పూజ వ్యర్థమవుతుంది, అమ్మవారి పంచలోహ విగ్రహం లేక వెండి మట్టి ప్రతిమ అయినా పెట్టుకోవచ్చు.

(అభిషేకానికి మట్టి విగ్రహం పనికిరాదు బెల్లం తో ను గానీ తేనెతో కాని అభిషేకం చేసినప్పడు ఆ మట్టి ప్రతిమ కరిగిపోతుంది అందుకనే ఈ శరన్నవరాత్రులలో పంచలోహ విగ్రహాలను లేకపోతే విగ్రహాలను వాడాలి) మృత్ ప్రతి మని కుంకుమ పూజ కు పుష్ప పూజకు వాడుకోవచ్చు. అభిషేకానికి మాత్రం ఒక రూపం ఉండి తీరాలి.చాల మంది మేము ఏదో మహా మంత్ర వేత్తలం, ఉపాసకులం అనేది ఒట్టి భ్రమ..నువ్వు ఎప్పడు ఎంత గింజుకున్నా నువ్వేం దేవుడివి కావు . మన కంటే ముందు ఎంతో మంది పండితులు వెళ్లారు మరి ఎంతో మంది వస్తారు.మన శాస్త్ర పాండిత్యము కొంత వరకు పరిమితమే, తెలిసి ఉన్నంత వరకు చేస్తాము.అందరం ఏమైనా నిష్ణాతులమా?. ఎందుకంటే అమ్మవారి యొక్కఆ శక్తి ఆ మంత్రం అనంతం. కాబట్టి ధ్యానం తో ఆదిశంకరాచార్యుల వారు నువ్వు ఉన్నావని నమ్మడం తప్ప వెరేమి తెలియదు అన్నారు.ఆది శంకరులు సాక్షాత్ శివ స్వరూపుడు ,అంతటి మహా పండితుడే నాకు ఏమీ తెలియదు కేవలం సామాన్యుణ్ణి అంటాడు .ఈ ప్రపంచంలో శంకరాచార్యులవారు రాసిన స్తోత్రాలు ఇంక ఎవరైనా రాయగలరా??? ఆయనే నాకు ఏమీ తెలియదు అంటే మనలాంటి వారు అన్నీ తెలుసు అని చేతులు ఊపితే అది ఒట్టి మోసం .కాకపోతే మిగతా వారి కంటే వీరికి ఒక పది



ముక్కలు ఎక్కువ రావచ్చు అంతే . అందుకే మనము ఏమి రాకపోయినా ,మంత్రం రాకపోయినా , అమ్మ అనుకుంటూ బెల్లం తో అభిషేకం చేస్తే ఫర్వాలేదు..

### శ్లోకము

**కరిష్యామి వ్రతం మాతః నవ రాత్ర మనుత్తమం**

**సహాయం కురుమే దేవి జగదంబ మమాఖిలం.**

ఈ శ్లోకాన్ని రోజు భక్తి తో చదువుకోవాలి,ఒకవేళ మనకు ఈ శ్లోకం రాకపోతే... తల్లీ నవరాత్రులలో నీ పూజ చేద్దామనుకుంటున్నాం , నాకు సాయం చేయి తల్లి అని తెలుగులో చెప్పకోండి. గురూపదేశ మంత్రము ను సప్తమినాడు ⋆1000పర్యాయాలు జపం చేస్తే 7 జన్మల పాపాలు తొలగిపోతాయి.⋆ (చాలామందికి ఈ మధ్య కాలంలో గురువు గారు ఉపదేశం చేశారు, గురువుగారి దగ్గర మంత్రోపదేశం పొందినవారు లక్ష మంది పైనే ఉన్నారు.)ఈ ఊర్లో కాని పొరుగు ఊర్లో కాని,మీకు గురువులు ఇచ్చిన మంత్రాన్ని, అమ్మవారి మంత్రాన్ని ఈ కాలంలో ఈ సప్తమినాడు వెయ్యి సార్లు జపం చేస్తే మంచిది. రోజూ చెయ్యాలి సప్తమి నాడు తప్పక చేయాలి . వెయ్యి సార్లు జపం చేస్తే లాభం ఏమిటి 7 జన్మల పాపములు తక్షణం తొలగిపోతాయి.ఈరోజు కానుగ పూలు దొరికితే సంపాదించండి.(చిన్న చిన్న పువ్వులు నీలంగా ఉంటాయి.),ఆ పూలతో పూజ చేయండి. తామర పువ్వులు, కలువ పువ్వులు సాయంకాల పూజలో కుంకుమతో పాటుగా పూజ చేయడానికి వాడండి. ధూపం, దీపం, నైవేద్యం ఉండాలి .పంచ పూజలు రోజు ఉండవలసిందే...

1)ఓం లం -పృథ్వియాత్మనే -గంధం సమర్పయామి

2)ఓం హం - ఆకాశతత్త్వాత్మనే పుష్పంసమర్పయామి

3)ఓం యం _వాయుతత్త్వాత్మనే

ధూపమాఘ్రాపయామి

4)ఓం రం _ తేజ తత్త్వాత్మనే దీపం పరికల్పయామి

5)ఓం వం _అమృతతత్త్వాత్మనే అమృత నైవేద్యం సమర్పయామి.పంచ పూజలు ఈ నవరాత్రులలో ప్రతినిత్యము చేయవలసిందే.

ముద్రలు అందరూ గుర్తుపెట్టుకో లేకపోయినా. ఆఖరున రెండు చేతులు జోడించి గుండెకాయ కు చేర్చి " ఓం సం సర్వాత్మనే సర్వోపచార పూజ పరికల్ప యామి" అంటే ఉపచారములు ఇచ్చినట్టే, అపచారములు పోయినట్టే. ఇలా పూజ చేయాలి.ఈ ఐదు పంచ పూజలు(గంధం,పుష్పం, ధూపం, దీపం , నైవేద్యం ), ముద్రలు రాకపోయినా, పంచ పూజలు ఉదయం సాయంత్రం చేయాలి.ఈరోజు సప్తమినాడు వినవలసిన కథ తప్పక వినవలసిన పురాణగాథ ఉన్నది ⋆అదే సరస్వతీదేవి యొక్క ఆవిర్భావం ఘట్టం⋆ వినాలి అని శాస్త్రం చెబుతున్నది.

### సప్తమి రోజు కథ

ఒకానొకప్పుడు ఈ చరాచర జగత్తులో ఇవ్వాళ మనం మాట్లాడుకుంటున్న వాక్కు సరిగ్గా లేదు .స్పష్టం లేదు ,వ్యాకరణాలు లేవు . ఆకాలంలో లోకమంతా సైగల మీద ఎక్కువగా ఆధారపడేది .అప్పుడు త్రిమూర్తులుతక్కినటువంటి దేవతలు కలిసి అమ్మవారిని భక్తితో ప్రార్థించారు.అమ్మ మాకు స్పష్టమైన వాక్కు కావాలి. ఆ వాక్కు కు వ్యాకరణం కావాలి. అటువంటి వ్యాకరణాది విద్యలను ఇచ్చేటువంటి ఒక శక్తిని ,ఒక దేవతని మాకు ప్రసాదించు అని జగదంబ ని ప్రార్థించారు. అప్పుడా జగదంబ ఈశ్వరుడు శరీరం నుంచి ఒక సుందరీ మణి ని సృష్టించింది. ఆవిడ తెల్లగా ఉంది ,తెల్లని చీర





కట్టుకుంది, చేతిలో వీణ పట్టుకుంది ,నాలుగు చేతులతో తెల్ల తామర పువ్వులతో ,హంసని వాహనంగా చేసుకుని పుట్టింది. ఆవిడే మహా సరస్వతి. ఆ తల్లి పుట్టింది మూలా నక్షత్రం, శరన్నవరాత్రులు ఏడవ రోజు పుట్టింది .(కానీ మూలా నక్షత్రం ఏరోజు ఉంటే ఆరోజు పూజ చేస్తున్నాం ప్రాచీన కాలంలో మాత్రం శరన్నవరాత్రుల్లో అమ్మవారు మూలా నక్షత్రంలో ఒక రూపం ధరించింది ) కానీ పుట్టింది మాఘ శుక్ల పంచమి ,కానీ మూల నక్షత్రం నాడు లోక శ్రేయస్సు కోసం ఒక రూపం ధరించింది , ఆవిడే మహా సరస్వతి , ఆ సరస్వతి దేవి ని కృష్ణుడు గోలోకంలో కవచం తోస్తోత్రం చేసి పూజించారు. అమ్మవారి యొక్క తెల్లని విగ్రహం తయారు చేసి, తెల్లని వస్త్రం సమర్పించి, 14 శ్లోకాలతో అమ్మని అర్చించాడు. ఆ 14 శ్లోకాలు శ్రీకృష్ణుడే స్వయంగా రాశారు కాబట్టి చాలా గొప్పవి ,దానికి సరస్వతి కవచం అని పేరు.(ఆదౌ సరస్వతీ పూజా శ్రీకృష్ణేన వినిర్మితా యత్ప్రసాదాత్ మునిశ్రేష్ఠ మూర్ఖోభవతి పండితః.)మొట్ట మొదటసరస్వతి దేవి పూజ ని గో లోకంలో శ్రీ కృష్ణ పరమాత్మ తయారు చేశారు. ఆ సరస్వతీ పూజా విధానం,ఆ కవచం చదివి, అమ్మవారు సరస్వతిని పూజిస్తే మూర్ఖుడు కూడా పండితుడవుతాడు.అటువంటి కవచం శరన్నవరాత్రుల్లో మూలా నక్షత్రం ఈ రోజు తప్పక చదవాలి. యాజ్ఞవల్క్యుడు గురు ద్రోహం చేసి తన విద్యలన్నీ కోల్పోయి ,ఈ సరస్వతి కవచం పఠించి ,మళ్లీ తిరిగి విద్యలను పొందగలిగాడు. సరస్వతి దేవి యొక్క విగ్రహాన్ని తెల్లని పువ్వులతో, తెల్లని వస్త్రంతో, తెల్లని గంధంతో పూజించాలి .ఈరోజు ఈ సరస్వతీ కవచం యధాశక్తి పారాయణం చేసి పిల్లలచేత చేయిస్తే అందులో " ఐం " అనే ఒక బీజం చాలాసార్లు అందులో మనకు కనబడుతుంది ,అది వాక్ బీజం. ఆ వాక్ బీజం వినడం వల్ల ఎందుకు పనికిరాని వాడు కూడా పండితుడు అవుతాడు. ఒకప్పుడు వాల్మీకి మహర్షి రామాయణం రాసేముందు, ఇంత గొప్ప రామాయణం అనే గ్రంధాన్ని లోకానికి ఇవ్వాలంటే సరస్వతి కటాక్షం కావాలని ,మూలా నక్షత్రం రోజున సరస్వతి ప్రతిమను పెట్టుకుని ,ఆవు పాలతో అభిషేకించి ,తెల్లని పువ్వులతో పూజించి, సరస్వతి కవచం చదివాడు. దేవీభాగవతంలో తొమ్మిదవ స్కంధములో ఉంటుంది.వాల్మీకి మహర్షి ఈ కవచం పారాయణం చేసి ఆ పాండిత్యంతో రామాయణం రాశాడు. వేదవ్యాస మహర్షి కూడా సరస్వతి కవచాన్ని భక్తి శ్రద్ధలతో పారాయణం చేసి, అమ్మ పాండిత్యం ఇవ్వగా, అమ్మవారి అనుగ్రహంతో, భాగవతం భారతం అనే 2 ఉద్గ్రంధాలు లోకానికి ఇవ్వగలిగారు. పూర్వం సత్యవ్రతుడు అనేవాడు ఈ సరస్వతీ కవచం ప్రభావంతో 500 శ్లోకాలు రాయగలిగారు.గురు ద్రోహం చేసిన పాపం నుండి బయటపడటానికి మళ్లీ ఒక గురువుని ఆశ్రయించి సరస్వతి కవచం ఉపదేశం తీసుకున్న వారు మాత్రమే గురు ద్రోహ పాపం నుండి బయటపడగలుగుతారు. అలా బయట పడి యాజ్ఞవల్క్యుడు పండితుడయ్యాడు. అటువంటిది సరస్వతీ కవచం. ఈ సరస్వతీ కవచం పఠనం చేయటం వల్లే అమ్మవారు సరస్వతి రూపంలో ఆవిర్భవించి ,ఆ సరస్వతి నుంచి మహాకాళి, దుర్గ ఇన్ని రూపాలు ధరించి శుంభ నిశుంభుల ను సంహరించిందని దుర్గా సప్తశతి చెబుతుంది . దుర్గా సప్తశతి , చండీ సప్తశతి లో మహాసరస్వతి అనే పేరుతో శుంభ, నిశుంభులని సంహరించింది అమ్మ అని చెప్పారు. సరస్వతీ రూపంలో ఉన్న అమ్మవారు దేవతల ప్రార్థనలను అంగీకరించి అనేక

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




రూపములను ధరించి నవదుర్గ దేవతలగా మారి సంహరించింది. అంత గొప్పది సరస్వతీదేవి. లక్ష్మీ కటాక్షం ,సరస్వతీ కటాక్షం రెండూ ఉండాలంటే మూలా నక్షత్రం రోజున సరస్వతీ దేవిని పూజించాలని శాస్త్రం చెబుతోంది. లక్ష్మీ ఉంటే సరస్వతి ఉండదు ...సరస్వతి ఉంటే లక్ష్మి ఉండదు ,ఈ రెండూ ఉంటే ఆరోగ్యం సంతోషం ఆనందం ఉండవు .కానీ అన్నీ ఇచ్చేది మహా సరస్వతి ,అందుకే పూర్వకాలంలో తప్పకుండా అమ్మవారిని పూజించేవారు .(కానీ ఈ మధ్య కాలంలో మూలా నక్షత్రం లో పుట్టిన పిల్లలు అంటే భయపడుతున్నారు.మూల తక్కువది కాదు,కొన్ని దోషాలు ఉంటే ఉండవచ్చు, కానీ అవి పూజ చేసేవారిని ఏమి చేయలేవు. అమ్మవారిని భక్తితో పూజిస్తే ఆ నక్షత్రము కూడా అద్భుతంగా పనిచేస్తుంది. అయ్య బాబోయ్! ఆ నక్షత్రంలో పుట్టిందట అని భయపడుతున్నారు ఈమధ్య కొంతమంది తయారయ్యి, ఈ నక్షత్రంలో పుట్టిన వాళ్ళని అసలు పెళ్లి చేసుకోవద్దు అని చెప్పేస్తున్నారట, అది మహా పాపము సుమా !.. అసలు నక్షత్రానికి పెళ్లి కి సంబంధం ఏమిటి? ఏ నక్షత్రం చూసుకుని పెళ్లి చేసుకోవాలో? చేసుకోకూడ దో తెలియక అజ్ఞానంలో ఉన్నారు. కంచి పరమాచార్యుల వారి చరిత్ర లో కాని పురాణాల్లో కానీ అసలు పూర్వకాలంలో ఈ నక్షత్రానికి పెళ్లికి సంబంధమే లేదు, పెళ్లి సంబంధానికి వంశం చూడాలని చెప్పాయి శాస్త్రాలు.ఉన్నంతలో కాస్త తారాబలం చూసుకుని ముహూర్తం పెట్టుకోవాలి తప్ప, నక్షత్రాన్ని బట్టి తిరస్కరిస్తున్నారు .మూలా నక్షత్రం అంటే భయపడిపోతున్నారు .అది మహా పాపము. మూలా నక్షత్రము సాక్షాత్ సరస్వతి స్వరూపము. ఇటువంటి నక్షత్రాన్ని తేలికగా తీసేయ కండి.)ఈ రోజు అమ్మవారిని కుంకుమతో పూజించాలి, బెల్లముతో అభిషేకించాలి. సప్తమినాడు పులిహోర పాయసం రెండూ కూడా నైవేద్యంగా పెట్టాలి. మీరు తిని యధాశక్తిగా అందరికీ ప్రసాదంగా పెట్టండి.పూర్వము శుంభుడు నిశుంభుడు అనే ఇద్దరు రాక్షసులు ఉండే వారు, వీరు బ్రహ్మ దేవుడి వల్ల వరాలు పొందారు. స్త్రీ చేతిలో తప్ప ఇంకెవరి చేతిలో మీకు చావు ఉండదు అని వరమిచ్చాడు బ్రహ్మ. దాంతో వాళ్లు గర్వించారు. ఆడవాళ్ళ చేతిలో తప్ప ఇంకెవరు చేతిలోనూ చావు ఉండదు ,ఆడవాళ్ళు మనల్ని ఏం చేస్తారు లే అనుకున్నారు వాళ్ళు, దేవతలందరినీ జయించారు, ఋషులను చావగొట్టారు, విజృంభించారు లోకాలన్నీ పట్టి పీడించారు. వాళ్లకి చాలామంది సహాయం చేశారు.ధూమ్ర లోచనుడు, రక్తబీజుడు, చండుడు, ముండుడు ఇలాంటి వాళ్లంతా పక్కన చేరారు. ఈ రక్తబీజుడు మహిషాసురుడి తమ్ముడు. అప్పుడు దేవతలంతా వాడిని సంహరించమని ఈ మూలనక్షత్రం రోజున అమ్మ ని ప్రార్థించారు. అప్పుడు అమ్మవారు స్వయముగా సింహ వాహనము చేసుకొని దుర్గాదేవి గా మారింది. దుర్గా దేవి గా మారి తన నుదిటి కంటి నుంచి ,3వ కంటి నుంచి ఫాల నేత్రము నుంచి మహా కాళిక ను సృష్టించింది. ఆ కాళిక ను వెంటబెట్టుకొని శుంభ, నిసుంభుల దగ్గరకు వెళ్ళింది. అక్కడ హుంకారము చేసింది. ఆ హుం కారానికి లోకాలన్నీ గజగజ వణికి పోయాయి. సప్తసముద్రాలు కదిలిపోయాయి పెద్దపెద్ద కెరటాలతో పైకి లేచిపోయాయి. సంక్షోభించింది .మొత్తం సముద్రమంతా కుల పర్వతాలు కదిలిపోయాయి భూమండలమంతా కదిలిపోయింది. దిక్కులు మార్మోగి పోయాయి. ఇంద్రుడే వణికిపోయాడు. బ్రహ్మ





అంతటివాడు సంక్షోభించాడు. ఏమిటో చూడమని దూతలని పంపారు శుంభ, నిశుంభులు. దూతలు వచ్చి ఎవరో ఒక అందగత్తె అండి, అంతకంటే భయంకరమైన ఒక నల్లని కాళిక ను వెంటబెట్టుకు వచ్చింది సింహ వాహనము మీద అన్నారు. అప్పుడు ఆ శుంభుడు నన్ను పెళ్లి చేసుకో అని కబురు పెట్టాడు. అప్పుడు అమ్మవారు నన్ను యుద్ధంలో ఓడిస్తే నిన్ను వివాహం చేసుకుంటాను అన్నది. ఆ మూర్ఖుడు పకపకా నవ్వి, ధూమ్ర లోచనుడు ని పంపాడు. ధూమ్ర లోచనుడిని కాళిక నరికి అవతల పడేసింది. అప్పుడు చండ ముండా సురలను పంపాడు. ఈ చండుడిని, ముండుడిని ఆ అమ్మవారు సింహ వాహనం మీద ఉన్న ఆ తల్లి చండాడి చంపేసింది. చండముండాసుర సంహారం చేయడంవల్ల అప్పటినుంచి చాముండ అని అమ్మవారికి పేరు వచ్చింది. ⋆చాముండేతి చ విఖ్యాత⋆ దేవీ భాగవతం మార్కండేయ పురాణం చెబుతున్నాయి. ఆ తర్వాత రక్తబీజుడు వచ్చాడు. రక్తబీజుడు ని చంపడం చాలా కష్టము. వాడి శరీరం మీద ఈటెతో పొడిస్తే ఎన్ని రక్తపు బొట్లు పడతాయో అంతమంది రక్తబీజులు మళ్లీ పుట్టే వారు. దాంతో అమ్మవారు వాడిని బాణంతో కొట్టగానే, బాణం తగిలిన చోట రక్తం కారేది, బిందువులు నేల మీద పడగానే మళ్ళీ రాక్షసులు పుట్టుకు వచ్చే వాళ్ళు, యుద్ధ రంగము అంతా కోటానుకోట్ల రక్త భీజుల తో నిండిపోయింది. అప్పుడు అమ్మవారు ఓహో వీడికి బ్రహ్మ వల్ల వరం ఉన్నది. అదేమిటంటే వీడి శరీరం మీద నుంచి ఎన్ని రక్తపు బిందువులు నేల మీద పడితే కొత్త రాక్షసులు పుడతారు. వీడి రక్తము నేల మీద పడకూడదు. దెబ్బలు కొడితే వీడు చావడు. ఎలాగా అని ఆలోచించి కాళికాదేవి ని పిలిచింది. నీ నాలుక విపరీతముగా పెంచి నేలమీద చాచు అని చెప్పింది. అప్పుడు కాళికాదేవి 'ఆ' అని నాలుక పెద్దది చేసి నేల మీద పెట్టింది. ఆ నాలుక మీదకి ఈ రాక్షసుడిని గెంటి , వాడి శరీరము అంతా ఆయుధాలతో పొడిచి పొడిచి రక్తం అంతా బయటకు లాగేసింది. ఒక్క బిందువు కూడా రక్తము లేకుండా చేసింది. రక్తము నేలమీద పడితేనే కొత్త రాక్షసులు పుడతారు, రాక్షసులందరి రక్తము నాలుక మీద పడడం వలన, నాలుక మీద ఉన్న రక్తము ఎప్పటికప్పుడు కాళిక తాగడం వలన, రక్తమూ నేల మీద పడలేదు, దాంతో కొత్తగా రాక్షసులు పుట్టలేదు. మనకే ఇన్ని తెలివితేటలు ఉంటే, అమ్మవారికి ఎన్ని తెలివితేటలు ఉండాలి...రక్తబిందువు నేలమీద పడకుండా, ఒక్క బిందువు కూడా లేకుండా పోయాడు రక్తబీజుడు. అప్పుడు వాడి తలకాయ నరికేసి, వాడి శరీరాన్ని కూడా మింగేసింది కాళిక. ఈ విధముగా రక్తబీజ వధ జరిగినది. అప్పుడు నిశుంభుడు అనే వాడు వచ్చాడు. వాడితో ఘోర యుద్ధం చేసింది అమ్మవారు, చంపివేసింది. ఇప్పుడు శుంభుడి తో యుద్ధం చేస్తుంది, వాడు అన్నాడు నువ్వు కాళిక నీ పక్కన బ్రహ్మాణి, ఇంద్రాణి, చాముండా సప్త మాతృక ల ను సృష్టించుకుని నవ దుర్గా దేవతలుగా మా రావు. ఇంత మంది సైనికుల సహాయంతో నాతో యుద్ధానికి వస్తావా??? అన్నాడు. నేను తప్ప ఇక్కడ అన్య స్త్రీలు ఎవరూ లేరు. చూడు ఇవన్నీ నా విభూతులు, అని మొత్తం స్త్రీలను కాళిక తో సహితంగా తనలో కలిపేసుకుంది అమ్మ. అమ్మవారు ఒక్కటే ఉంది. అమ్మే ....!! ఎన్ని రూపాలు అయినా ధరిస్తుంది, మళ్లీ ఒక్కతే అవుతుంది. అలా అమ్మ ఆ మూర్ఖుడికి కనువిప్పు చేసి,ఘోర యుద్ధం చేసింది వాడిని బాణాలతో కొట్టింది శూలాలతో పొడిచింది గధతో కొట్టింది. వాడు కూడా రకరకాల కామ రూపాలు ధరించి అమ్మతో ఘోరయుద్ధం చేసాడు. చిట్టచివరికి అమ్మవారు చక్రముతో వాడి తల నరికి వేసింది. లోకానికి వాడి పీడ పోయింది. అప్పుడు లోకంలో ఉన్న వారంతా కూడా అమ్మవారిని భక్తితో ధ్యానము చేశారు. అమ్మవారు ఇలా అన్నది.. " ⋆నేను నిజానికి ఇవాళ వీడిని చంపిన నక్షత్రము మూలా నక్షత్రము, నేను మహా సరస్వతి ని , ఇప్పుడు ఈ ఎనిమిది చేతులతో దుర్గగా ప్రత్యక్షమైన నేనే మహాకాళిని మహా సరస్వతి ని, కాకపోతే ఒక రోజు మహాలక్ష్మిగా, ఒకరోజు సరస్వతి గా, ఒక్కొక్కప్పుడు కాళిక గా ,ఒక్కొక్కప్పుడు దుర్గగా, ఒక్కొక్కప్పుడు లలిత గా ఉంటాను. మూలా నక్షత్రం రోజున మహా సరస్వతి గా పుట్టిన నేను మాత్రమే

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



ఈ దుర్మార్గుడిని చంపగలను గనుక ఈ రోజున సప్తమినాడు ( సప్తమి కాకపోతే ఏ రోజు మూలా నక్షత్రం ఉంటుందో ఆ రోజున) నన్ను సరస్వతి గా అలంకరించండి. పూజించండి. నాకు తప్పక పులిహోర పాయసం నైవేద్యం పెట్టండి. తెల్లని పువ్వులు అంటే నేను ఇష్టపడతాను. శ్వేత పుష్పములతో నన్ను పూజించి ఆ పూలతో మంత్రపుష్పము ఇచ్చి, ఆ పువ్వును నెత్తి మీద పెట్టుకున్న వాళ్లను అనుగ్రహిస్తాను, విద్యనిస్తాను, శత్రువినాశనం చేస్తాను. కాబట్టి తప్పక ఈ కథ కూడా వినాలి. ఈరోజు కూడా కథ వినేటప్పుడు చేతిలో అక్షింతలు పట్టుకొని అయిపోయాక అమ్మవారి పాదాల దగ్గర వేసి అవి నెత్తిమీద చల్లుకుంటే శత్రు విజయం, జ్ఞానము, సరస్వతి కృప కూడా పొందుతాము. మనము నైవేద్యము పెట్టిన పులిహోర పాయసాలు తన కుటుంబమే కాకుండా చుట్టుపక్కల భక్తులందరికీ పంచి పెట్టాలి, యదా శక్తిగా ఎంతోకొంత పంచి పెట్టాలి. అది ఎక్కువ పుణ్యము. పూజ అయ్యాక ఆఖరున ధూపం తప్పక ఇవ్వాలి. సాంబ్రాణి గాని గుగ్గిలము గాని అగరవత్తులు గాని చక్కని ధూపం ఇవ్వాలి.5 పూజలు చేయండి, ప్రదక్షిణలు చేయండి. అక్షతలు నెత్తి మీద వేసుకోండి. సువాసిని పూజ, బాలా పూజ యధాశక్తిగా చేస్తే అప్పుడు అమ్మవారు ఆ పూజ ని సంపూర్ణ పూజగా స్వీకరిస్తుంది. ఇలా సప్తమినాడు కూడా అమ్మని పూజించి తరించమని గురువుగారు చెప్పారు.

**అష్టమి రోజు :**

| | |
|---|---|
| తేదీ | 03-10-2022 |
| వారము | సోమవారము |
| ప్రణవ పీఠం లో అలంకారము | శ్రీ దుర్గా |

**పుజావిధానము మఱియు నివేదనము:**

చాలా పవిత్రమైన రోజులు శరన్నవరాత్రులు. అష్టమి తిధి నాడు దుర్గాష్టమి గా పిలవబడుతుంది. దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి కి మరింత ప్రత్యేకత ఉన్నది. రోజూలాగే ఈనాడు కూడా తెల్లవారుజామున లేచి భక్తిశ్రద్ధలతో శిర స్నానం చేసి కుంకుమ ధరించి విఘ్నేశ్వర పూజాదులు నిత్యకృత్యాలు సంధ్యా వందనాలు పూర్తిచేసుకుని, మండపారాధన ప్రాంతం లోకి వచ్చి అమ్మని పూజించండి. తొమ్మిది రోజులు పూజ చేయలేని వారు ఈ దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి ఈ మూడు రోజులైనా కనీసం అమ్మవారి ప్రతిమను/ కలశస్థాపన చేసి పూజించడం మంచిది. ఏదో ఒక రకంగా తొమ్మిది రోజులు అర్చన చేయడానికి ప్రయత్నించాలి, కుదరకపోతే కనీసం అష్టమి, నవమి, దశమి ఈ మూడు తిథులలో అయినా అమ్మని అర్చించిన వారికి ఇంచుమించుగా శరన్నవరాత్రులలో పూర్తిగా అమ్మను అర్చించిన ఫలితం వస్తుంది. అష్టమినాడు అమ్మవారి పటాన్ని అలంకరించి ( ఒక రూపం ఉండాలి అది బంగారము, వేండో, ఇత్తడి, రాగి ఏదో ఒకటి) విగ్రహాన్ని ఒక పళ్ళెంలో పెట్టుకుని పంచామృతా ల తోటి జలం తోటి అభిషేకం చేయండి. తర్వాత తుడిచి వేయండి ,ఏమీ లేకపోతే జలంతో అయినా అభిషేకం చేయండి తర్వాత తుడిచి బొట్టు పెట్టి యధాశక్తిగా అలంకారం చేయండి, పంచ పూజలు కూడా నిర్వహించి, చక్కగా మందార పుష్పాలతో, కలువ పూలతో తామర పువ్వులతో అర్చన చేయండి. లలితా సహస్రనామ స్తోత్రము ,దేవీ ఖడ్గమాలా స్తోత్రం వీటితో టి అర్చన చేయండి. త్రిశ తి ఉన్నవాళ్ళు త్రిశతి కూడా చేయండి. దుర్గా సప్తశతి పారాయణం ఈ కాలంలో చాలా మంచిది, అష్టమినాటి ప్రత్యేకత ఏమిటంటే,జీడిపప్పు పావు కేజీ తక్కువ కాకుండా ఎక్కువ అయితే మరీ మంచిది ,అమ్మవారి ప్రతిమ ని ఒక పళ్లెంలో పెట్టి జీడిపప్పు తో అభిషేకం చేయండి, చాలా మంచిది. ఇవన్నీ శాస్త్ర ప్రమాణాలు, జీడిపప్పు ని దోసిలి లోకి



తీసుకొని అమ్మ వారి పైన వేస్తూ శ్రీ సూక్తము ,దుర్గాసూక్తము ఏమి రాకపోతే అమ్మవారి నామస్మరణ చేస్తూ అభిషేకం చేయండి. నైవేద్యంగా జీడిపప్పు ని పెట్టండి కొబ్బరికాయను తప్పక కొట్టాలి. దీని వల్ల సకల పాపాలు తొలగిపోతాయి. తాపత్రయము అని ఆధ్యాత్మిక, ఆది భౌతిక , ఆదిదైవిక అని పేరు కలిగిన 3 తాపములు ఉన్నాయి, తాపత్రయము అంటే మూడు తాపములు అవి తొలగిపోతాయి. చాలా శుభం కలుగుతుంది. సాయంకాలం వేళ బాగా అమ్మవారికి ధూపం ఇచ్చి తర్వాత అమ్మవారి యొక్క విగ్రహానికి గాని శ్రీచక్రానికి గాని భక్తితో కుంకుమతో పూజించాలి. అమ్మవారికి చివరి మూడు రోజులలో కుంకుమపూజ విశేష ఫలితం ఇస్తుంది. ఇంకా అన్నం నైవేద్యం అష్టమినాడు దధ్యన్నం, పాయసం పెట్టి తీరాలి. దధ్యన్నం అంటే పెరుగు తో తయారుచేయబడిన అన్నం ,పాయసం అంటే బియ్యం తో తయారు చేయబడిన పాయసం సేమియా పాయసం కాదు. ఆహారములు అత్యంత శుభప్రదమైనవి ఆరోగ్యం కూడా ఇస్తాయి. ఈ విధంగా పూజించి వీటిని నివేదన చేసి అమ్మవారి యొక్క కథ వినాలి.

3)ప్రతి దినము కుమారి పూజ ,సువాసినీ పూజ తప్పక చేయాలి. అష్టమినాడు గారెల దండ వేయడం అనే సంప్రదాయం కూడా ఉండేది. మినుములతో తయారుచేసిన గారెలు మినప గారెలు (మాష చక్రాలు అంటారు సంస్కృతంలో) గారెలను 9 /18 /27 ఇలా తొమ్మిది సంఖ్య తోటి ఈ మినపగారెలు దండ కింద గూర్చి అమ్మవారికి వేసి సాయంకాలం పూజ అయ్యే సమయం లో అవి తీసి అందరికీ ప్రసాదంగా పంచి పెట్టి తినాలి. దండ వేసినప్పుడు చీర పాడైపోతుంది అనుకుంటే అటువంటప్పుడు శాస్త్రప్రకారం ఏం చేయాలంటే.. ఒకసారి ఆ దండను అమ్మవారి పాదాల దగ్గర చూపించి తీసుకు వచ్చి ఉత్సవమూర్తికి వేసేసి లేదా చీరలు లేనటువంటి పటాలకు వేసి ఈ సాయంకాలం పూజ చేసే సమయంలో తీసి తాము ప్రసాదంగా స్వీకరించి, ప్రసాదంగా పంచి పెట్టాలి. లేకపోతే శ్రీచక్రానికి చుట్టి పెట్టి ఆ తర్వాత వాటిని ప్రసాదంగా తీసుకోవాలి.అన్నం పరబ్రహ్మస్వరూపం దానిని ఏ రోజు ఏ ప్రసాదంగా సమర్పించి మనం తింటే ఆరోగ్యం వస్తుందో జగదంబ కు తెలుసు నియమించిన అర్చన కాదనే అధికారం మనకు లేదు.

### అష్టమి రోజు కథ

అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన కథ. అష్టమినాడు దుర్గాష్టమి అంటారు అసలు ఈ పేరు ఎందుకు వచ్చింది అంటే చాలా కాలం క్రితం హిరణ్యాక్షుడి కి రురువు అనే కొడుకు ఉండేవాడు, వాడు మహా పరాక్రమవంతుడు. హిరణ్యాక్షుడు శ్రీమన్నారాయణుడు వరాహరూపంలో ఉన్నప్పుడు యుద్ధం చేసి చనిపోయాడు.రురు వు కొడుకుల్లో ఒకడు దుర్గముడు అనే కొడుకు ఉన్నాడు. వాడు భయంకరా కారుడు క్రూరుడు , చిన్నప్పటినుంచి అన్నిటినీ చంపడమే వాడి పని. ఈ పాపాత్ముని దగ్గరకు ఒకనాడు కొంత మంది రాక్షసులు వచ్చి, దుర్గమ నువ్వు ఎంత పరాక్రమవంతుడు అయితే మాత్రం ఉపయోగం ఏముంది? జాతికి ఉపయోగ పడకపోతే! దుర్గమ తెల్లబోయి మన జాతికి నేను ఉపయోగపడటం లేదా? అన్నాడు. ఇప్పుడు ఏం ఉపయోగపడుతున్నావు? వంశాలను ఎప్పటికప్పుడు దేవతలు నాశనం చేస్తున్నారు. ఒకపక్కన ఇంద్రుడు మరో పక్కన విష్ణువు మరో పక్కన ఈశ్వరుడు అంతా కుట్రలు పన్ని రాక్షసులు ఎన్ని తపస్సులు చేసినా ఎన్ని వరాలు పొందినా అన్యాయంగా చంపేస్తున్నారు,, అందులో మీ తాత హిరణ్యాక్షుడు మహా పరాక్రమవంతుడు, శ్రీ మహావిష్ణువు చేతిలో చనిపోయాడు, మీ తండ్రి రురువు శివుడి చేతిలో చనిపోయాడు, ఎప్పటికప్పుడు మనం ఛస్తున్నాం, ఇలా చచ్చిపోతున్న మన వాళ్ళని రక్షించడానికి నీ వంతు సహాయం నువ్వు ఏం చేశావు అని అడిగారు. అయితే నన్ను ఏం చేయమంటారు ?అని దుర్గమ అడిగాడు. నువ్వు బ్రహ్మ గురించి తపస్సు చేయి ,గొప్ప వరాలు పొంది ఆ వరాల తోటి దేవతల్ని చీల్చి చెండాడి , ఋ షుల్ని నాశనం చేసి ,ధర్మం నాశనం చేసి, రాక్షస జాతిని అభివృద్ధి చేయి.



దుర్గముడు సరే అని హిమాలయ పర్వతాలకు వెళ్ళి కఠోర దీక్షతో బ్రహ్మ గురించి మహా తపస్సు చేసాడు. అప్పుడు బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై నీకేం వరం కావాలో కోరుకో అంటే.... దుర్గమ బాగా ఆలోచించి దేవతల అభివృద్ధికి కారణము యజ్ఞములు. యజ్ఞములు చేయాలంటే ,వేదాలు ఉండాలి ,వేదములు భూలోకంలో బ్రాహ్మణోత్తములు కంఠస్థం చేసి యజ్ఞం చేస్తున్నారు, ఈ యజ్ఞము వలన దేవతలకు బలం పెరుగుతుంది, విజృంభిస్తున్నారు. కాబట్టి దేవతల్ని నాశనం చేయాలంటే యజ్ఞములను ఆపాలి. యజ్ఞములను ఆపాలంటే వేదాలు ఆగిపోవాలి. వేదాలు ఆగాలంటే ఈ బ్రహ్మని వరం కోరుకోవాలి అనుకున్నాడు .అందుకని వాడు ఇలా అన్నాడు ⋆"సకల లోకాల కి మూల కారణమైన బ్రహ్మదేవా! మూడు లోకాలలో వేదములు చదువుకుంటున్న టువంటి వాళ్ళు వేదాలు మర్చిపోవాలి. ఆ మంత్రాలు నాకు మాత్రమే గుర్తుండి పోవాలి ఎవరికీ గుర్తు ఉండకూడదు. అం తే నా కోరిక ఇదే అన్నాడు వాడు.బ్రహ్మ తెల్లబోయి వరమిచ్చాడు తథాస్తు! అన్నాడు. ఆ రోజు నుంచి మొత్తం భూలోకంలో ఉన్న దేవలోకంలో ఉన్న పాతాళ లోకం లో ఉన్న ఏ లోకంలో ఉన్నప్పటికీ విప్రులు వేదాలు మర్చిపోయారు. వేదాలు మర్చి పోవడం వలన స్నానం చేసేటప్పుడు సంకల్పం కూడా గుర్తు లేకుండా పోయింది. సంధ్యావందనం మర్చిపోయారు, జపాలు ఆగిపోయాయి. హోమాలు ఆగిపోయాయి .పూర్వం వాళ్ళు తరచుగా ఇంద్రాది దేవతల కోసం శ్రద్ధగా యజ్ఞాలు చేస్తే, యజ్ఞముల లో పడిన ద్రవ్యం దేవతలకు ఆహారంగా వెళ్ళేది, ఇప్పుడు వీళ్ళు యజ్ఞాలు ఆపేయడం వలన దేవతలకు ఆహారం ఆగిపోయింది, సృష్టిలో ఉన్న వాళ్లంతా వేదాలు మర్చిపోవడం వల్ల, త్రిమూర్తులు తప్ప తక్కిన వాళ్లంతా వేదాలు మర్చిపోవడం వల్ల లోకం అస్తవ్యస్తం అయిపోయింది. యజ్ఞములు జరగకపోతే ఇంద్రాది దేవతలు బలహీనమై పోతారు. వాళ్లు బక్కచిక్కి పోతే వర్షాలు కురిపించే శక్తి వాళ్లకు ఉండదు. దాంతో వర్షాలు ఆగిపోయాయి. భూలోకమంతా కరువు వచ్చింది.100 సంవత్సరాల కరువు వచ్చింది.100 ఏళ్ళపాటు యజ్ఞము లేక, దేవతలకు ఆహారం లేకపోవడం వలన, ఇంద్రుడు వర్షం కురిపించ లేకపోయాడు.ఎప్పుడు కూడా మనకు వర్షం కురవాలంటే దానికి ఒక విధానం ఉంది. యజ్ఞము చేస్తే ఇంద్రుడికి ఆహారం చేకూరుతుంది సంతోషిస్తాడు. ఆయన సంతోషిస్తే ఆయన ఆధీనంలో ఉన్న మేఘాలను వదల గలుగుతాడు , అప్పుడు ఆ మేఘాలు ఆకాశంలో ఆవృత మై సకాలంలో వర్షాలు కురుస్తాయి వర్షాకాలంలో చక్కగా వర్షాలు వస్తాయి. వర్షము వలన చెరువులు, నదులు సమృద్ధిగా నీటితో నిండుతాయి. ఆ నీటితో మనము వ్యవసాయం చేస్తాం .ఆ నీటి వలన గడ్డి పెరుగుతుంది .వ్యవసాయం మీద వచ్చేటటువంటి పంట ని కొంత మనం ఉపయోగించుకొని కొంత లోకానికి ఇస్తాం. గడ్డి ఏమో ఆవులు మేస్తాయి, ఆవులు చక్కగా గడ్డి మేసి పాలిస్తాయి. ఆ పాలలో నుంచి వచ్చే సారం కొంత మనం స్వీకరిస్తాం కొంత నెయ్యి దేవతలకు ఇస్తాం. నిజంగా దేవతలని మనం సంతోషపెడితే దేవతలు మనల్ని సంతోషపెడతారు.ఎప్పుడైతే విప్రులంతా వేదమంత్రాలు మర్చిపోయారో ,యజ్ఞాలు ఆగి పోయాయో ,దేవతలు చిక్కిపోయారు లోకమంతా భయంకరమైన క్షామం వచ్చి పడింది. లక్షలు కోట్లు జీవులు క్రమక్రమంగా నశించిపోవడం మొదలుపెట్టారు. పిట్టలు రాలినట్టు రాలిపోయారు. ఇలా అనావృష్టి పూర్తిగా వంద సంవత్సరాల కాలం అయిపోయింది. ఆవులు చచ్చిపోయాయి, జనులు చచ్చిపోయారు, పశువులు నశించిపోయాయి, నేలంతా నెర్రలు వచ్చేసింది, ఎండి పోయింది బీటలువారి పోయింది. ఏ ఇళ్ళు చూసినా శవాల కుప్ప లే, అప్పడు అంతా కలిసి బ్రహ్మ దగ్గరకు వెళితే బ్రహ్మ అన్నాడు నేనేం చేయను ఆ దుర్గముడు అందరూ వేదమంత్రాల ని మర్చిపోవాలి అన్నాడు నేను తప్పక తప్పనిసరిగా ఆ తపస్సుకి మెచ్చుకొని వరం ఇవ్వవలసి వచ్చింది, తపస్సు వల్ల నేను వాడికి లొంగి పోతాను తపస్సు బ్రహ్మ ని విష్ణువుని ,శివుడిని కూడా ఆకర్షిస్తుంది. తప్పదు కాబట్టి ఇప్పుడు ప్రస్తుతం నేను చేయగలిగింది ఏమీ లేదు. అంతా కలిసి అమ్మవారిని ప్రార్థిస్తూ అమ్మే మనలను

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



కాపాడుతుంది అనగానే. అంతా ఓపిక తెచ్చుకొని అతికష్టం మీద హిమాలయ పర్వతాలకు వెళ్లారు.అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారి యొక్క విగ్రహాన్ని తయారు చేసి, అమ్మా! భయంకరమైన సంక టం లో ఉన్నాం నిన్ను స్తోత్రం చేయడానికి కూడా మా దగ్గర వేద మంత్రాలు లేవు, ఏదో తోచిన మాటలు ఈ నాలుగు ఉన్నాయి కాబట్టి మాట్లాడగలుగుతున్నాము అని వేద మంత్రాలు లేకుండా అని కేవలం ఓ మహేశ్వరి !జగదంబ! అంబికా పాహి పాహి రక్షించు !రక్షించు! అన్నారు.శ్రీ సూక్తం లేదు. దుర్గా సూక్తం లేదు. వేదం లేకపోవడం వలన అన్ని మర్చిపోయారు.మమ్మల్ని రక్షించు! ఇప్పటికి నూరు సంవత్సరాలు గా దేవతలకు ఆహారం లేదు. జీవులకు ఆహారం లేదు, జీవులు దేవుళ్ల అంతా నశించి పోతున్నారు పరిపరివిధాలుగా ప్రార్థిస్తే.... అమ్మవారు ఆనంద పడిపోయి ఎదురుగుండా ప్రత్యక్షం అయింది. ఈసారి అమ్మ నల్లని నీలా కారం కాళికా రూపం లో ప్రత్యక్షమయ్యింది, పెద్ద సింహం ,సింహం మీద ఎనిమిది చేతులు రకరకాల ఆయుధాలు పుచ్చుకుని నీల వర్ణం లో ప్రత్యక్షమయ్యింది. కళ్ళు కూడా నీలంగా ఉన్నాయి,



రకరకాలైన కూరగాయలను చేతిలో ధరించింది, అమ్మవారి చేతుల్లో పండ్లు, కూరలు, పువ్వులు ఉన్నాయి.దేవతలంతా మానవులంతా పురుషులంతా నీరసంతో ఉన్నారని రకరకాల పదార్థాలతో టి భోజనం పెట్టింది. అమృతము కూడా దాని ముందు సరిపోదు. వాళ్లు ఆ భోజనాలు ఫలాలు తిని ఓపిక తెచ్చుకున్నాక, అప్పుడు అమ్మ అన్నది, నాకు తెలుసు ఈ బ్రహ్మదేవుడు తొందరపడి ఆ హిరణ్యాక్షుడి మనవడికి వరాలు ఇచ్చాడు, తర్వాత మీరందరూ వేదాలు మర్చిపోయారు ,యజ్ఞాలు ఆగిపోయాయి దేవతలు అటు జీవులు ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు ఆ దుర్గ ముడిని సంహరించి తిరిగి పూర్వ వ్యవస్థను ఏర్పాటు చేస్తాను అనగానే వాళ్ళు తల్లి ఎంత తిన్నా నీరసంగానే ఉంది , మాకు మళ్లీ ఆహారం పెట్టు అన్నారట.ఆ తల్లి వాళ్ళ మాటలు విని మంచి రుచికరమైన పండ్లు కంద మూలాలు రకరకాల పిండివంటలతో కూడిన భోజనం ఇచ్చింది. అప్పుడు అమ్మవారిని దేవతలంతా అన్నారు కూరగాయలతో, పిండివంటలతో ,ఫలాలతో, కంద మూలాలతో రక రకాల పదార్థాలతో మా అందరికీ భోజనం పెట్టి కడుపు నింపిన తల్లి శాకంభరి అని నామం ఇచ్చారు. ఈ శాకంభరీ అనే పేరుతో అమ్మ వారు అద్భుతమైన నామం పొంది వారందరికి భోజనం పెట్టి కాపాడి ఉద్ధరించింది. ఇప్పుడు వీళ్లంతా సంతోషంతో జయహో జగదంబ మమ్మల్ని రక్షించావ్ అంటుండగా..... అమ్మవారు ఒక్కసారి హూంకారం చేసింది, ఆ హుంకారంతో ఈ దేవతల యొక్క కోలాహలం అమ్మవారి యొక్క సింహనాదం విన్న దుర్గముడు,ఎక్కడ నుంచి రా! శబ్దం వస్తుంది అని దూత లని పంపాడు. ఆ దూతలు వచ్చి ఎవరో ఒక ఆశ్చర్యకరమైన సుందరీమణి అండి సింహం మీద ఉన్నది , నీలం గా ఉంది, పరమ సౌందర్యవతి ఎనిమిది చేతులు ధరించింది రకరకాల పిండివంటలతో దేవతలకి భోజనం పెట్టింది. ఋషులకు భోజనం పెట్టింది. చచ్చిపోతున్న ప్రజలను కాపాడింది. ఏం సౌందర్యం ఆవిడది అనగా దుర్గముడు అలాంటి



సౌందర్యవతి నీ నేను పెళ్లి చేసుకొని సింహాసనం మీద పక్కన పట్టపు రాణిగా పెట్టుకుంటాను అని వాడు సైన్యంతో వచ్చి ఆవిడతో యుద్ధానికి వచ్చాడు.ఇప్పుడు అమ్మవారికి ఆ దుర్గముడికి ,ఆ దుర్గము డి సైన్యానికి మధ్య ఘోర యుద్ధం జరిగింది. అప్పుడు అమ్మవారు ఒక్కసారిగా బంగారపు రంగులోకి తన శరీరాన్ని మార్చుకున్నది. ఎర్రని శరీరంతో పుటం పెట్టిన బంగారంలా ఎనిమిది చేతులతో ప్రత్యక్షమై తన శరీరం నుంచి కొన్ని అద్భుత శక్తులను సృష్టించింది. ఆ శక్తులే దశవిద మహావిద్యలు అని పిలవబ డ్డాయి.కాళికా, తారిణీ, బాలా, త్రిపురా, భైరవీ, రమా, భగళాచైవ మాతంగీ తథా త్రిపుర సుందరి, కామాక్షి, తులజా దేవీ, జంభినీ, మోహినీ, తధాచిన్నమఃస్త, గుహ్యకాళీ, దశసాహస్ర బాహుకా.32 శక్తులు 10 విద్యలు. పది రకాల శక్తులు కలిగిన అమ్మవార్లను దశవిద మహా దేవతలు దశ మహా విద్యలు అంటారు. 32+ 10 మొత్తం 42 శక్తులు పుట్టుకొచ్చాయి. వీటిలో మొదటి పదింటిని దశ మహా విద్యలు అని పూర్వ కాలంలో వారి యొక్క రూపాలు వాటి ఉపాసనలు తెలుసుకునేవారు. తర్వాత 32 కి ద్వాత్రౌసి క్ష తులు అంటారు. అవి చాలా గొప్పవి, ఈ శక్తులు అమ్మవారి సాయానికి, అమ్మవారి శరీరం నుంచి పుట్టాయి. ఇవన్నీ కలిసి దుర్గ మాసురుడిని వాడి సైన్యాన్ని నశించిపోయే లా చేశాయి.అప్పుడు అమ్మవారు ఏరా మూర్ఖుడా !ఇప్పటికైనా దేవతలకు క్షమాపణ చెప్పి వేదాలు వారికి చ్చేసి నీ వరాన్ని ఉపసంహరించుకుని పాతాళానికి పోతే బ్రతుకు తావు లేదా నీ అంతం చూస్తాను అంటే ,ఆ దుర్గముడు మూర్ఖుడు కాబట్టి నిన్ను బంధించి పెళ్లి చేసుకుంటాను అంటూ ముందుకు వచ్చాడు. ఇప్పుడు అమ్మవారు తీవ్రమైన ఖడ్గంతో వాడి తల నరికి అవతల పారేసింది. వాడు చావగానే బ్రహ్మ వాడికి ఇచ్చిన వరం పోయింది, దాంతో ఋషులు అందరికీ దేవతలందరికీ తిరిగి వేదాలు వచ్చేశాయి. వాళ్లంతా వేదపండితులు అయిపోయారు. మళ్ళీ యధా ప్రకారంగా బలవంతులు అయ్యారు. ముఖంలో విద్యా కాంతి వచ్చింది. పూర్వపుస్థితి యధాస్థితి వచ్చేసింది. అప్పుడు అంతా కలిసి అమ్మవారిని తల్లీ జగద్భ్రమవివర్తైక కారణే పరమేశ్వరీ నమః శాకంభరి శివే నమస్తే !శతలోచనే దుర్గమాసుర నాశినీ,దుర్గమాసుర సంహర్త్వా దేవీ దుర్గేతి కచ్చతే||.అమ్మ జగన్మాత రకరకాలైన ఆయుధాలతో ఆ దుర్మార్గుడి ని సంహరించి మమ్మల్ని రక్షించావు, దుర్గమా సురుడిని సంహరించిన నీవు ఈ రోజు నుంచి దుర్గా అనే పేరుతో మా పూజలు అందుకో అన్నారు. అప్పుడు అమ్మ కూడా అంది ,నేను కూడా ఈరోజు నుంచి దుర్గముడు ని చంపడం వలన దుర్గా అనే పేరు ధరిస్తా ను విజయవాడలో ఉన్నప్పడు కనకదుర్గ అనే నామంతో కూడా ఉంటాను. అష్టమినాడు ఈ దుర్మార్గుడిని చంపాను కనుక ఆ పేరు మీదుగా ఈ అష్టమి దుర్గాష్టమి అని పేరు వచ్చుగాక! ఆరోజు తలారా స్నానం చేసినా విగ్రహానికి యథాశక్తిగా పంచామృతాలతో అభిషేకం చేసి కుంకుమతో పూజించి ఆ కథను భక్తిశ్రద్ధలతో విని ఆ తర్వాత కొబ్బరికాయను కొట్టి అక్షతలు శిరస్సున వేసుకున్న వాడికి ఏ విధమైన పీడా ఉండదు. శరీర పీడ, మానసిక పీడ, శత్రుపీడ, సకల పీడలను తొలగిస్తాను. నేను అటువంటి వారిని సర్వకాల సర్వావస్థల్లోనూ రక్షిస్తాను అని అమ్మవారు స్వయముగా వరమిచ్చింది. అట్టి పవిత్రమైనది ఈ తిథి. ఈ రోజు తులసి దళాలు, నిమ్మకాయలు, దానిమ్మ కాయలు సమర్పించండి. దళాలతో కూడా ఒక దండ గుచ్చి అమ్మ వారి మెడలో వేయండి. నిమ్మకాయల దండ వేయండి ( ఆ తర్వాత ఈ నిమ్మకాయలను వంటకు వాడుకోవచ్చు లేదా ఇంటికి లేదా వాహనానికి దృష్టి దోషం పోవడానికి కట్టుకోవచ్చు). ఇళ్ళకి కడితే తోరణం కింద దృష్టి దోషాలు పోతాయి.తప్పక ఈరోజు దానిమ్మకాయ కనీసం ఒక్కటి అయినా అమ్మ కు నైవేద్యంగా పెడితే ఇంట్లో పిల్లలకి దంత సంబంధమైన రోగాలు ముఖ సంబంధమైన రోగాలు తొలగిపోతాయి ప్రసాదాన్ని స్వీకరిస్తే, (దానిమ్మ కాయలు నైవేద్యం పెట్టి తర్వాత తినాలి.)ఈ విధంగా అమ్మవారిని పూజించి ప్రదక్షిణ చేసి దుర్గాదేవి కటాక్షాన్ని పొందండి. దుర్గాష్టమి నాడు అమ్మని పూజించినవారు అష్టకష్టాల నుంచి విముక్తి పొందుతారని మంచి విశిష్టమైన టువంటి



పాండిత్యం పొందుతారని,శరీరం విడిచి పెట్టిన తర్వాత అమ్మవారి సన్నిధానానికి వెళతారని దేవీ భాగవతం చెబుతున్నది. ఈ విధంగా అమ్మని పూజించి అందరూ కూడా తరించమని గురువుగారు చెప్పారు.

### నవమి రోజు :

| | |
|---|---|
| తేదీ | 04-10-2021 |
| వారము | గురువారము |
| ప్రణవ పీఠం లో అలంకారము | మహిషాసుర మర్ధిని |



### పుజా విధానము మఱియు నివేదనము:

శరన్నవరాత్రులు అన్నీ పవిత్రమైనవి, అందులోకూడా అష్టమి ,నవమి, దశమి కి ప్రత్యేకత ఉన్నది. నవ మి తిథి మహర్నవమి గా పిలవబడుతుంది. మంచి కాలం అమ్మను అర్చిస్తే ఆ అర్చనకు మహా ఫలితం వచ్చేటటువంటి తిధులు. ఈరోజు కూడా సూర్యోదయం ముందు లేచి శిరస్నానం చేసి, కుంకుమ ధారణ చేసి సంధ్యావందనాది కార్యక్రమాలు పూర్తి చేసి నిత్య పూజలు పూర్తిచేసి అప్పుడు మండపారాధన దగ్గరకు వెళ్లాలి. ముందు కలశాన్ని ఎర్ర పువ్వుల దండ తో అలంకరించాలి. నీళ్లు ఉన్నటువంటి వాళ్ళు మారేడు ఆకులతో దండగా చేసి ఈ కలశానికి వేసి పూజించండి. అమ్మవారి పటము ,విగ్రహమునకు మారేడు దండ దాంతోపాటు పూలదండ కూడా వేయండి. ఈ రోజు అమ్మవారికి పేలాలతో అభిషేకం చాలా మంచిది.అమ్మవారి లోహ విగ్రహానికి అభిషేకము పంచామృతాలతో చేసి తర్వాత జలముతో చేసిన తర్వాతశుభ్రం చేసిన తర్వాత ఆ విగ్రహాన్ని పళ్లెంలో పెట్టుకుని పేలాలు రెండు చేతులలో పుచ్చుకొని అభిషేకం చేయండి,ఆ పేలాలనే నైవేద్యం పెట్టి తాము తిని ఇతరులకు ప్రసాదంగా పంచి పెట్టండి. దానివల్ల ఈ లోకంలో సుఖజీవితం వస్తుంది. ఎటువంటి పాపాత్ము డికి అయినా ఉత్తమగతులు వస్తాయి. అన్నం నైవేద్యం నవమినాడు గుడాన్నం (చక్కెర పొంగలి లో చక్కెర కి బదులుగా బెల్లం వేస్తే అది బెల్లపు అన్నం సంస్కృతంలో గుడాన్నం) , మూడు అన్నము లకు తక్కువ కాకుండా పెట్టండి పెడితే 4 కూడా పెట్టమని శాస్త్రము చెబుతున్నది. గుడాన్నం, పాయసం, దధ్యన్నం, పులిహోర... తప్పక ఈ పూట మహానవమి నాడు కేజీ కుంకుమ తోటి అర్చన చేస్తే అమ్మకు చాలా మంచిది. బాల పూజ, సువాసిని పూజ ఈ శరన్నవరాత్రులలో రోజు చేయాలని శాస్త్రం చెబుతున్నది. అసలు బాల పూజ చేయకుండా ఏ పూజ చేయకూడదు. మూడు రోజులలో అయినా బాలా పూజ చేయడం చాలా మంచిది. శరన్నవరాత్రులలో మహర్నవమి కి చాలా విశిష్టత ఉన్నది. ఈరోజు చేతిలో నిమ్మకాయల దండ పట్టుకొని అమ్మవారి



చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి, ఆ దండను అమ్మవారి పాదాల దగ్గర సమర్పించి దానిని ఇంటికి తీసుకువెళ్లి వంటకాలలో కానీ లేదా గుమ్మాలకు కానీ కడితే అలాంటి వాళ్లకు ఉండే జాతక దోషాలు ,గ్రహదోషాలు, దృష్టి దోషాలు తొలగి పోతాయి.కొంతమంది తెలిసోతెలియకో పాపములను చేయడం వలన సర్పదోషాలు ఉంటాయి, దాని వల్ల శరీరమునకు తెల్ల మచ్చలు వస్తాయి, అటువంటి వాళ్ళు ఈ పూట చిమ్మిలి, పానకం ,వడపప్పు ఈ మూడింటిని అమ్మవారికి నైవేద్యంగా పెట్టి తాము తిని ఇతరులకు కూడా ప్రసాదంగా పెట్టండి, ఇటువంటి వాళ్లకి ఈ తెల్లమచ్చలు రోగాలు పోతాయి. సర్ప దోషాలు పోతాయి. ఈ రోజు అమ్మవారికి సంపంగి పూలదండ కూడా చాలా మంచిది, మహా నవమినాడు సంపంగి పూలతో పూజించి నటువంటి వాళ్ళు, భార్య భర్తల మధ్యలో ఐకమత్యాన్ని పొందుతారు, భార్యాభర్తల మధ్య లో తగాదాలు తొలగిపోతాయి. కొన్ని తీవ్రమైన రోగాలు ఉంటాయి అది అసలు ఏ రోగము చెప్పలేరు .తగ్గదు .నీరసంతో ఉంటారు పేరు కూడా తెలియని రోగాలు అటు వంటి రోగముల తో బాధపడుతున్న వారికి సులభో పాయం చెప్పారు.ఈ రోజు అమ్మవారిని గోమూత్రం ,గోవు పేడ ,ఆవు నెయ్యి ,ఆవు పెరుగు, ఆవు పాలు వీటన్నింటినీ కలిపితే పంచ గవ్యము అంటారు ఈ పంచగవ్యం తో శ్రీచక్రానికి అభిషేకము చే సి అది తీర్థంగా తీసుకోండి. ఈ భయంకరమైన మాయదారి రోగాలు పోతాయి. తర్వాత ఈ శ్రీచక్రాన్ని శుభ్రంగా కడిగేసి ఈ పూట తప్పక లలితా సహస్ర నామం తో, త్రిశతి తో, ఖడ్గ మాల తో, శ్రీ సూక్తం తో, దుర్గా సూక్తం తోఏదింటి తో చేస్తే పూజ మంచిది కనీసం ఇందులో ఒకదానితో అయినా కుంకుమ పూజ చేయాలి.ఈ పూట గాజులు జాకెట్టు చీరఇటువంటి వాటిని ముత్తయిదువులకు బాలా మణులకు పంచి పెట్టడం చాలా మంచిది. తప్పక చేయవలసిన పూజలు గురుపూజ.ఈ అష్టమి, నవమి, దశమి మూడు రోజులు మాత్రం గురువుగారి పాదాలకు నమస్కారం చేయకపోతే ( అది కూడా ముట్టుకోకుండా ఈ కాలంలో ముట్టుకోకూడదు అని శాస్త్రం) సాష్టాంగ నమస్కారం చేయడం లేదా పాద సేవ చేస్తేనే వాళ్ళు తరిస్తారు. గురువు ఎటువంటివాడో మనకు అనవసరం కానీ గురుపూజ మాత్రం చేసిన వాడు తప్పక తరిస్తాడు. అందులో ఈ మహా నవమి నాడు చేసే గురుపూజ మరింత ఎక్కువ ఫలితము ఇస్తుంది. ఈ రోజు పారాయణ చేయవలసినవి మహాలక్ష్మి దేవి యొక్క పుట్టుక, సుకన్య చ్యవనుల యొక్క వృత్తాంతం. ఈ రెండిటినీ తప్పక ఈరోజు వినాలి అని శాస్త్రం చెబుతున్నది.అమ్మవారు మహాలక్ష్మి జగన్మాత శరీరం నుంచి ఆవిర్భవించింది. అప్పుడు ఆవిడకు నాలుగు చేతులు ఉన్నాయి. ఎర్రగా తామరపువ్వు రంగులో ఉన్నది. ఆ తల్లికి అటూఇటూ ఏనుగులు వచ్చి ఆ తల్లిని ఆకాశ జలాలతో అభిషేకించాయి. అప్పుడు ఆ తల్లి శ్రీమన్నారాయణుడిని వివాహము చేసుకున్నది. వివాహ ఘట్టాన్ని ఈ పూట ఒక్కసారి స్మరణకు తెచ్చుకోవాలి. మహార్నవమి నాడు లక్ష్మీదేవి ఆవిర్భవించి విష్ణువుని పెళ్లి చేసుకున్న ఘట్టం చదువుకోవాలి. ఘట్టం చదువుతున్నంతసేపు చేతిలో అక్షతలు పట్టుకొని చివరన అమ్మవారి పాదాల దగ్గర వేసి ,ఆ తర్వాత శిరస్సున వేసుకోవాలి. ఆ తర్వాత తప్పక వినాల్సింది సుకన్య చ్యవనుల వృత్తాంతం

### నవమి రోజు కథ

చదవడం కంటే శ్రవణం వల్ల ఎక్కువ ఫలితం వస్తుంది. సకల వేదములు చదవడం వల్ల సకల తీర్థ యాత్రలు చేయడం వల్ల ఏ ఫలితం వస్తుందో ఒక్కసారి ఆ పురాణం వినడం వలన ఆ ఫలితం వస్తున్నది. ఈ కథ తప్పక వినండి ఇది వింటున్నప్పుడు సువర్ణగన్నేరు గాని, గన్నేరు పువ్వులు గాని, మందార పుష్పాలు గాని ,అక్షతలతో కలిపి పట్టుకుని అమ్మవారి పాదాల దగ్గర వేసి తర్వాత శిరస్సున ధరించండి. తర్వాత ఏటికేడాది అన్ని శుభాలు కలుగుతాయి.ఒకానొక ప్పటి మాట _ సూర్యవంశం లో శర్యాతి అనే మహా రాజు ఉన్నాడు. ఆయన కూతురు సుకన్య, చిన్నపిల్లల అప్పటి నుంచి ఆమె అమ్మవారి భక్తురాలు, పరమ సౌందర్య మణి ఆ సుకన్యకు పదహారేళ్లు



వచ్చినప్పుడు శర్యాతి మహారాజు గారు అయోధ్యా నగరానికి దగ్గరగా ఉన్నటువంటి అరణ్యాలలో వేటాడడానికి పరివారముతో బయలుదేరాడు. ఆ కాలంలో భయంకరమైన క్రూర మృగాలు కీకారణ్యంలో ఎక్కువైపోయి ప్రజల మీద పడి పీడిస్తూ ఉంటే, అప్పుడు ప్రజలంతా రాజు దగ్గరకు వచ్చి మహారాజా అడవిలో క్రూర మృగాలు పెరిగిపోయాయి అండి వాటిని వేటాడి మమ్మల్ని రక్షించండి అంటే, శరత్కాలంలో వేటకు వెళ్ళేవారు.రాజుగారు వెళ్లేటప్పుడు కొంతమంది పరివారంతో భార్యతో ఈ అమ్మాయిని కూడా వెంటబెట్టుకుని అడవికి వెళ్ళాడు. రాజుగారు వాళ్ళు వేటకు వెళుతూ ఉంటే, కొంత మంది ఆడ పిల్లలు అంతా కలిసి అడవి దగ్గర ఒక చక్కని చెరువు ఉంటే, ఆ చెరువులో జలక్రీడల కు వెళ్లారు. చెరువు పక్కన ఒక పెద్ద పుట్ట ఉంది,ఆ పుట్టలో నుంచి రెండు మిణుగురు పురుగుల వంటి కాంతి బయటకు కనబడినది, సన్నని కాంతి పుట్టలో ఉన్న రంధ్రంలో నుంచి వచ్చింది, సుకన్య చిన్నపిల్ల పదహారేళ్ల పెద్దగా లోకజ్ఞానం లేదు, పుట్టలో నుంచి సన్నగా కన్నాలు కన్నాలు నుంచి వెలుతురు వస్తుంది, ఏమిటీ వెలుతురు అని తొందరపడి,అక్కడ దర్భ ముళ్ళు ఉంటే దాంతో ఒక పోటు పొడిచింది, అప్పటికే లోపల నుంచి వద్దు !వద్దు! అని మాట వినబడుతున్నా వినిపించుకోకుండా ఒక పోటు పొడిచింది, ఆ పొడవడంతో టి లోపల నుంచి నెత్తురు వచ్చింది, అప్పటికి భయపడకుండా రెండో చోట కూడా పొడిచింది, లోపల నుంచి తీవ్రంగా నెత్తురు బయటకు వచ్చింది. మూలుగు వినబడింది. సుకన్య కు కంగారు వచ్చింది, ఎవరో ఉన్నారు లోపల పొరపాటున నేను వాళ్ళ కళ్ళు పొడి చేశాను అనుకొని హడలిపోయి ఇంటికి వచ్చేసింది. నిజానికి ఆ పుట్టలో ఉన్నది చ్యవన మహర్షి. ఆయన శ్రీ వత్స పవిత్ర గోత్రుడు. శ్రీవత్స గోత్రా నికి చాలా పేరు తెచ్చి పెట్టిన మహానుభావుడాయన భృగు వంశస్థుడు. ఆయన అక్కడ చాలాకాలంగా తపస్సు చేస్తున్నాడు అమ్మవారి కోసం. తపస్సు చేస్తుండగా ముసలివాడై పోయాడు. బాగా పండు ముసలి అయిపోయాడు. పైన పుట్టలు పోశాయి కళ్ల దగ్గర మాత్రం కొంచెం రంధ్రాలు ఏర్పడి అందులో నుంచి ఆయన జ్యోతిస్సు బయటకు వచ్చింది. తపస్సు చేసే వాళ్ళ కళ్ళల్లో నుంచి వెలుతురు వస్తుంది సూర్యకాంతి లాగా. మొత్తం కాంతి బయటకు రాకుండా పుట్ట ఉన్నందువలన రంధ్రంలో నుంచి సన్నగా వచ్చింది. ఆ కాంతి ఆయన కళ్ళు , అమ్మాయికి తెలియక కళ్ళు పొడి చేసింది. దాంతో ఆయన కళ్ళు పోయాయి. ఆ చ్య వన మహర్షి కళ్ళు అలా పోయాయో లేదో , ఇక్కడ రాజు గారికి ,రాజుగారి పరివారానికి మలమూత్రాదులు స్తంభించిపోయాయి. ( స్తంభించి పోవడం అంటే మూత్ర సంచి నిండిపోతుంది బయటకి రాదు అలాగే బయటకి రాదు అది ఎంత బాధ, ఇప్పుడు వాడు నరకం అనుభవించి చచ్చిపోతాడు అది చాలా బాధ.) వాళ్లంతా బాధతో బాబోయ్ !బాబోయ్! అనగా ఏమిటి అన్నాడు మహారాజు, ఎవరికీ ఏమీ అర్థం కాదు ఏదో జరిగిందని ఇక్కడ మనలో ఎవరో అపరాధం చేశారు ఈ అడవికి వచ్చాక, లేకపోతే ఇలాంటి శిక్ష ఏమిటి? అని అందరూ అనుకున్నారు.అంతమందికి ఒకలాంటి బాధ వస్తుంది అంటే మనలో ఎవరో ఏదో అపరాధం చేశారు. ఎవరూ అనుకుంటూ ఉండగా అప్పుడు సుకన్యకు అనుమానం వచ్చింది. నాన్నగారు, ఇందాక నేను ఇక్కడ ఒక పుట్ట దగ్గరకు వెళ్లాను ఆ పుట్టలో వెలుతురు కనబడితే దర్భతో పొడిచాను, అపరాధం వలన ఏమైనా మీకు ఈ కష్టం వచ్చిందేమో... ఇంతకీ చిత్రం ఏమిటంటే ఈ కళ్ళు పొడిచిన సుకన్యకు బాధ లేదు, మిగతా వాళ్ళందరికీ భాద వచ్చింది, పొడిచిన ఆవిడ బాగుంది తక్కిన వాళ్ళ కి వచ్చింది బాధంతా! తండ్రికి, తల్లికి మిగతా పరివారానికి. అప్పుడు వీళ్లంతా అయ్యుండొచ్చు అనుకొని ఆ పుట్ట దగ్గరకు వెళ్లి ఆ మట్టి తీసి జాగ్రత్తగా తొలగించి చూస్తే లోపల ముసలి వగ్గు గడ్డం మీసాలు పెరిగిపోయి పూర్తిగా తెల్ల పడిపోయి కళ్ళు పోయి కళ్ళలో నుంచి రక్తం వస్తూ అస్తిపంజరం లా అయిపోయిన చ్యవన మహర్షి కనపడ్డాడు. అప్పుడు రాజు గారికి విషయం అర్థమై నా కూతురు ఎంత పొరపాటు చేసింది అనుకొని, ఆ మహర్షి కాళ్లు మెత్తగా పట్టుకొని,



అయ్యా !చ్యవన మహర్షి మీరు ఇక్కడ తపస్సు చేసుకుంటున్నారని నాకు తెలుసు వశిష్ఠుడు చెప్పాడు, మీరు పుట్ట లో ఉన్నారు అని తెలుసు కానీ ఇక్కడే ఉన్నారని తెలియదు, ఎరుగదు నా కుమార్తె చిన్న పిల్ల, అమాయకత్వంతో ఏమో అనుకొని ఏమో చేసినట్టుంది, మీ కళ్ళు పోగొట్టింది. అది కళ్ళు పోగొట్టడం తో మేమంతా అవస్థలు పడుతున్నాం. దయతో కరుణా స్వరూపుడు కనుక మీరు మమ్మల్ని అభయమిచ్చి రక్షించండి, నన్ను నా కూతుర్ని నా పరివారాన్ని అనుగ్రహించండి కానీ తన కూతుర్ని కూడా ఆయనకు దండం పెట్టమంటే పాపము చ్యవనుడు హీనమైన కంఠంతో అన్నాడు నేను నిజంగా శపించలేదు, నా కళ్ళు పోవటం అనే పాపం వలన మీకు ఈ కష్టం వచ్చింది, నేను ముసలి వాడిని, పైపెచ్చు ఇప్పుడు కళ్ళు పోయాయి, తపస్సులో ఉంటే నాకు కాలం తెలియదు ఆహారం తోటి నిద్ర తోటి పని ఉండదు ఇప్పుడు తపస్సు లో నుంచి బయటకు వచ్చాను తపోభంగం అయింది .ఇప్పుడు నాకు కూడా మీలాగే ఆకలి వేస్తుంది స్నానం చేయాలి పనులు చేసుకోవాలి, ముందు చేసుకోవాలంటే నేను గుడ్డివాడను చేసుకోలేను ఈ అడవిలో, కాబట్టి నాకు సాయం చేసి పెట్టే వాళ్ళు ఒకళ్ళు కావాలి అడవిలో, నాకు ఒక సహాయకుడిని ఇస్తే అప్పుడు నేను మీకు ఈ కష్టం తొలగిస్తాను అన్నాడు. దానికి ఏముంది మీ కోసం ఇక్కడ వెయ్యి మంది పరిచారకులను పెడతాను, మంచి ఆశ్రమం కట్టిస్తాను, ఈ రోజు నుంచి మీకు మూడు పూటలా సేవలు చేస్తారు ఏం కావాలంటే అది చేస్తారు అన్నాడు రాజు.సేవకులు నాకు అక్కరలేదు, డబ్బిచ్చి చాకిరీ చేయించుకునే టటువంటి దరిద్రపు బుద్ధి నాకు లేదు అన్నాడు చ్యవనుడు.మరేం కావాలి అని రాజు ప్రశ్నించాడు?. ఒకటి, మహారాజా డబ్బిచ్చి ఎవరినైనా సేవకులని పెట్టుకుంటే డబ్బు కోసం పనిచేస్తారు పైపెచ్చు అడవిలో ఉండాలంటే వాళ్లకి బాధే, ఛీ! ఛీ! ఈ ముసలి వాడి వల్ల మేము అడవి లో ఛస్తున్నాం ,హాయిగా నగరంలో ఉండేవాళ్లమని నన్ను తిట్టుకుంటారు, ఎప్పుడు చస్తానా అని నా చావు కోసం ఎదురు చూస్తారు, ⋆అదే కట్టుకున్న పెళ్ళాం అయితే అటు సూర్యుడు ఇటు పొడిచినా భర్తను వదిలి పెట్టి వెళ్లదు ఇప్పుడు నాకు భార్య కావాలి అనగానే⋆మీకు బంగారం లాంటి భార్యను ఇస్తాను అనగా అన్నాడట రాజు, బంగారం వద్దు వెండి వద్దు నీ కూతురు నా కళ్ళు పోగొట్టింది నీ కూతురిని నా భార్యగా ఇస్తే మీ కష్టం పోతుంది లేకపోతే మీరు చస్తారు అన్నాడు చ్యవన మహర్షి.రాజుగారు తెల్లబోయి, చావడానికి సిద్ధంగా ఉండే ముసలివాడు ముట్టుకుంటే కింద పడిపోతాడు పైగా కళ్ళు పోయాయి, వీడికి ఇప్పుడు పదహారేళ్ల నా కుమార్తెను ఇచ్చి ఎలా పెళ్లి చేయను,ఇంతకంటే చచ్చినా పర్వాలేదు అనుకుని పరివారం తోటి "నా కుమార్తెను ఈ ముసలివాడికి ఇచ్చి పెళ్లి చెయ్యలేను, ఇష్టం అనుభవించి చచ్చి పోదామా అంటే " వాళ్లు కూడా మహారాజు మాటను కాదనలేక మహారాజా మీ ఇష్టం అని కష్టం గా అన్నారు. వాళ్ళు బాధను తట్టుకోలేక పోతున్నారు, రాజు గారు కూడా తట్టుకోలేక పోతున్నారు అప్పుడు సుకన్య ముందుకు వచ్చి, తండ్రి ఎందుకు ఈ వెర్రి మాటలు నా మీద వ్యామోహం విడిచి పెట్టండి, అంతటి మహానుభావుడు నా భర్త అయితే దానికంటే కావాల్సింది ఏముంది, ఒక మహాత్ముడు పుణ్యాత్ముడు నా వల్ల కళ్ళు పోగొట్టుకున్నాడు. అతడిని పెళ్లి చేసుకొని నేను ఆయనకు సేవ చేసి, తద్వారా నా పాపం పోగొట్టుకుంటాను అంటే.... వెర్రిదానా! చెప్పినంత తేలిక కాదు, కామము చాలా భయంకరమైనది, ముసలి వాడిని కట్టుకొని యవ్వనంలో కామముతో రేపు యాతన పడితే వాడిని చంపి లేనిపోని పని చేస్తావ్ ఏమో అని నా భయం అంటే.... ఛీ ఛీ నీ వంశస్థురాలు అలాంటిదా ?? నీకు ఒట్టేసి చెబుతున్నాను ప్రాణం పోయినా నా భర్తని సేవిస్తాను అన్నది. సరే అని రాజు గారు కాదనలేక పెళ్ళి చేశారు.తర్వాత అక్కడ పరివారాన్ని ఉంచుతాను అంటే, పెళ్లి చేయగానే వాళ్ళ కష్టాలు పోయి కొంతమందిని ఉంచుతాను అంటే ఆవిడ నా భర్తకు ఇష్టం లేని పని నేను కూడా చేయను అనింది. నేను నా భర్తతో పాటు నారచీరలు కట్టుకుని, ఈ అడవిలోనే ఉంటాను,,, ఇక్కడ ఎవ్వరూ అక్కరలేదు నేను ఆయనకు సేవ చేస్తాను ఆశ్రమం



ఒకటి నిర్మాణం చేసి ఇచ్చేయండి అంటే గుడిసె వేసి పెట్టారు. ఆ గుడిసెలో తన భర్తతో కాపురం పెట్టింది. అందరూ వెళ్ళిపోయారు, మహాత్మురాలు సుకన్య. అందుకే సీతాదేవి కూడా "సుకన్య చ్యవనం యధా" అని సుకన్య చ్యవనుడిని విడిచి పెట్టనట్టుగా నేను నా భర్తను విడిచిపెట్టను అని రావణాసురిడి తో అంటుంది. అంత గొప్పది ఈ సుకన్య. అటువంటి సుకన్య ప్రతి రోజూ భర్తకు ఎంతో సేవ చేసేది, తెల్లవారుజామునే లేచి ఎవరి కంటా పడకుండా దగ్గరలో చెరువు ఉంటే ఆ చెరువులో స్నానం చేసి, మడి నీళ్లు పట్టుకు వచ్చి, భర్తకు స్నానం చేయించి, కందమూలాలు తెచ్చి, ఆహారం పెట్టి ఆయనను పడుకోబెట్టి, కాళ్లు పట్టి, సంధ్యావందనం చేసుకుంటానంటే అర్ఘ్య ప్రధా నానికి నీళ్ళు ఇచ్చి, అలా రకరకాలుగా ఆయనకు చాలా సేవ చేసింది. ఇలా కొంతకాలం గడిచింది. అందంగా ఉండే ఆ తల్లి చిక్కిపోయింది, చిక్కిన ఇంకా అందంగా ఉంది ఆ మహాత్మ రాలు .ఇలా ఉండగా ఒక నాడు తెల్లవారు జామున లేవడం మర్చిపోయింది అలసి పోవడం వలన, కొంచెం ఆలస్యంగా లేచి స్నానానికి వెళ్లి నీళ్లు తెచ్చుకుందాం అనుకుంటూ ఉంటే, ఇద్దరూ అందగాళ్ళు ఆమెకు కనపడ్డారు, సుందరీమణి నీవు ఎవరివి? ఇంత అందగత్తె వి వనదేవత వా?? అంటే కాదండి మీరెవరో నాకు తెలుసు మీరు సూర్యభగవానుడికి సంధ్యా దేవి కి పుట్టిన కుమారులు అశ్వినీ దేవతలు అంటారు మిమ్మల్ని , నేను సుకన్య ని శర్యాతి మహారాజు కూతరిని ఇక్కడ ఉన్నటువంటి చ్యవన మహర్షి భార్య ని, నా భర్త కళ్ళు పోగొట్టుకుంటే ఆయనకు రోజు సేవ చేస్తున్నాను పతివ్రతను అని చెప్పింది. వాళ్లు పిచ్చిదానా! ఆ ముసలాడితో కాపురం ఏం చేస్తావ్? వాడి వల్ల సుఖం ఏముంది వాడిని వదిలి వేసి ఇద్దరి అందగాడి లలో ఎవరినైనా పెళ్లి చేసుకోమంటే ఆవిడకు ఒళ్ళు మండి " ⋆నేను పతివ్రత ని ఇంకొక్క మాట మాట్లాడితే భస్మం చేస్తాను, నా భర్తను అనుజ్ఞ లేక ఆగాను సూర్యుడి కొడుకులు కాబట్టి ఇంతసేపు మాట్లాడాను ఏమనుకుంటున్నారు వేళాకోళం ఆడుతున్నారా, అమ్మ

పతివ్రతను నేను అనగానే వాళ్లు గజగజ వణికిపోయారు. నిన్ను పరీక్షించాము నువ్వు నెగ్గావు, నీకు ఉపకారము చేస్తాం, మీ భర్తకు నవయవ్వనం ఇస్తాము కళ్ళు ఇస్తాము, కాకపోతే నీ భర్త ను మేమిద్దరం చెరో రెక్క పుచ్చుకుని ఈ నీళ్ళల్లో ముంచుతాం, నీళ్ళలో నుంచి బయటకు రాగానే, ఆయన అచ్చం మా లా ఉంటాడు, మా ముగ్గురిలో ఎవరు నీ భర్త అనేది నువ్వు కనిపెట్టాలి, మేము ముగ్గురం ఒకేరకంగా ఉంటాం,ఆ ముగ్గురిలో నీ భర్తను గుర్తుపట్టి పట్టుకున్నావా పర్వాలేదు ఇంకెవరి చెయ్యి అయినా పట్టుకుంటే వాడే నీ భర్త.... ఒప్పుకుంటావా? అంటే సుకన్య కంగారుపడి భర్త దగ్గరకు వెళ్లి ఏమండీ !ఏం చేద్దాం అని అడిగింది, ఒప్పుకో అన్నాడు ఆయన.మరి ముగ్గురు ఒకే రకంగా ఉంటే మిమ్మల్ని ఎలా గుర్తుపట్టాను అంటే ,అదే నీ పాతివ్రత్య మహిమ అన్నాడట చ్యవనుడు. "సరే అని సుకన్య ఒప్పుకొంది వాళ్ళిద్దరూ చ్యవనుడు చెరో రెక్క పుచ్చుకొని చెరువులో ముంచారు. కాసేపటికి పైకి వచ్చారు, చూస్తే ముగ్గురూ ఒకే రకంగా ఉన్నారు. అందులో తన భర్త ఎవరో అశ్వినీదేవతలు ఎవరో సుకన్యకు తెలియలేదు. ఈరోజు అదృష్టవశాత్తు మహానవమి అమ్మను పూజించాను కదా అని.. అమ్మను తలచుకున్నది. అమ్మ అ ముగ్గురిలో నా భర్త ఎవరు? ముగ్గురు ఒకే రకంగా ఉన్నారు అనగానే అమ్మవారు సుకన్య కి తెలివితేటలు ఇచ్చింది. అవి ఏమిటంటే దేవతలకు కంటిమీద రెప్పపాటు ఉండదు. ఈ భర్తకు రెప్పపాటు ఉంటుంది తక్కిన వాళ్లకు రెప్పపాటు ఉండదు చూసుకో అందట చెవిలో.... అప్పుడు సుకన్య వాళ్ళ ముగ్గురు కేసి చూసింది, ఆ ముగ్గురిలో ఒక ఆయన చీటికిమాటికి కంటిమీద రెప్ప వేస్తున్నాడు, మిగతా ఇద్దరు గుడ్లప్పగించి చూస్తున్నారు. ఠక్కున తన భర్త చేయి పుచ్చుకుంది. అప్పుడు వాళ్ళు తెల్లబోయి, అమ్మ మేము మా అసలు రూపం ధరిస్తున్నాం నీ భర్త రూపం నీ భర్త కు ఇస్తున్నాం... మేము ముగ్గురం ఒకే రకంగా ఉంటే, అందులో నీ భర్తను ఎలా గుర్తు పట్టారు? అని అడిగారు అప్పుడు సుకన్య అదే అమ్మవారి అనుగ్రహం అంటే అంది. ⋆మహా నవమినాడు



అమ్మ ని పూజించిన వాళ్ళకి అమ్మ అంత గొప్ప శక్తినిస్తుంది,ఈ సృష్టిలో ఏ కార్యం లోనైనా విజయం కావాలంటే అమ్మను అలా పూజించాలి మహా నవమినాడు⋆ అప్పుడు వాళ్ళు సంతోషించి వెళ్ళిపోదాము అనుకుంటుంటే చ్యవనుడు అన్నాడు నాకు నవయవ్వనం ఇచ్చారు ఆరోగ్యం ఇచ్చారు. నన్ను పాతికేళ్ళ కుర్రాడు ని చేశారు, భార్య నేమో 17 ఏళ్ల బాలిక ను చేశారు , మీకేం కావాలో కోరుకోండి అంటే యజ్ఞములో సోమరసము తాగాలని కోరిక ఉన్నది , ఇంద్రుడు ఏమో మమ్ములను సోమ పానానికి అనర్హులుగా ప్రకటించారు. నేను యజ్ఞం చేయిస్తాను అన్నాడు చ్యవనుడు, తర్వాత మహారాజు గారిని పిలిపించి, అంబా యాగమును చేసాడు, మహా నవమినాడు అంబా యాగము అని చేసేవారు పూర్వం అమ్మవారి మూల మంత్రం తో. యజ్ఞం లో దేవతలందరినీ కూర్చోబెట్టి ఆఖరున అమ్మను పిలుస్తారు. దేవతలందరూ రాగానే అశ్వినీ దేవతలను కూడా పిలిపించాడు చ్యవనుడు, అప్పుడు ఇంద్రుడు అన్నాడు ఇదిగో వీళ్ళకి యజ్ఞం లో భాగం లేదు నేను వాళ్ళని అనర్హులను చేశాను దేవ వైద్యులు కదా అని, వాళ్ళు ఇక్కడున్నారు అంటే నిన్ను చంపేస్తాను అన్నాడు.నేను వాళ్లకి యజ్ఞంలో భాగం కల్పిస్తానని, సోమరసం వాళ్ళ చేత తాగిస్తానని వాళ్లకి మాటిచ్చాను మాట నేను తప్ప ను అన్నాడు చ్యవన మహర్షి⋆దాంతో ఇంద్రుడికి కోపం వచ్చి నిన్ను వజ్రాయుధంతో చంపుతాను. మా పక్కన వాళ్ళని కూర్చో పెడతావా?? వాళ్ళు పనికిమాలిన వాళ్ళు, అని వజ్రం ఎత్తాడు... వెంటనే చ్యవనుడు "హుం ఫట్ స్తంబయ" అనగానే ఇంద్రుని చెయ్యి అలా బిగుసుకుపోయింది. చ్యవనుడు ఇంద్రుడిని అలా స్తంభింపజేసి, తన యజ్ఞగుండం నుంచి ఒక రాక్షసుడిని సృష్టించి, ఒరేయ్ !ఇంద్రుడిని మింగేయ్ అన్నాడు. ఇంద్రుడిని మింగడానికి రాక్షసుడు రాగానే ఇంద్రుడు కంగారు పడిపోయి తన గురువు గారిని పిలిచాడు. అప్పుడు బృహస్పతి వచ్చి అమ్మవారి భక్తుడు ఇతడు, అమ్మవారి భక్తుల జోలికి వెళితే నాశనమై పోతావ్... ఆయన కాళ్లే పట్టుకో అన్నాడు.

అప్పుడు ఇంద్రుడు చ్యవనుడిని బ్రతిమిలాడి తే చ్యవనుడు స్తంభించిపోయిన ఇంద్రుడిని కదిలేలా చేసాడు. రాక్షసుడి నేమో బయటకు పంపే సి, ఇక మీదట ఈ దేవ వైద్యులు మీతో సమానముగా యజ్ఞములో భాగము పొందాలి, అలా చేస్తావా అంటే ఇంద్రుడు అలానే అని ఒప్పుకున్నాడు. అప్పటినుంచి అశ్వినీ దేవతలకు యజ్ఞం లో భాగం తిరిగి వచ్చింది. ఆ తర్వాత యజ్ఞం అద్భుతంగా జరిగింది. ⋆అంబా యాగం కదా అమ్మ సంతోషించి యజ్ఞగుండం నుంచి ప్రత్యక్షమై ఈ చ్యవనుడు నా లోకానికి ఎప్పుడు కావాలంటే అప్పుడు రాగలుగుతాడు మహా నవమినాడు అంబా యాగము చేసిన వాడు కుంకుమ పూజ చేసిన వాడు నిమ్మకాయల దండ ఇచ్చినవాడు వీళ్ల తరిస్తారు అని అమ్మ అందరినీ ఆశీర్వదించింది.ఈ కథను ఈ మహానవమి రోజు చేతిలో అక్షతలు పూలు పుచ్చుకొని విని వాటిని అమ్మవారి పాదాల దగ్గర వేసి ఆ తర్వాత వాటిని శిరస్సున వేసుకుంటే ఆనాడు చ్యవనుడు సుకన్య ఎటువంటి మహిమను పొందారో మనము కూడా అలాంటి వాటిని పొందుతాము. ఏటికేడాది మనకు విజయం లభిస్తుంది, ⋆అన్నిటికీ మించి ఈరోజు కాళ్ళకు ఉండే గజ్జలు ఆడవాళ్ళు ధరించండి పట్టాలు పెట్టుకోండి కనీసము. కాళ్లకు పట్టీలు పెట్టుకొని చేతులకి కొత్త గాజులు ఎర్ర గాజులు వేసుకొని 108 లేదా 9 ప్రదక్షిణలు చేస్తే ఇంకా అటువంటి వారికి సకల సౌకర్యాలు కలుగుతాయి. సకల సౌఖ్యాలు లభిస్తాయి, సకల సౌకర్యాలు అమ్మ ఇస్తుంది.మగవాళ్ళు చేతికి కాళ్ళకి కూడా కొంచెం గోరింటాకో పసుపు కుంకుమో పూసుకొని ప్రదక్షిణ చేస్తే సకల శుభాలు లభిస్తాయి⋆ఈ విధంగా మహానవమి నాడు అమ్మను పూజించి తరించండి అని గురువుగారు చెప్పారు.

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




### దశమి రోజు :

| | |
|---|---|
| తేదీ | 05-10-2021 |
| వారము | శుక్రవారము |
| ప్రణవ పీఠం లో అలంకారము | మహిషాసుర మర్ధిని |

### పుజావిధానము మఱియు నివేదనము:

అత్యంత పవిత్రమైన తిథి ఈ విజయదశమి★శరన్నవరాత్రులు పూర్తయ్యాక ఈ పదవరోజు కార్యక్రమం కంటే ఉత్తమమైన కార్యక్రమం మరొకటి లేదు గనుక విజయాన్ని ప్రసాదించే దశమి కనుక విజయదశమి అని పేరు. ఈ దశమి తిథి మానవుడి జీవితానికి ఒక గొప్ప వరం. అందరూ భక్తి శ్రద్ధలతో తెల్లవారుజామున లేచి తలారా స్నానం చేసి చివరకు మండపారాధన చేయలేని వాళ్ళు కనీసం ఈ రోజైనా మండపారాధన చేయండి. (మండపం ఏర్పాటు చేసుకోండి పీట వేసుకోండి దానిమీద తువాలు వేయండి బియ్యం పోయండి కలశస్థాపన చేయండి .అమ్మవారి ప్రతిమ లేక రూపు లేక శ్రీ చక్రం కొని కనీసం ఈ ఒక్కరోజయినా అమ్మవారిని అర్చన చేస్తే అటువంటి వాళ్ళకి తిరుగులేని శుభాలు కలుగుతాయి)ఈరోజు ఏమేం చేయాలో క్రమంగా చెప్పుకుందాం, అమ్మవారి పూజకు అన్నీ సిద్ధం చేశాక ఒక పంచలోహ విగ్రహం కాని ఒక లోహం తో తయారు చేసిన అమ్మవారి రూపం పెట్టుకొని శ్రీచక్రం ఇంట్లో ఉన్న వాళ్ళు శ్రీ చక్రాన్ని కూడా పెట్టుకోండి, శ్రీచక్రాన్ని గాని లేక అమ్మవారి విగ్రహాన్ని కానీ ముందు పంచామృతాలతో అభిషేకించండి, తర్వాత జలంతో అభిషేకించాలి శుద్ధి చేయండి. యధాశక్తిగా కుంకుమ పెట్టండి. అమ్మవారి విగ్రహాలు పెద్దవి ఉన్న వారు చక్కగా అలంకారం కూడా చేయండి. ఈ రోజు అమ్మవారిని లలితా పరాభట్టారికా గా రాజరాజేశ్వరిగా వి జయ దుర్గ గా అలంకారం చేసుకోండి. ★అమ్మవారి పూజకు ఈ రోజు తప్పక గంధం ,అగర వత్తులు, కర్పూరం, సుగంధ పుష్పాలు ఉండేలా చూసుకోండి.ఈ రోజు అమ్మవారి పూజ లో తప్పక ఉండాల్సిన పువ్వులు మందార పుష్పాలు, గానుగ పువ్వులు, అశోకము, సంపంగి ,గన్నేరు, మాలతి, బిల్వ పత్రాలు, తామర పువ్వులు ,కలువ పువ్వులు వీటిని సమర్పించండి..ఈరోజు కొబ్బరికాయ ,దానిమ్మ ,నిమ్మ,అరటి పళ్ళు, నారింజ, పనస, మారేడు కాయ వీటిలో ఏవైనా కొన్ని అయినా సిద్ధం చేసుకోండి నైవేద్యానికి...దశమినాడు పంచామృత అభిషేకం ,జలాభిషేకం అయిపోయాక అమ్మవారి విగ్రహాన్ని శుద్ధిచేసి నల్లని నువ్వులతో అభిషేకము చేయండి, దేవి భాగవతంలో తృతీయ స్కంధం లో ఉంది. నల్లని నువ్వులతో దశమినాడు అమ్మవారి విగ్రహానికి అభిషేకము చేసి నువ్వులు కొంచెం ప్రసాదంగా తిని ఇతరులకు పంచి పెట్టి (నువ్వుల దానం పుచ్చుకునే వాళ్ళకి ఇచ్చేస్తే) భయంకరమైన శని దోషాలు యమ భయాలు అన్నీ తొలగిపోతాయి. పూర్వ కాలంలో నువ్వులతో అభిషేకం చేసే వాళ్ళు.ఈ రోజు అమ్మవారికి వరసగా ఐదు రకాల నైవేద్యాలు పెట్టడం చాలా మంచిది అని శాస్త్రం చెబుతున్నది.గుడాన్నం(బెల్లపు అన్నం) , ధధ్యన్నం, పాయసాన్నం ,పులిహోర, స్నిగ్ధాదనం ( నేతి తో పోపు పెట్టబడిన అన్నం). వీటిలో ఐదు పెట్టగలిగితే అయిదు కనీసం ఒక్కటైనా నైవేద్యం పెట్టండి మీరు తినండి ఇతరులకు కూడా పెట్టండి.అమ్మవారి శ్రీచక్రాన్ని గాని లేక ఆ తల్లి మేరువుని గాని ( శ్రీ చక్రం లో కూడిన మేరువు , కైలాస ప్రస్తారం, భూ ప్రస్తారం 3 ఉంటాయి.)అందులో ఏదో ఒక శ్రీ చక్రం లేదా రూపాన్ని లలితా సహస్ర నామములతో, దేవి త్రిశతి తో, ఖడ్గమాల స్తోత్రం తో, శ్రీ సూక్తము తో, దుర్గా సూక్తం తో కుంకుమతో పూజ చేయండి. పుష్పాలతో వాటితో కూడా పూజ చేయండి యధాశక్తి గా. ఈ పూట సాయంత్రం వేళ జమ్మి చెట్టు కి సంస్కృతంలో "శమీ" అంటాము. శమీ పూజ చేసి తీరాలి.



⋆శ్లోకము⋆

"శమీ శమయతే పాపం శమీ శత్రువినాసినీ అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ"||

అనగా శమీవృక్షం పాపాన్ని తొలగిస్తుంది, శమీవృక్షం శత్రువులను తొలగిస్తుంది, అర్జునుడు ఒకప్పుడు గాండీవము అనే విల్లును ఆ చెట్టు పైన పెట్టాడు, రాముడు కూడా ఈ చెట్టు కి ప్రదక్షిణ చేసి పూజ చేశాకే సీతాదేవి దొరికింది.జమ్మి పూజ సకల శత్రువులను తొలగిస్తుంది.ఈ శ్లోకమును ఒక కాగితం మీద రాసి ఆ జమ్మి చెట్టు మొదటిలో వేసేయండి. జమ్మి చుట్టూ ప్రదక్షిణ చేయండి. జమ్మి కి దూరం నుంచి దీపం , ధూపం ఇవ్వండి. చెట్టు మొదట్లో ఎప్పుడు అగరవత్తులు గుచ్చకూడదు.అగరవత్తుల వేడికి ఆ చెట్టు చచ్చిపోతే అది మహా పాపము. చాలామంది చేస్తున్న పెద్ద పొరపాటు అదే. ఆ దీపం తీసుకెళ్లి చెట్టు మొదట్లో పెడతారు అలా చెట్టుని చంపకూడదు.గురువుగారి కాళ్ల దగ్గర దీపం పెట్టడం అమ్మ వారి దగ్గర దీపం పెట్టి అమ్మవారి చీర కాల్చేయడం ఇలాంటి మూఢ భక్తి పనికిరాదు. భక్తి వేరు పిచ్చి వేరు. దూరంగానే దీపారాధనలు దూరంగానే ధూపాలు పెట్టాలి.ఈరోజు ప్రొద్దుట గాని సాయంత్రం గానీ అమ్మవారి విగ్రహాన్ని అలంకరించి వెయ్యి తామర పువ్వులతో లేక వెయ్యి కలువ పువ్వులతో లలితా సహస్రనామం తో పూజిస్తే వచ్చే ఫలితాలు అంతా ఇంతా కాదు. రామచంద్రుడే అలా పూజించాడు. ఈరోజు గురు పాదాలకు భక్తితో నమస్కరించి స్వయంపాకం ఇచ్చి గురువు యొక్క అనుగ్రహము తీసుకొని ఆయన అనుజ్ఞ స్వీకరించి అప్పుడు అమ్మవారిని పూజించాలి.

దశమి రోజు కథ:

ఒకప్పటి మాట రామచంద్ర ప్రభువు లంకా నగరానికి వెళ్లేముందు అమ్మని పూజించి నట్టుగా దేవీభాగవతంలో ఉంది. ఇదే కథ యధాతథంగా కాళికా పురాణం లో కూడా ఉంది. మరికొన్ని గంటల్లో రామచంద్రుడు లంకానగరానికి వారధి కట్టుకొని వెళ్లాలి. ఆరోజు అదృష్టవశాత్తు తెల్లవారితే విజయదశమి రామచంద్రుడు ఏం చేస్తే తొందరగా విజయం లభిస్తుంది అని ఆలోచిస్తుండగా, రామచంద్ర సన్నిధానంలో నారదమహర్షి అదృష్టవశాత్తు ప్రత్యక్షమయ్యాడు.నారదుడు రాముడిని ఆశీర్వదించి, రాముడు భగవంతుడైన ప్రస్తుతం మానవ రూపంలో ఉండడం వలన నారదుడిని గురువుగా భావించి భక్తితో పూజించాడు, నారద సీత దర్శనం అవ్వాలి తిరిగి ప్రియ సమాగమం కావాలి. రావణుడిని నేను జయించాలి. శత్రువుల మీద విజయం పొందడానికి ఏదైనా సులభ మార్గం చెప్పవా అంటే... అది అమ్మవారి పూజ, నీ అదృష్టవశాత్తు తెల్లవారితే విజయదశమి, నేను ఈ సముద్ర తీరంలో ఇసుక తో అమ్మవారి విగ్రహం ఒకటి చేయిస్తాను, అమ్మవారిని నువ్వు ఈ రాత్రి దీక్షలో కి వెళ్లి దర్భల మీద పడుకొని ధ్యానించు. రేపు ఉదయం అమ్మ ను ఎలా పూజించాలో పూజా విధానం నేను దగ్గరుండి చేయిస్తాను.1008 తామర పువ్వులు తెప్పించు. వాటితో అమ్మవారిని పూజిస్తే తిరుగులేకుండా నీకు విజయం లభిస్తుంది అనగా,,తెల్లవారేసరికి 1008 తామర పువ్వులు అని ఆశ్చర్యపోయాడు రామచంద్రుడు,ఆశ్చర్య పోకు హిమాలయాలలో సౌగంధిక పుష్పాలు అని ఉంటాయి 1000 రేకుల తామరపువ్వుల వి, ఘుమ ఘుమ లాడే వాసనతో ఉంటాయి అవి ఆ పూలు ఈ రాత్రికి రాత్రే తీసుకువచ్చి ఇవ్వగలిగే శక్తి ఉన్నవాడు నీ పక్కనే ఉన్నాడు.నేను తలుచుకుంటే రాత్రికిరాత్రే ఆ పువ్వులు వస్తాయి. తెల్లవారుజామునే నువ్వు అమ్మని పూజించవచ్చు.ఎవరు ఆయన? అని అడిగాడు రాముడు ఏమీ తెలియనట్టు. ఇంకెవరు మన మారుతి ఆంజనేయుడు ఉండగా మనకు లోటు ఏమిటి అన్నాడు నారదుడు. నారదుడు చెప్పినట్టు వెయ్యి రేకుల సౌగంధికా పుష్పాలు 1,008 తెచ్చి పెడతావా మారుతి అంటే రామచంద్ర ప్రభువు నువ్వు ఆజ్ఞాపిస్తే చెయ్యనా అని ఆంజనేయుడు అన్నాడు.నారదుడు నాయనా ఒకటి గుర్తు పెట్టుకో





కచ్చితంగా 1,008 పువ్వులే ఉండాలి. వెయ్యి ఎనిమిది కంటే ఎక్కువ తేకూడదు తక్కువ తేకూడదు.. కచ్చితంగా లెక్కపెట్టి రాత్రికి రాత్రి ఆ సౌగంధికా పుష్పాలు తీసుకురా అంటే అలాగే నారదమహర్షి మీరు ఆజ్ఞాపించినట్లు తీసుకు వస్తాను అని హుటాహుటిన ఆకాశమార్గంలో జైశ్రీరామ్ అనుకుంటూ వెళ్ళిపోయాడు హనుమంతుడు.హిమాలయ పర్వతాలకు వెళ్లి యక్ష పర్వతం దగ్గర గంధమాదనపర్వతం దగ్గర సౌగంధిక పుష్పాల సరస్సు దగ్గరకు వెళ్లి కచ్చితంగా 1008 పుష్పాలు లెక్క పెట్టి వాటిని కట్టకట్టివాటిని పుచ్చుకొని మళ్ళీ మోసుకు వచ్చి రాముడి చేతిలో పెట్టాడు. రాముడు ఆ పుష్పములు నారదుడికి ఇచ్చాడు. నారదుడు చాలా సంతోషించి ఈ రాత్రికి నీకు దీక్ష ఇస్తున్నాను అని చెప్పి కంకణం రాముడికి ,లక్ష్మణుడికి కట్టి దర్భల మీద పడుకోబెట్టాడు. దర్భల మీద పడుకున్నారు తెల్లవారుజామున లేచారుఎప్పుడు విజయ దశమి నాడు పూజ చేసే వాళ్ళు తలారా స్నానం చేయాలి. ఎదురుగుండా సముద్రం ఉంది కాబట్టి సముద్ర స్నానం చేశారు రామలక్ష్మణులు. అదికూడా నారదుడు సంకల్పం చెబుతూ ఉండగా చేశారు. సంకల్పము చెప్పకుండా పూజ చేయకూడదు, సంకల్పము చెప్పకుండా స్నానము చేయకూడదు, సంకల్ప హీనులు పశువులు అయి పుడతారు. యోగులకు ఋషులకు అక్కరలేదు గానీ సంసారం లో ఉన్న వాళ్ళు తప్పక సంకల్పం చెప్పుకోవాలి. ⋆నిలకడ లేని మనసుతో చేసే పూజ, సంకల్పం చెప్పుకోకుండా చేసే పూజ నశిస్తాయి⋆(మానవుడికి ఆరోగ్యం సరిగా లేనప్పుడు తలకి స్నానం చేయకపోయినా కంఠ స్నానం చేసినా చాలు. జ్వరంతో ఉన్న వాడు స్నానం చేయలేని పరిస్థితిలో ఉన్నప్పుడు కొంత విభూతి పోసుకొని అమ్మవారి పూజ చేసుకోవచ్చు దానికి భస్మ స్నానం అని పేరు.పూజ మాత్రం మాన కూడదు, భక్తితో ఉన్న వారికి అమ్మ కనిపించి తీరుతుంది.రాముడు సంకల్పం చెప్పుకొని స్నానం చేశాక నారదుడు ఇచ్చిన దీక్షా వస్త్రాలు ధరించాడు. అనంతరం అమ్మవారి సైకత ప్రతిమ అంటే ఇసుక తో తయారు చేయబడిన ప్రతిమ పెట్టుకున్నాడు. అదే మనం అయితే పంచలోహ విగ్రహ మో , మట్టి ప్రతిమ యో, ఇత్తడి విగ్రహము ఏదో ఒకటి చిన్నదో పెద్దదో లేక ఏమీ లేకపోతే శ్రీ చక్రం కొనుక్కుని చేసుకుంటే మరీ మంచిది, లేదా కలశాన్ని పూజించిన ఫర్వాలేదు. మొత్తం మీద విగ్రహం పెట్టుకోవాలి.)ఆచమనాదులు, సంకల్పాదులు చెప్పుకోవాలి. ముందుగా ఎప్పుడు విగ్నేశ్వర పూజ చేయాలి. పూజ చేసే ముందు విఘ్నేశ్వరుడిని పూజించాలి, అందులో విజయదశమి నాడు ప్రత్యేకంగా అమ్మవారిని మన శ్రేయస్సు లోక శ్రేయస్సు కొరకు 1008 పూలతో పూజ చేసేవాడు ముందు విఘ్నేశ్వర పూజ చేయవలసిందే.గణాధిప పూజ అయ్యాక అప్పుడు భక్తితో మండపారాధన, నవగ్రహారాధన ఇవన్నీ చేసి అప్పుడు అమ్మని పూజించాలి.అన్నీ రాముడు చేత నారదుడు దగ్గరుండి చేయించాడు. అమ్మవారికి పంచ పూజలు చేయించాడు

1)ఓం లం_ పృథ్వియాత్మనే -గంధం సమర్పయామి(తరువాత చూపుడు వేలుతో బొటన వేలు)

2)ఓం హం - ఆకాశతత్వాత్మనే పుష్పం సమర్పయామి

3)ఓం యం -వాయుతత్వాత్మనే ధూపమాఘ్రాపయామి

4)ఓం రం _తేజ తత్వాత్మనే దీపం పరికల్పయామి

5)ఓం వం _అమృతతత్వాత్మనే అమృత నైవేద్యం సమర్పయామి.

పంచ పూజలు ఈ నవరాత్రులలో ప్రతినిత్యము చేయవలసిందే. అలా చేస్తేనే సక్రమమయిన ఫలితము పొందుతాము.ముద్రలు అందరూ గుర్తుపెట్టుకో లేకపోయినా, గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం ఈ 5 పంచ పూజలు అని పిలువబడతాయి ఇవి ఇవ్వాలి. ఆఖరున రెండు చేతులు జోడించి గుండెకాయ కు చేర్చి " ఓం సం సర్వాత్మనే సర్వోపచార పూజ పరికల్ప యామి" అంటే ఉపచారములు ఇచ్చినట్టే, అపచారములు



పోయినట్టే. ఇలా పూజ చేయాలి.ఇవ్వన్నీ అయ్యాక ఇప్పుడు సహస్రనామ స్తోత్రంతో , ఎనిమిది ఎక్కువగా కలిగిన సహస్రం అష్ట ఉత్తర సహస్ర ము. లలితా సహస్ర నామము అవ్వచ్చు ,దుర్గా సహస్ర నామము అవ్వచ్చు ,మహాలక్ష్మి సహస్ర నామము అవ్వచ్చు ఏదైనా ఒక సహస్రనామము చదవండి. సహజంగా లలితా సహస్ర నామములు ప్ర భావం ఎక్కువగా ఉంటుంది, అద్భుతమైనటువంటి నామాలు, మాట వరసకు కూడా అందులో ఒక్క వ్యర్థ పదం కూడా లేదు, సహజంగా సహస్రనామాల్లో తు. చ లు ఉంటాయి, ఒక్క లలిత సహస్రనామ ము లో మొదటి నుంచి చివరి దాకా ఒక్కటి కూడా వ్యర్థ పదము ఉండదు, అలా తు. చ లు లేని ఏకైక సహస్రనామము బ్రహ్మాండ పురాణము లో ఉన్న లలితా సహస్ర నామము, అందుకే దానికి అంతటి గొప్పశక్తి. అంతా మంత్ర స్వరూపమే, మానవులు రాయలేదు వశిన్యాది వాగ్దేవతలు రాశారు.వశిని,కామేశ్వరి,మోదిని, విమల,ఆరుణ, జయిని, సర్వేశ్వరీ, కౌళిని.అని పేరు కలిగిన ఎనిమిది మంది వాగ్దేవతలు, అమ్మ యొక్క అనుగ్రహంతో పుట్టి, అమ్మ అనుగ్రహంతో ఆవిర్భవించి ఈ సహస్రనామాన్ని రాశారు. అందుకే అది భువన బ్రహ్మాండాల లో కల్లా గొప్పది. స్త్రీలే ఋషులు గా కలిగిన సహస్రనామం, తు.చ లు లేనటువంటి సహస్రనామం, పూర్తిగా మంత్ర బీజములు తో కూడిన టువంటి నామాలు. అటువంటి నామములతో పూజిస్తే మరీ మంచిది.నారదుడు ఒక్కొక్క నామం చెబుతూ ఉంటే రాముడు ఒక్కో పువ్వు పెడుతున్నాడు. నమః అన్నప్పుడు పువ్వు అక్కడ పెట్టాలి. ఎవరో తరుముతున్నట్టు చకచకా చదవకూడదు. నామములు ఎప్పుడూ స్పష్టంగా చెప్పాలి, నమః అన్నప్పుడల్లా ఒక పువ్వు వేయడానికి అవకాశము ఇవ్వాలి. నారదుడు అలా చేసాడు. ఇంక ఆఖరున రెండు నామములు మిగిలాయి...శివ శక్త్యైక రూపిణీ , లలితాంబిక ఈ రెండు నామములు చదవాలి. చిత్రంగా రెండు పువ్వులు తక్కువ అయ్యాయి. 1006 అయితే ఉన్నాయి, ఇక రెండు లేవు. రెండు నామములు మిగిలి ఉన్నాయి, రెండు పువ్వులతో పూజ చేయాలి. నారదుడు కంగారుపడి రామచంద్ర ఇంకా రెండు నామాలు మిగిలాయి కానీ పుష్పాలు రెండు తగ్గాయి. పూజ కనక ఇలా కొరత వస్తే అది మహా ప్రమాదం, మొదటిలోనే పువ్వులు వేయం అక్షతలు వేస్తాం అనాలి. మనము అలా అనలేదు వెయ్యి ఎనిమిది పువ్వులతో చేస్తాము అని సంకల్పం చెప్పాము, సంకల్పము చెప్పిన తరువాత తప్పు చేయకూడదు, దీక్షకి అది విరుద్ధము. ఇప్పుడు ఏం చేయను ??? నామాలు చదివి తే నమః అన్నాక పువ్వు వేయడానికి లేదు. పువ్వు వేయకపోతే నామము చదవకూడదు. పూజ మధ్యలో ఆగిపోతే అది మహా దోషం కదా!! పాపం కదా!! ఏం చేయాలి అన్నాడట నారదుడు.అప్పుడు రాముడు తెల్లబోయి.. ఆంజనేయా! కచ్చితంగా 1008 లెక్క పెట్టమన్నాను కదా!! పెట్ట లేదా అని అన్నాడట. అదేమిటి స్వామి నేనేమైనా లెక్కల్లో అంత సామాన్యుడిని గణిత శాస్త్ర పండితుడిని అందులోనూ మీ భక్తుడిని మీ దాసుడిని మీ నామస్మరణ చేసిన వాడిని ఖచ్చితముగా 1008 లెక్క పెట్టాను ,మాటవరసకి కూడా నేను తగ్గించలేదు. ఎందుకు మాయ మయ్యాయో తెలియదు అన్నాడట ఆంజనేయుడు.అప్పుడు రాముడు ఇప్పుడు పూజ ఆపకూడదు,ఇప్పటికిప్పుడు హిమాలయాలకు వెళ్లి పువ్వులు తెచ్చే లోపు కాలం పోతుంది. నారదా నువ్వు నామము చదివే యి అన్నాడట. మరి పువ్వు అని అడిగితే. పువ్వులు నేను తెస్తాను అన్నాడు రాముడు. నారదుడు తక్కిన రెండు నామములు కూడా చదివేశాడు నమః నమః అంటూ.... ⋆రాముడు ఒక గొప్ప అద్భుత సాహస కార్యము చేసాడు, ఈ రేకుల తామర పువ్వులతో అమ్మను పూజించాలి సమయానికి నా దగ్గర రెండు తామరపువ్వులు తగ్గాయి, తామర పువ్వులకు బదులు ఇంకే తామర పువ్వు ఇవ్వాలి??, హా మా అమ్మ నన్ను రామా!పద్మపత్రాక్ష! అంటుంది.రామా నీ కళ్ళు తామరపువ్వు లాంటివి ,తామర పువ్వు లాంటి కళ్ళు కలిగినవాడా, ఒక్క మా అమ్మే కాదు లోకమంతా ఏమంటుందో తెలుసా??? రామః కమల పత్రాక్షః సర్వ శత్ర మనోహరః (రాముడు తామర పువ్వుల వంటి కళ్ళు



కలిగిన వాడు అని హనుమంతుడు సుందరకాండలో సీతాదేవి దగ్గర ఈ వర్ణన చేసాడు.ఇలా ఎక్కడికక్కడ అందరూ రాముని పద్మాక్ష, కమల పత్రాక్ష అంటున్నారు.) అంటే నా కళ్ళు తామరపువ్వులు, ఈ తామర పువ్వులు ఉండగా వేరే తామరపువ్వులు ఎందుకని??నారదుడు నామము చదవగానే, ఠక్కున కుడి కన్ను తీసి అమ్మ పాదాల దగ్గర వేశాడు మళ్లీ ఆ తర్వాత నామము చదవగానే ఎడమ కన్ను పీకి అమ్మవారి పాదాల దగ్గర వేశాడు. ఈ పని మామూలు వాడు చేయగలడా?? స్వామి చేశాడని మనము చేయకూడదు, ఆయన స్థాయి వేరు మన స్థాయి వేరు, మనం చేస్తే చస్తాం, ఆయన భగవంతుడు ఆ భక్తి వేరు ఆ శ్రద్ధ వేరు ఆ కాలం వేరు.... అలా రెండు కళ్ళు అక్కడ వెయ్యగానే, దేవతలు హాహాకారాలు చేసి పుష్పవర్షం కురిపించారు,,, దేవదుందుభులు మ్రోగాయి.. ఠక్కున ఎదురుగుండా ఉన్న విగ్రహం లో నుంచి అమ్మవారు ప్రత్యక్షమై పోయింది,,,తన చేత్తో వెంటనే రాముడి కళ్ళను నిమిరింది ,వెంటనే రాముడికి రెండు కళ్ళు వచ్చాయి""" రామా నువ్వే నేను నేనే నువ్వు""నువ్వు పరమ భక్తుడివి అని లోకానికి తెలియజేయడానికి సాక్షాత్తు అవతారమూర్తి వి అయిన విష్ణువు అని లోకానికి తెలియజేయడానికి,నీ భక్తిప్రపత్తులు లోకానికి చాటడానికి నేనే రెండు పువ్వులు మాయం చేశాను.⋆నువ్వేమీ కంగారు పడకుండా నేత్రాలని పువ్వులుగా ఇచ్చావు. నీ భక్తికి మెచ్చాను. శీఘ్ర కాలంలో రావణుడిని సంహరించి, సీతను తీసుకు వస్తావు, యుగయుగాల వరకు నీ నామము, నీ కథ జగత్ ప్రసిద్ధి కెక్కుతాయి. నీ కథ చదివిన వారు సకల శుభాలను పొందుతారు. రామాయణము మహేతిహాసము గా జగత్ప్రసిద్ధి కెక్కుతుంది. ఈ దశమినాడు తామర పువ్వు లాంటి కళ్ళు ఇచ్చి నన్ను మెప్పించావే.... దానితో నేను సంతోషించాను. నీ పేరు మీదుగా రామ దశమి విజయదశమి అవుతుంది. రాముడికి కూడా విజయుడు అని పేరు. నీ పేరు మీదుగా ఈ దశమి ప్రసిద్ధికెక్కుతుంది. ఈ విజయదశమి నాడు జమ్మి పూజ చేసి, నన్ను పూజించి, తామర పువ్వులతో పూజించి ఈ కథ విన్న వారికి సంపూర్ణమైన కైవల్యము ఇస్తాను. నీ అనుగ్రహము కలిగేలా చేస్తాను. ఈ కథ చాలా గొప్పది... ఈ రోజున విన్నవాడు కొన్ని కోట్ల యజ్ఞముల ఫలితం పొందుతాడు, తీర్థయాత్ర ఫలితము పొందుతాడు, శుభము పొందుతాడు అని అమ్మ దీవించింది.కథ అక్షతలు చేతిలో పట్టుకొని ఈ కథ విని అమ్మ పాదాల దగ్గర వేసి ఆ తర్వాత శిరస్సున జల్లుకోవాలి... మా అనుగ్రహం తో సకల శుభాలు పొందుతాము.. రాముడు చేసిన పూజ ఫలితము మనకు వస్తుంది. ఈ విజయదశమినాడు విజయుడు జమ్మి చెట్టుకు పూజ చేసి, అమ్మవారిని పూజించి జమ్మి చెట్టు మీద ఉన్న గాండీవాన్ని తెచ్చుకున్నాడు, అందు వల్ల కూడా విజయదశమి అని పిలువబడింది, విజయుడికి విజయము ని తెచ్చి పెట్టింది కాబట్టి విజయదశమి అయింది. ఈరోజు అర్జునుడు గాండీవాన్ని తెచ్చుకున్నాడని, జమ్మి కి ప్రదక్షిణ చేశాడని, అమ్మని పూజించాడని, మనము తలుచుకొని ఆ కథాక్షతలు కూడా అమ్మ దగ్గర వేసి ఆ అక్షతలు నెత్తి మీద వేసుకుంటే, అర్జునుడికి అమ్మవారు ప్రసాదించిన విజయము మళ్లీ మనకు లభిస్తుంది. అంటే ఇటు రామ కథ అర్జున కథ ఇవి మనము గుర్తుకు తెచ్చుకోవాలి.ఈరోజు తామర పువ్వులతో పూజించండి. కలువ పువ్వులతో పూజించండి. గురువుగారు చెప్పిన రెండు కథలను తలచుకోండి, కథాక్షతలు నెత్తి మీద చల్లుకోండి, జమ్మి కి ప్రదక్షిణ చేయండి, జమ్మి ని పూజించండి, అమ్మని పూజించండి, పిండివంటలు నైవేద్యం పెట్టి మీరు తిని ఇతరులకు పంచి పెట్టండి, గురుపూజ చేయండి తద్వారా మళ్లీ సంవత్సరకాలం అన్ని రంగాలలో విజయమే లభిస్తుంది .ఈ విజయదశమి పర్వదినం అందరికీ సకల శుభాలను చేకూర్చి పెట్టు గాక !అని గురువుగారు మంగళాశాసనము చేశారు.

*****



सत्यं वद - धर्मं चर

# శ్రీ ప్రణవపీఠం

ఏలూరు







## దసరా శుభాకాంక్షలు